

ఆంధ్రప్రదేశ్

జనవరి 1977

వెల : 50 పైసలు

కందుకూరి వీరేశలింగం


చిన్నప్పట్నుంచీ ఆ ఇద్దరు మిత్రులూ, వీరేశలింగమూ ప్రాణస్నేహితులు. ఆ ఇద్దరు మిత్రులు ఇలా అన్నారు
నువ్వు వెంటనే చేపట్టవలసిన కార్యం ఒకటి ఉంది. అది స్త్రీ పునర్వివాహం!
అమ్మయ్యో! అది మనకు తలకు మించిన కార్యం! ఏ మహారాజో చేపట్టవలసిన పని!
అలా అనకు! ఈ దురాచారాన్ని రూపుమాపాలి. ఎంత మంది పసి పిల్లలు జీవితాంతం దీనికి బలి అవుతున్నారు!
అయితే సరే! ఎవరు నన్ను వదిలేసినా నువ్వు నాతో ఉంటావా!
అందుకు ఆ ఇద్దరు మిత్రులు సరేనన్నారు. అప్పటి నుంచే వివేకవర్ధని లోనూ బహిరంగ సభల్లోనూ వీరేశలింగం స్త్రీ పునర్వివాహం – శాస్త్ర సమ్మతం అని చాటటం మొదలు పెట్టాడు.
ఎంత పొగరు ఈ కుర్ర వెధవకు.
పళ్ళు రాలగొట్టాలి.
దీనితో వీరేశలింగానికి శత్రువులు రోజు-రోజుకీ ఎక్కువ అయ్యారు. బహిరంగ సభల్లో ఈ విషయం మాట్లాడు-తుండగా చెప్పులూ రాళ్ళూ పడ్డాయి.
వాణ్ణి కొట్టండి!
తన్నండి!
అయినా వీరేశలింగం సంఘంలో ఉన్న ఈ భయంకరమైన దురాచారాన్ని రూపుమాపడానికి నడుం కట్టుకున్నాడు. ఎన్ని అడ్డంకులు వచ్చినా నిలబడ్డాడు. ఒకరోజు కొంతమంది విద్యార్థులు—
అయ్యా! బాల వితంతువులుంటే పెళ్ళి చేసుకోవడానికి మేము సిద్ధంగా ఉన్నాము.
నిజంగానా! చాలా సంతోషం!
ఏ మహారాజో, ప్రభుత్వమో చేపట్టవలసిన కార్యాన్ని ఒక యువకుడూ అధ్యాపకుడూ అయిన వీరేశలింగం చేపట్టాడు. దానికి చాలా ధనం అవసరం. తన దగ్గరున్న డబ్బును ఖర్చు పెడుతున్నాడు నలుగురు అనుచరుల్ని పిలిచి—
ఈ డబ్బు తీసుకుని పరిసర గ్రామాలకు వెళ్ళి, బాల వితంతువులు ఎక్కడైనా ఉన్నారేమో యుక్తిగా తెలుసుకుని రండి!

ఆంధ్రప్రదేశ్

సంపుటి : 21 | జనవరి, 1977 మార్గశిర-పుష్య 1898 శా.శ. | సంచిక : 3

ప్రధాన సంపాదకులు :
శ్రీరాజ్యం సిన్హా

సంపాదకులు :
కుందుర్తి ఆంజనేయులు

సంక్రాంతి ప్రత్యేక సంచిక

ముఖచిత్రం : గిరిజనుల కలలు ఫలిస్తున్నాయి
(ఫోటో : శ్రీ నందగోపాల్ నాయుడు)

రెండు,మూడు కవరుపేజీలు : వీరేశలింగం జీవిత చరిత్ర
(బుజ్జాయి బొమ్మల చిత్రాలు)

చివరి కవరుపేజీ :
తుఫాను రాకముందు
(ఫోటో : శ్రీ పవన్ కుమార్)

మధ్యపేజీల్లో: తుఫాను దృశ్యాలు

రిజిస్టరునెం : హెచ్. హెచ్. డి. 81

వెల: 50 పైసలు

సాలుచందా : ఆరురూపాయలు

ప్రచురణ :
డైరెక్టర్,
సమాచార, పౌరసంబంధశాఖ,
హైదరాబాద్


ముద్రణ :
డైరెక్టర్,
ప్రభుత్వ కేంద్ర ముద్రణాలయం,
హైదరాబాద్.

47–1

ఈ సంచికలో...

తుఫాను బాధితులను ఆదుకోవాలని ప్రజలకూ, స్వచ్ఛంద సేవాసంస్థలకూ

గవర్నరు విజ్ఞప్తి



రాష్ట్రంలో యిటీవల వచ్చిన తుపాను కారణంగా భారీ ఎత్తున నష్టం వాటిల్లి వేలాది ప్రజలకు చెప్పలేనంత దుస్థితిని కలిగించింది. ఆస్తులకు, ప్రాణాలకు ఎక్కువగా నష్టాన్ని కలిగించే ఈ ప్రకృతి వైపరీత్యం ఒకే మాసంలో మూడవసారిగా వచ్చి రాష్ట్రాన్ని దెబ్బతీయడం ఎంతో దురదృష్టకరమైన విషయం. ప్రకృతి క్రూరహస్తం నెల్లూరు నుండి తూర్పుగోదావరి వరకు దుర్భరస్థితిని కల్పించి ఇప్పుడు విశాఖపట్టణం, శ్రీకాకుళం జిల్లాలకు కూడా ప్రాణాపాయకరంగా వ్యాపిస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా, రాయలసీమ ప్రాంతాలలోనే కాకుండా పొరుగు రాష్ట్రమైన తమిళనాడులో కూడా యిదివరకు ఎప్పుడూ లేనంత దుస్థితిని తెచ్చి పెట్టడం నాకెంతో విచారాన్ని కలిగిస్తున్నది.

తుపాను దెబ్బతిన్న ప్రాంతాల్లోని ప్రజలకు నేను నా మనః పూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాను. వారిప్పుడు ప్రకృతి కల్పించిన క్రూరమైన దుస్థితి ఫలితాలను ధైర్యంగా సహనంతో ఎదుర్కోవలసి ఉంది. ఈ ప్రాంతాల్లో వెంటనే సహాయ చర్యలు తీసుకుని బాధలను తొలగించేందుకు రాష్ట్రం ఎంతో ఘనంగా యత్నిస్తున్నది. ఏది ఏమైనప్పటికీ ఇటువంటి సందర్భాలలో రాష్ట్ర యంత్రాంగం కంటే ప్రజలందరూ కలసి ఎంతో ఎక్కువగా చేయగలుగుతారు. సేవాసంస్థలు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు, పునరావాసకృషిలో తమ చేయూతనివ్వాలని నేను వారికి విజ్ఞప్తి చేస్తున్నాను.

ఆంధ్రప్రదేశ్ ప్రజలందరి తరపున, ముఖ్యంగా తుఫాను, వరద తాకిడికి గురియైన వారి తరపున, ఆంధ్రప్రదేశ్ ప్రజల పట్ల సానుభూతి చర్యగా ఉపాధి చర్యల నిమిత్తం రూ. 3 లక్షల విరాళాన్ని అందజేసిన ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీకి నా కృతజ్ఞతాభివందనములు తెలియజేస్తున్నాను

తుఫాను సహాయక చర్యలు

ముఖ్యమంత్రి ప్రకటన



వరదలు, తుఫానుకు గురి అయిన నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం కృష్ణా గుంటూరు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల కలెక్టర్లు, కడప డి ఆర్ ఓ. అధికార స్థాయి సమావేశం జరిపిన తరువాత ముఖ్యమంత్రిని, రెవిన్యూ శాఖ మంత్రిని కలిశారు. ఈ జిల్లాలలో తుఫాను వరదలవల్ల కలిగిన నష్టాన్ని గూర్చి ఖచ్చితమైన వివరాలను యింకా రూపొందిస్తున్నప్పటికీ కలెక్టర్లు అందజేసిన తాత్కాలిక అంచనాలను బట్టి ఈ ఉపద్రవాల వల్ల రూ. 224 కోట్లకు పైగా తీవ్రమైన నష్టం వాటిల్లినట్లు వెల్లడయింది.

ఈ జిల్లాలలో తుఫానులు, వరదల వల్ల 159 మంది ప్రాణాలు కోల్పోయారు. రూ 52 లక్షలకుపైగా విలువ చేసే 1 600ల పశు సంపదకు నష్టం కలిగింది, 1.9 లక్షలకు పైగా యిండ్లు కూలిపోవడం, నష్టం వాటిల్లడం జరిగింది. ఈ నష్టం దాదాపు రూ. 10 కోట్లకు ఉంటుందని అంచనా. 1,400లకు పైగా నీటి వనరులకు నష్టం కలిగింది. వాటి మరమ్మతు కనీస ఖర్చుకు రూ. 5 కోట్లు అవసరమవుతాయి. రోడ్లు, భవనాలు, యితర ప్రభుత్వ ఆస్తుల మరమ్మతుకు మరో 8 కోట్లు ఖర్చవుతాయి.

పంటలకు అపారమైన నష్టం కలిగింది. 16 లక్షల ఎకరాలకు పైగా వరిపంట, 4.5 లక్షల ఎకరాలకు పైగా యితర పంటల పైర్లు బాగా దెబ్బతిన్నాయి. పైర్లునష్టం విలువ ఎంతలేదన్నా రూ. 190 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. పంట కోతల తర్వాత నిల్వచేసిన పశుగ్రాసం, ధాన్యం వరదలలో కొట్టుకొ పోయిన వాటి విలువను యిందులో కలపలేదు.

యింటికి రూ. 150 చొప్పున సహాయాన్ని జిల్లా కలెక్టర్లు అప్పుడే పంపిణీ చేశారు. తుఫానులో నష్టం కలిగిన పొగాకు బ్యారన్ల మరమ్మతు నిమిత్తం ఋణాలు మంజూరు చేయడానికి జిల్లా కలెక్టర్ల వద్ద తగినన్ని మొత్తాలను ఉంచారు. సాధ్యమైన చోట్ల రాబీ పంటలు సేద్యం చేయడానికి వీలుగా పరపతి సౌకర్యాలు సకాలంలో అందజేయటానికి ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నారు బాధిత కుటుంబాల ప్రయోజనార్థం దుస్తులు మొదలైనవి పంపిణీ చేయడానికి వీలుగా వివిధ జిల్లా కలెక్టర్ల అధీనంలో ముఖ్యమంత్రి సహాయక నిధి నుండి మొత్తం రూ. 3.85 లక్షలు ఉంచారు. నిధి తరపున డబ్బు విరాళాలను స్వీకరించే అధికారాన్ని హైదరాబాదులోని ప్రభుత్వ రెవిన్యూ శాఖ కార్యదర్శికి, యా జిల్లా కలెక్టర్లకు యివ్వబడింది.

ప్రాథమిక నివేదికలను యిదివరకే కేంద్రానికి పంపారు. దానితోపాటు బాధిత జిల్లాలలో జరిగిన నష్టం వివరాలను, సహాయక ప్రతిపాదనలతో కూడిన మదింపు నివేదికలను కేంద్ర ప్రభుత్వానికి పంపుతున్నారు. కేంద్ర బృందాన్ని పంపాలని వారికి మరొకసారి విజ్ఞప్తి చేస్తున్నారు.

భవిష్యత్తులో యింటువంటి ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోవడానికి శాశ్వత ప్రాతిపదికపై ఏర్పాట్లు చేయడానికి వీలుగా ఉన్నత స్థాయి సంఘాన్ని ఏర్పాటుచేసే విషయం పరిశీలనలో ఉన్నది.

ఆయా జిల్లాలలో తుఫాను సహాయక చర్యల అమలును సమీక్షించాలని జిల్లాలో 20 సూత్రాల సమీక్షా సంఘాలను కోరుతున్నారు.

* * * *

మన రాష్ట్రంలో మును పెన్నడూ కనీవినీ ఎరుగని రీతిగా పెనుతుఫానులు, వరదలు సంభవించి అపారమైన నష్టాన్ని కలిగించిన విషయం మనందరికీ తెలిసిందే. 7 జిల్లాలు యీ తుఫానువల్ల తీవ్రంగా నష్టపడ్డాయి. ఇందువల్ల నెల్లూరునుండి తూర్పు గోదావరి జిల్లావరకు మొత్తం కోస్తా ప్రాంతానికి, చిత్తూరు జిల్లాకు యీ దెబ్బ బాగా తగిలింది.

రాష్ట్ర ప్రభుత్వం సాధ్యమైన సహాయక చర్యలన్నిటినీ తీసుకుంటున్నప్పటికీ, ఈ కష్టసమయనుండి గట్టెక్కడానికి తమ సంపూర్ణ సహాయ సహకారాలు అందజేయాలని వ్యక్తులను, సంఘాలను, కంపెనీలనూ, అధికార సంస్థలను నేను కోరుతున్నాను. ఈ మహత్తర కార్యక్రమంలో తమకు సాధ్యమైన సహాయం అందజేయాలని ప్రతిఒక్కరికీ నేను విజ్ఞప్తి చేస్తున్నాను. విరాళాలను ప్రభుత్వ కార్యదర్శి, రెవిన్యూ శాఖ, ఆంధ్రప్రదేశ్ సచివాలయం, హైదరాబాదుకు పంపాలి. అన్ని చెక్కులను ముఖ్యమంత్రి సహాయక నిధికి పంపాలి. ఔషధాలు, వస్త్రాలు, యితర వస్తువులను ప్రభుత్వ కార్యదర్శి, రెవిన్యూ శాఖకు గాని, నేరుగా జిల్లా కలక్టర్లకు గానీ పంపవచ్చు.

తుఫాను బీభత్సం

ఆర్థిక, సమాచార శాఖమంత్రి విజ్ఞప్తి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ ద్విదశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటూ, అభివృద్ధి పథంలో మనం సాధించిన విజయాలను సమీక్షించుకుంటున్న ఆనందోత్సాహాల సంరంభ సమయంలో హఠాత్తుగా ప్రకృతి మనపట్ల క్రూరంగా ప్రవర్తించి మన సంతోషాన్నంతటినీ హరించివేసింది. గతనెలలో ఒకటి గాదు, రెండు కాదు వరుసగా మూడుసార్లు వెంటవెంట తుఫానులు సంభవించి మనరాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేశాయి. వర్షాలు, వరదలు, పెనుగాలులు మన రాష్ట్రంలోని కోస్తా ప్రాంతాన్నీ ముఖ్యంగా కోస్తాలోని దక్షిణ భాగాన్నీ బీభత్సం చేశాయి. ఎంతో ప్రాణనష్టం కలిగింది. ఎంతో కష్టపడి చేమటోడ్చి ప్రాణప్రదంగా పెంచిన పంట చేలు వరదల పాలైనవి. వేలాదిమంది నిరుపేదలు నిరాశ్రయులైనారు. పశుసంపదను కోల్పోయారు. ఎంత తక్కువ అంచనా కట్టినప్పటికీ రూ. 224 కోట్ల మేరకు నష్టం కలిగి ఉంటుందని అంచనా.

నిస్సహాయులైన నిరుపేదలను బాధల నుండి గట్టెక్కించడానికి ప్రభుత్వం వెంటనే సహాయక చర్యలను ప్రారంభించింది. ఈ బీభత్సానికి గురిఅయిన బాధితుల సహాయార్థం అనేక చర్యలను తీసుకుంటున్నారు. అయితే యిది ఒక్క ప్రభుత్వం మాత్రమే చేయగలిగిన పనికాదు. ప్రజాసేవాతత్పరతగల వ్యక్తులు, సంస్థలు కూడా యీ విపత్కాలంలో భాగం పంచుకోవాలి. ధనరూపేణా, వస్తురూపేణా సహాయం చేయాలని ముఖ్యమంత్రి చేసిన విజ్ఞప్తి ప్రజలను ఎంతగానో ప్రభావితం చేసింది.

ఇటువంటి విపత్కర పరిస్థితులు ఏర్పడడం సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఎంతో ఉత్సాహంతో సహాయ చర్యలు తీసుకోవడం మనకేమీ కొత్తకాదు.

గతంలో యిటువంటి విపత్కర పరిస్థితులలో మన రాష్ట్రంలోని చలనచిత్ర పరిశ్రమ ఎంతో ఉదారంతో సేవాతత్పరతతో ముందుకు వచ్చి సహాయపడిన సందర్భాలను గుర్తుచేయదలచాను. ముఖ్యంగా గతంలో మన రాష్ట్రంలో రాయలసీమలో దుర్భిక్ష పరిస్థితి ఏర్పడినప్పుడు, డెల్టా ప్రాంతంలో వరదలు వచ్చినప్పుడు చలనచిత్ర పరిశ్రమ చేసిన అమోఘమైన సేవలను సగర్వంగా మనం మననం చేసుకోవచ్చు. చలనచిత్ర రంగంలోని అన్ని వర్గాల ప్రజలు ధనరూపేణా వస్తురూపేణా వెంటనే యితోధికంగా విరాళాలు అందజేయాల్సిన సమయం మరోసారి యిప్పుడువచ్చింది.

ఒకరోజు మొత్తం నాలుగుఆటల వసూళను విరాళంగా యివ్వాలని రాష్ట్రఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, విజయవాడలోని ఆంధ్రఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, మద్రాసులో దక్షిణ భారతఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, మద్రాసు లోని తెలుగు ఫిల్మ్ నిర్మాత మండలి, సినీ ఆర్టిస్టుల సంఘం, ఫిల్మ్ ఫ్యాన్స్ సంఘం, ఫిల్మ్ పంపిణీదారులు, చలనచిత్ర పరిశ్రమతో సంబంధం ఉన్న వివిధ సంస్థలకు నేను విజ్ఞప్తి చేస్తున్నాను.

స్వచ్ఛంద సంస్థలు, సహాయం నిమిత్తం ప్రత్యేక ప్రదర్శనలను ఏర్పాటు చేయడానికి వీలుగా వాటికి తమ చిత్రాల కాపీలను యివ్వాలని చలనచిత్ర పంపిణీదారులకు విజ్ఞప్తి చేస్తున్నాను.

వరద బాధితుల సహాయం నిమిత్తం స్థానిక కళాకారులతో బహిరంగస్థలాల్లో నాటకాలను ప్రదర్శించాలని రాష్ట్రంలోని నాటక సమాజాలకు నేను విజ్ఞప్తి చేస్తున్నాను. నిధుల దుర్వినియోగం జరగకుండా చేయడానికి వీలుగా జిల్లా పౌరసంబంధాల అధికారుల సేవలను వినియోగించుకోవాలని కోరుతున్నాను.

ఈ కృషిలో పూర్తిగా పాల్గొని విజయవంతం చేయాలని యువజన కాంగ్రెసుకు విజ్ఞప్తి చేస్తున్నాను.

సంబంధితులందరూ నిర్విరామంగా కృషి చేస్తారనడంలో నాకెట్టి సందేహంలేదు.

తుఫానుబాధితుల కోసం ప్రభుత్వం తీసుకున్న చర్యలు

నవంబరు నెలలో వరసగా మూడుసార్లు రాష్ట్రంలోని కోస్తా జిల్లాలు తుఫాను దెబ్బకు గురి అయినవి. నెల్లూరునుండి విశాఖపట్నం వరకు కోస్తా జిల్లాల్లో పంటలకు, ఆస్తులకు విశేష నష్టం జరిగింది. ముఖ్యంగా నెల్లూరు జిల్లా తుఫాను తాకిడివల్ల చాలా నష్టాన్ని పొందింది. రాష్ట్రంలో తుఫాను వల్ల దెబ్బతిన్న ప్రాంతాలలో రాష్ట్రప్రభుత్వం అత్యవసర సహాయక చర్యలను చేపట్టింది. కేంద్రప్రభుత్వానికి తుఫాన్‌వల్ల జరిగిన నష్టం తెలియజేశారు. తుఫానువల్ల కలిగిన నష్టాన్ని అంచనావేసి, కేంద్ర సహాయాన్ని సూచించేందుకు అధికారుల బృందాన్ని పంపవలసిందని రాష్ట్ర మంత్రివర్గం కేంద్రాన్ని కోరింది. ప్రణాళిక సంఘం సలహాదారు శ్రీ సతీష్‌చంద్ర నాయకత్వాన, వ్యవసాయ మంత్రిత్వశాఖ సహాయ కార్యదర్శి శ్రీ ఎస్. కె. సక్సేనా ప్రభృతులతో కూడిన కేంద్ర అధికారుల బృందం డిసెంబరు 22వ తేదీ నుండి మన రాష్ట్రంలో పర్యటించారు. తుఫాను నష్టాలనుగురించి చర్చలు, పరిశీలనలు జరిపారు. తుఫాను నష్టం ఎక్కువగనే వున్నట్లుగా యీ బృందం వారు అభిప్రాయం వెల్లడించారు.

తుఫానుకు గురియైన ప్రాంతాలలో ఉత్పత్తిదారుల ధాన్యం లెవీ మినహాయించారు. నిబంధనల ననుసరించి రైతులకు శిస్తు రెమిషన్ కలగజేశారు గాలివానకు ఎక్కువ ఆస్తి నష్టం, ప్రాణ నష్టం కలిగిన చిత్తూరు, నెల్లూరు జిల్లాలలో తక్షణం ఉపాధి చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వ అధికారులను ఆదేశించారు. ప్రాణ నష్టము జరిగిన సందర్భాలలో రూ 1,000లను, గృహాలు కోల్పోయిన వారికి ఒక్కొక్కరికి రూ. 160 లను ఆర్థిక సహాయం కలగజేశారు. గండ్లు పడ్డ చెరువులు, రహదారులు బాగు చేసేందుకు నిధులు కేటాయించారు.

వర్షం వల్ల రంగుపోయిన ధాన్యాన్నికూడా భారత ఆహార సంస్థ కొనుగోలు చేసేట్లుగా ప్రమాణాలను సడలించటానికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేసిన ఫలితంగా తడిసిన, మొక్క మొలచిన, వండీపండని, రంగుమాసిన ధాన్యం, నూకలు మొదలగు వాటి విషయంలో కొనుగోలు ప్రమాణాల వర్గీకరణనిబంధనలు సడలించాలని డిసెంబరు నెలలో కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రాంతాల రైతులు తెచ్చే ధాన్యాన్ని కొనగోలు చేయడానికి మరికొన్ని కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆహార సంస్థను కేంద్ర ప్రభుత్వం కోరింది. ప్రయత్నిస్తున్నది. తుఫాను వల్ల నష్టపోయిన ప్రాంతాలలో తక్షణ సహాయం కల్పించేందుకు ప్రధానమంత్రి రూ 3 లక్షల విరాళం ప్రకటించారు.

తుఫానువల్ల దెబ్బతిన్న ప్రాంతాలను ముఖ్యమంత్రి రెవిన్యూ మంత్రి, విద్యామంత్రి, యితర మంత్రులు, రెవిన్యూ బోర్డు సభ్యులు సందర్శించి సహాయక చర్యల విషయమై స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి హెలికాప్టరులో నెలూరు, చిత్తూరు జిల్లాలలో తుఫాను దెబ్బతిన్న ప్రాంతాలను పర్యవేక్షించారు. టెలిఫోనులో ప్రధానమంత్రికి తుఫానువల్ల కలిగిన నష్టాలను తెలియజేశారు.

తుఫాను వల్ల పంటలకు భారీనష్టం జరిగినా ఆహారపదార్థాల కొరత ఉండబోదని ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలకు హామీయిచ్చారు. రాష్ట్రంలో $3\frac{1}{2}$ లక్షల టన్నుల బియ్యపు నిల్వలున్నాయనీ, రేషను కార్డులు కలిగిన వారికి చౌక ధరల దుకాణాలద్వారా ప్రతినెలా 40 కే.జీ.ల వరకు బియ్యం సరఫరా చేయటం జరుగుతుందనీ ముఖ్యమంత్రి తెలియజేశారు. దాళ్వా పంటకాలానికి రైతులకు ఋణాల మంజూరీ కోసం రిజర్వు బ్యాంకు రూ. 300 కోట్లు కేటాయించిందని కూడా ఆయన వెల్లడించారు. రాష్ట్రానికి 42 కోట్ల రూపాయలు అవసరమౌతాయని రెవిన్యూ మంత్రి శ్రీ పి. నరసారెడ్డి అన్నారు.

ముఖ్యమంత్రి కృష్ణా, గుంటూరు జిల్లాలలో వరద దెబ్బకు గురి అయిన ప్రాంతాలు పర్యటించారు. కృష్ణా జిల్లాలో 30 లక్షల యెకరాల్లో పంట నష్టం అయిందనీ, సుమారు 45 లక్షల టన్నుల ధాన్యాన్ని మన రాష్ట్రం పోగొట్టుకున్నదనీ ముఖ్యమంత్రి ప్రకటించారు. నష్టపోయిన రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కలిగిస్తామని ముఖ్య మంత్రి ప్రజలకు హామీ యిచ్చారు. డిసెంబరు 20వ తేదీ వరకు ముఖ్యమంత్రి తుఫానుబాధితులనిధికి వచ్చిన విరాళాల మొత్తం రూ. 37 5 లక్షలు దాటింది.

"తుఫాను పెనుభూతం"

ఓ తుఫాను పెనుభూతమా ।
ఎంత పని చేశావు ॥

పంటల పండుగైన
చలిమంటల పండున
మా 'సంక్రాంతి' ని
ఆకలి మంటలు మండగ చేశావు

ఓ తుఫాను పెనుభూతమా ।
ఎంత పని చేశావు ॥

హలాలు కట్టి
పొలాలు దున్ని
నారుని నాటి
నీరును పెట్టి
అహర్నిశలు శ్రమించినదంతా ।
ఫలించు వేళ
చెఱిపి వేశావు

ఓ తుఫాను పెను భూతమా ।
ఎంత పని చేశావు ॥

జంగమయ్యలకు
సాతాని జియ్యరులకు
గంగిరెద్దుల వారికి
బుడబుక్కల వారికి
పిడికెడు భిక్ష లేకుండ
గాదెలన్నీ ఖాళీ చేశావు

ఓ తుఫాను పెను భూతమా ।
ఎంత పని చేశావు ॥

కొత్త అల్లుళ్ళు
అత్తవారిళ్ళకు పోకుండ
పుట్టింటి కూతుళ్ళు
మెట్టింటినుండి రాకుండ
కర్షకాళి ముఖాలలో
హర్షము లేకుండ
కాంతల కన్నుల్లో
కాంతులు కనబడకుండ
అంతా అయోమయము చేశావు

ఓ తుఫాను పెనుభూతమా ।
ఎంత పని చేశావు ॥

బొమ్మల కొలువులు
గొబ్బెమ్మల పూజలు
కోడిపుంజుల పందాలు
పొట్టేళ్ళ పోటీలు
పంటల కళ్ళాలు
వాకిళ్ళలో పఱచిన
రంగవల్లులు
అన్నీ చిన్నబోయినవి

ఓ తుఫాను పెను భూతమా ।
ఎంత పని చేశావు ॥

దేవతలకు
పొంగలి నైవేద్యము లేదు
పితృ దేవతలకు
తిల ప్రదానము లేదు
ముత్తైదువులకు
వాయనాలు లేవు
ముద్దు బిడ్డలలో
మునుపటి నవ్వు లేవు
అంతా ఛిన్నాభిన్నము చేశావు
సంబరాల సంక్రాంతిని
సాగరములో ముంచేశావు

ఓ తుఫాను పెనుభూతమా ।
ఎంత పని చేశావు ॥

— "కూరెళ్ళ"

జనవరి 26

—శ్రీ రావుల సూర్యనారాయణ మూర్తి

హస్తిపురి మోముపై దరహాస ముఖక
లాల్ ఖిలాపైన రెపరెపలాడె నేడె
జనుల నడుమ త్రివర్ణ విజయ పతాక
భారత యశస్సు దశదిశల్ ప్రాకునటులు

ప్రజలు బ్రహ్మ రథంబును బట్టుచుండ
శాంతి పథమున సాగిన సమరమందు
ధీర యోధులు జయము సాధించినారు
దేశ సౌభాగ్య లక్ష్మి సందీపి మెఱయ

భారతీయుల తపములు పండినట్టి
నేటి పర్వదినముననే నిఖిల జనులు
కనకమయమైన భావి లోకమ్ము కట్టి
దీక్షబూనిరి నూతనోత్తేజ మలర

శక్తియుక్తులు గలుగు దేశాలలోనె
తలను పైకెత్తె, నైతిక బలము కలిగి
ప్రజలనే పాలకుల జేయు భాగ్యమంది
తేజరిల్లెడు భరతధాత్రీమతల్లి

త్యాగశీలురు సర్వము ధారవోయ
పారతంత్ర్య విమోచన బడసినట్టి
మాతృదేశము నంగుళ మాత్రమైన
పరుల పాలు కాకుండ కాపాడుమోయి

నవ్య సామ్రాజ్యమూర్తివై నడుము గట్టి
ఐక్య సముపార్జనాగతి నతిశయించి
నిత్య కల్యాణరాశియై నెగడునట్లు
దిద్దుకొనుమయ్య దేశమ్ము ధీరవరుడ!

హైందవులు, ముస్లిములు సిక్కు లఖిల జనులు
మతవిరోధములన్నిటి బ్రతిఘటించి
భావిభాగ్యోన్నతికి రాచబాట వేయ
భారతావని సౌఖ్య సంపన్న మగును

జగతికొక నిత్య నూత్నతేజస్సు నొసగ
సామ్యవాద సమాజ సంస్థాపనమ్ము
జరుపు దీక్షతో ముందుకు సాగుమోయి
పేరుమోసిన భారత వీరపుత్ర!


वन्दे मातरम्: शुभ्र ज्योत्स्ना पुलकित यामिनीम् फुल्लकुसुमिता द्रुमदल शोभिनीम् सुहासिनीम्
सुमधुर भाषिणीम् सुखदाम वरदाम् मातरम् वन्दे मातरम वन्दे मातरम् —
वन्दे मातरम् वन्दे मातरम् सुजलाम् सुफलाम् मलयज शीतलाम् सस्यश्यामलाम् मातरम्
కళాకార్
రాజభద్రయ్య విశ్వకర్మ
c/o Rajart. వరంగల్-2



తండ్రిని మించిన తనయ

—శ్రీ పిడతల రంగారెడ్డి

స్వాతంత్ర్యం పొందిన తరువాత మన దేశం అనేక గడ్డు పరిస్థితులను ఎదుర్కొనవలసివచ్చింది. మొదటి ప్రధాని పండిత జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో మన దేశప్రజలు ఈ కష్టాలలో ఎక్కువ భాగాన్ని విజయవంతంగా ఎదుర్కొగలిగారు. వందలసంవత్సరాలుగా పరిపాలనలో మగ్గిన మన దేశం శ్రీ నెహ్రూజీ నాయకత్వంలో చెప్పుకోతగినంత అభివృద్ధిని సాధించింది. కాని రెండవ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి ఆకస్మిక మరణంతో మన దేశానికి నాయకత్వ సమస్య ఎదురైంది. శ్రీమతి ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా ఎన్నిక కావడంతో దేశానికి తిరిగి మంచి రోజులు రాగలవనే ఆశ ప్రజలలో అంకురించింది.

కాని కొన్ని సంఘవ్యతిరేక శక్తుల కార్యకలాపాలవల్ల మన దేశ అభివృద్ధికి ఎన్నో ఆటంకాలు ఏర్పడ్డాయి. ఇంతవరకు దేశం సాధించిన ప్రగతి వీరి అభివృద్ధి నిరోధక కార్యకలాపాల వల్ల వమ్మయిపోతుందేమో అనే భయం ప్రజలకు కలిగింది కాని శ్రీమతి ఇందిరాగాంధీ సమయస్ఫూర్తిని, విజ్ఞతను, ధైర్యాన్ని ప్రదర్శించి అత్యవసర పరిస్థితి ప్రకటించడంద్వారా దేశంఅనే నావను అల్లకల్లోలమైన పరిస్థితుల నుంచి ఒడ్డుకు మళ్లించగలిగారు. గత ఒక్కసంవత్సరంలో మన దేశం వివిధ రంగాలలో సాధించిన అభివృద్ధిని, ప్రజలలో ఏర్పడిన క్రమశిక్షణ వాతావరణాన్ని అనేక మంది విదేశీ నాయకులు కూడ మెచ్చుకున్నారు. శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వంలో దేశం అత్యంత పురోభివృద్ధిని పొంది ప్రపంచ దేశాలలో అగ్రస్థానాన్ని పొందగలిగింది.

శ్రీమతి ఇందిరాగాంధీ తండ్రిని మించిన తనయ అని పేరు పొందింది. ఇంత పెద్ద దేశాన్ని సమర్థవంతంగా పరిపాలించడానికి అవసరమైన శిక్షణను ఆమె తన చిన్నతనం నుంచే పొందగలిగింది. దేశంలో స్వాతంత్ర్యోద్యమం ముమ్మరంగా సాగుతున్న సమయంలో దానిలో ప్రముఖపాత్ర వహించిన తన తాతగారు మోతీలాల్ నెహ్రూ తండ్రి శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ జాతిపిత మహాత్మాగాంధీ వంటి ప్రముఖ నాయకుల సాన్నిహిత్యం ఆమెకు లభించింది. చదువుకొంటున్న రోజులలోనే తన తండ్రి జైలు నుండి వ్రాసిన ఉత్తరములద్వారా ప్రపంచ చరిత్రను ఆమె అవగాహన చేసుకోగలిగింది. ఈ విజ్ఞానము తరువాతి కాలంలో ఆమె దేశ నాయకత్వం వహించటంలో ఎంతో తోడ్పడింది.

ప్రధానమంత్రి కాకముందే శ్రీమతి ఇందిరాగాంధీ అనేక బాధ్యతాయుత పదవులను అలంకరించి దేశసమస్యలను క్షుణ్ణంగా అర్థం చేసుకోగలిగింది. అఖిలభారత కాంగ్రెస్ అధ్యక్షురాలుగా, కేంద్రమంత్రిగా ఆమె దేశ వ్యవహారాలన్ని గ్రహించగల్గడం వల్ల దేశం సత్వరగతిన అభివృద్ధి చెందడానికి ఏయే చర్యలు అవసరమో ఆమె తెల్సుకోగలిగింది.

బంగ్లాదేశ్‌కు మద్దతు

ప్రధానమంత్రి అయిన కొద్ది సంవత్సరాలలోనే బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాలరద్దు వంటి విప్లవాత్మకచర్యల ద్వారా సోషలిస్టు సమాజ స్థాపనకు ఆమె పునాది వేసింది. తన తండ్రి కంటె ఎక్కువ సాహసాన్ని ప్రదర్శించి బీద ప్రజలకు ఉపయోగపడే తన చర్యలను ఎంత బలమైన శక్తులు ఎదిరించినా వెనుకాడక ఆమె తన విధానాలను పట్టుదలతో కొనసాగించకలిగింది. పాకిస్తాన్ అధినేతల అహంకారానికి గురి అయిన బంగ్లాదేశ్ ప్రజల స్వేచ్ఛ కోసం పోరాడుతున్నప్పుడు శ్రీమతి ఇందిరాగాంధీ ఆ దేశ ప్రజల స్వేచ్ఛకోసం కావలసిన సహాయాన్ని అంతా అందజేసింది. దాని ఫలితంగా బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా అవతరించటం మన అందరికీ తెలిసిన విషయమే.

ఇటీవల మన పార్లమెంటు ఆమోదించిన 44వ రాజ్యాంగ సవరణ చట్టం మనము కలలుకంటున్న సమసమాజస్థాపనకు దోహదం చేయగలదని అన్ని వర్గాలప్రజలు అంగీకరిస్తున్నారు. మనం ఏ అభివృద్ధికర చట్టాన్ని తలపెట్టినా న్యాయస్థానాలు వాటికి అడ్డు తగులుతూ రాజ్యాంగంలో విధించిన ఆదేశసూత్రాల అమలును భగ్నం చేస్తూ వచ్చాయి. ప్రజలలో హక్కులపట్ల మాత్రమే ప్రాధాన్యతను కలిగిస్తూ బాధ్యతలను వారు ఏమాత్రం గుర్తించని రీతిలో కొన్ని రాజకీయపక్షాల నాయకులు ప్రచారం చేస్తూవచ్చారు. ఈ సవరణ చట్టంవల్ల వారి ఆటలు కట్టగలవు. దేశంలోని ప్రతి ఒక్కరు దేశంపట్ల తమ బాధ్యతలను నిజాయితీతో సక్రమంగా నిర్వర్తించేటట్లు ఈ సవరణచట్టం సహాయపడగలదని నా నమ్మకము.

శ్రీమతి ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం బడుగువర్గాల ప్రజల అభ్యున్నతికి ఎంతగా కృషి చేస్తున్నదో మనం చూస్తూనే ఉన్నాం. దేశంలోని బలహీన వర్గాల ప్రజల స్థితిగతులు మెరుగుపడినచో ప్రజాస్వామ్యానికి అర్థంలేదని, అతి ఖర్చుతో కూడిన ఎన్నికలు జఃపటంకన్నా ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి కేంద్రీకరించటం అత్యవసరం అని ఆమె అనేకపర్యాయాలు ఉద్ఘాటించారు. ఈ విధంగా మన దేశం శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వం పొందడం నిజంగా మన అదృష్టమని చెప్పుకోవాలి. నేటి యువతీయువకులందరు ఆమె అడుగుజాడలలో నడచినప్పుడు, ఆమె ఆదర్శాలను నిజం చేసినప్పుడు మన దేశం సుసంపన్నమై ప్రజాస్వామిక దేశాలలో అత్యున్నత స్థానాన్ని పొందగలదు అనడంలో ఎట్టి సందేహం లేదు. *

ఎవరిదీ హస్తం?

కొండల్లో పడివున్న
బండల గుండెల్లో నిద్రిస్తున్న
సుందర ప్రతిమల్ని మేల్కొల్పి, శిల్పితన
ఉలిని సోకించి వెలికి పిలిచిన యట్లు—

నిఘంటువుల్లో
నిక్కుతూ నీల్గుతున్న పదములను
అల్లన యేరి, కవి తన
కలముతో కవిత అల్లిన యట్లు—
నీరవ నిశీధిలో
నీరశించి పోతున్న
మానవతను మీటి,
మృదుల రాగా లెన్నో పలికిస్తోంది।

లోయల లోతుల్లో
కృంగి, కృశించి పోతున్న
బీదా బిక్కిని ప్రేమతో తట్టి,
కాంతి కొండల పైకి దారి చూపుతోంది।

పేదల బ్రతుకుల ముంగిళ్ళలో
పేరుకు పోయిన కలతల - కన్నీళ్ళ
చెత్తా — చెదారం యెత్తి,
రత్నాల రంగవల్లులు తీర్చిదిద్దుతోంది।

తరతరాల దాహంతో
నిదురలేచి, పేదల రక్తం త్రాగుతున్న
దోపిడీ వ్యవస్థను మొదలంట పెరికి,
సమాజాన్ని తేటతెల్లం జేస్తోంది!

ఉన్నత ఆశయంతో
ఉత్కృష్ట కార్యాన్ని చేపట్టి
సమస్యల సాలె గూటిని ఛేదించి,
అందరి బ్రతుకుల ఆనందం చిందిస్తోంది।

కఠిన శిలను కరిగించి
ఊసర క్షేత్రాలను పండించి
కన్న కలలకు ఓ రూపాన్నిస్తోంది.

ఇరుల కురులలో
వెన్నెల విరులు తురుముతోంది —

ఎడారిలో
ఒయాసిస్సు

తమస్సులో
ఉషస్సు

ఎవరిదీ హస్తం?

—ఖమ్రొద్దీన్
ఆంధ్రప్రదేశ్





గాంధీజీ దృష్టిలో స్త్రీ

—వి. సువర్చలారాణి

భారత దేశంలో ఆదికాలం నుంచీ స్త్రీకి ఒక ప్రత్యేక స్థానం గౌరవం యిస్తుండడం జరుగుతూంది. ఒక పురుషునికి భార్యగానూ, తల్లిగానూ—సంరక్షకురాలుగానూ యిలా అనేక విధాలుగా బాధ్యతాయుతంగా తన కర్తవ్యం నిర్వర్తిస్తుంది స్త్రీ. సృష్టికి మూలమైన ఆదిశక్తి, మనకు జన్మ నిచ్చిన తల్లేకాక రెండవతల్లిగా మన దేశం మొదలయిన వాటిని మనం స్త్రీ రూపాలుగా భావించి గౌరవించడం మన దేశంలో స్త్రీకి గల గొప్పతనం వెల్లడవుతుంది.

స్త్రీని కవులు తమ కవిత్వంలో చిత్రంగానూ—ఘనంగానూ వర్ణించారు. తెల్లని మల్లెలాంటిది ఆమె మనసనీ, చల్లని వెన్నెల కురిపించే చంద్ర బింబంలాంటిది ఆమె మోమనీ, సర్వశక్తిమయి అనీ రకరకాలుగా కవులు స్త్రీని చిత్రించారు.

శిల్పులు—చిత్రకారులు అనేక భంగిమల్లో స్త్రీ రూపాలని కన్నుల పండువుగా—వైభవంగా తీర్చిదిద్దారు. సంఘంలో ఆమెకు ఒక ఉన్నత స్థానం కలిగించారు.

రానురాను కొందరి పురుషుల స్వార్థ ప్రయోజనాల దృష్ట్యా—మూఢ నమ్మకాల వల్ల స్త్రీని చిన్నచూపు చూసి—ఆమెను కేవలం తమ బానిసగా చూడడం జరిగింది. తిరిగి కొంత కాలానికి రాజా రామమోహనరాయ్, వీరేశలింగం పంతులు వంటి సంఘ సంస్కర్తలుద్భవించి తిరిగి ఆమెకు ఒక ఉన్నత స్థానాన్ని కల్పించారు. పురుషునితో సమాన హక్కులిచ్చి ఆమెను గౌరవించారు. గాంధీజీ కూడా స్త్రీని గూర్చి తన అభిప్రాయం ఇలా వెల్లడించారు:

"స్త్రీ పురుషునితో సమాన మానసిక శక్తులు కల్గిన ఒక చెలికత్తె, స్నేహితురాలు. మానవుని చర్యలన్నిటిలో—కార్యక్రమాలన్నిటిలో అతినిశితంగా పాల్గొనడానికి ఆమెకు హక్కుంది. పురుషునికున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఆమెకూ ఉన్నాయి." అంటూ,

"ధైర్య సాహసాలతో, స్వార్థ త్యాగం చేయడంలో స్త్రీ పురుషునికన్న ఉన్నత స్థానం ఆక్రమిస్తుంది. అంతేకాక అహింసకి ఆమె అపరావతారం" అనీ, "ఆమెకు పురుషుని కన్న ఎక్కువ ధైర్యం ఉంది. ఆమె లేకపోతే మనిషి ఉండజాలడు. అహింస గనుక మన జీవిత లక్ష్యం అవుతే, మన భవిష్యత్తు మహిళలపై ఆధారపడి ఉంది." అన్నారు.

చరిత్ర పుటలు ఒక్కమారు వెనకకు తిరిగేసి చూస్తే అందులో ధైర్య సాహసాలకు ప్రతీకలుగా—త్యాగబుద్ధికి నిదర్శనంగా ఎందరో స్త్రీలు మనకు సాక్షాత్కరిస్తారు. ఝాన్సీరాణీ, రుద్రమదేవి వంటి వీరవనితలు— అరుంధతి, సుమతి, అనసూయల వంటి నిస్వార్థ హృదయ పతివ్రతలు ఎందరో స్మరణకు వస్తారు. జాతిని జాగృతం చేసిన స్త్రీలు—సరోజినీదేవి లాంటివారు ఎందరో కనిపిస్తారు. కాయం ఉప్పొంగ జస్తారు.

ఇలాంటి వారిని స్మరించినపుడు స్త్రీ అబలకాదు సబల అనిపిస్తుంది.

గాంధీజీ తన వివాహానంతరం, మొదటి రోజుల్లో తన భార్యఅయిన కస్తూరిబాను తనకు భిన్నంగా చూచేవాడు. తను చెప్పేదే వేదం— తను చెప్పేదే న్యాయం అన్న రీతిలో సాగేది ఆయన ఆలోచనా సరళి. తన మాటకు వ్యతిరేకంగా ఆమె ప్రవర్తించిన సందర్భాలలో ఆయనకు విపరీతమైన కోపం వచ్చేది. రానురానుగాంధీజీ ఆదృష్టిని మరల్చుకున్నారు. చివరకు ఆమె విషయం చెప్తూ ఒకసారి, తన భార్య గొప్పతనం వలననే తమ అహింసా ఉద్యమంలో ఆత్మనిగ్రహంలో తిరుగులేని విజయాన్ని పొందటానికి కారణమైందని, ఆమె భారత స్త్రీకి ఆదర్శమూర్తి అని గర్వంగా అభివర్ణించారు. అందుకే ఒకప్పుడు స్త్రీని గూర్చి—

"నేను గనుక స్త్రీనై జన్మించి ఉంటే, ఎవరైనా స్త్రీ పురుషుని ఆటవస్తువు అంటే, నేను తిరుగుబాటు చేస్తాను" అన్నారు. స్త్రీ పై ఆయనకు గల గౌరవాభిమానాలు—సంఘంలో స్త్రీకి యివ్వాల్సిన స్థానమేమిటో అర్థం చేసుకోవటానికి ఆయన చెప్పిన ఈ భావనాకుసుమం ఒక్కటిచాలు.

స్త్రీకి భర్త దైవంతో సమానం అన్న భావన ఉండడంలో నష్టం లేదు. కాని, ఆమాటనే సరిగా అర్థం చేసుకోలేకపోతే తన జీవితాంతం స్త్రీ బాధకు గురి కావలసి వస్తుంది. భర్త దైవమని, పూర్తిగా అతని చేతిలో కీలుబొమ్మ కావడం, రెక్కలుడిగిన పక్షిలా నిలువడం—ఆలోచించలేని, ప్రతిమలా మెలగడం ఏ నాటికైనా ఆమె జీవితంలో గొడ్డలి పెట్టు. సంఘంలో పురుషునితో పాటు సమాన హక్కులు పొందే అర్హత స్త్రీకి ఉంది. అందుకే పురుషుడు—భర్త—చేసే పనులు, చెప్పే విషయాలు సరియైన పంథాలో సాగుతున్నాయా? లేదా? అన్నది జాగ్రత్తగా స్త్రీ ఒకసారి ఆలోచించి, నిర్ణయించుకొని పురుషుడితో పదంపదం కలపడం నేర్చుకోవాలి నాడు స్త్రీలోకానికి సౌఖ్యం లభిస్తుందనడంలో సందేహం లేదు.

"పురుషుడు భగవంతుని స్వరూపం అయితే, స్త్రీ దేవతా స్వరూపం. ఆమె బానిసకాదు," అన్నారు పూజ్య బాపూజీ. అర్ధనారీశ్వరుడి రూపం తలుచుకుంటే అందులో పురుషునిలో సగభాగం స్త్రీ రూపం కనిపిస్తుంది. అంటే సృష్టిలో స్త్రీకి పురుషునితో సమాన గౌరవం యివ్వాలని ఏనాటి నుండో నిర్ణయం జరిగిందన్న విషయం సుస్పష్టమవుతుంది.

యుక్త వయస్సు వచ్చి—వివాహం కావాల్సిన స్త్రీకి వివాహం అనుకున్న సమయంలోనో—అనుకున్న విధానంగానో జరుగకపోతే తల్లిదండ్రులు విపరీతంగా బాధపడడం జరుగుతుంది. సంఘం కోడై కూస్తుంది. చివరకు 'ఆడపిల్లై పుట్టడం కన్న అడవిలో మానై పుట్టడం బాగుంటుందని' అనిపిస్తుంది. ఇది అన్యాయం!

భగవంతుడు పురుషుని సృష్టించినట్లే స్త్రీని పుట్టించాడు. కాని పురుషుడు స్వార్థపరత్వంతో నేడు స్త్రీని వివాహం చేసుకోటానికి ఆమె యోగ్యత—అందం—ఆదరణలకన్న ముందుగా వరకట్న రూపంలో డబ్బును కోరడం జరుగుతుంది. దాన్ని ఆచారంగా పెట్టుకున్నాడు. అది యిచ్చుకోలేని కుటుంబాల్లో స్త్రీకి అన్యాయం జరుగడం సాగుతూ వస్తుంది. ఇది నారీలోకానికి తీరని శాపంగా మారుతుంది.

ఈ వరకట్న దురాచారాన్ని రూపుమాపడానికి నాటినుండి నేటివరకు ఎందరో మహానుభావులు విశేష కృషిసల్పడం జరిగింది మరెందరో స్త్రీ జీవితాల్ని వరకట్నపు ఉచ్చులలో పడకుండా కాపాడారు. గాంధీజీకి కూడ వరకట్నమంటే చాల చిన్న చూపు ఉండేది. అందుకే ఆయన——

"వరకట్నం తీసుకొనే యువకుల్ని—ఆ డబ్బుతో తులతూగే వారిని ఈ సంఘం నుంచి బహిష్కరించాలి" అని నొక్కి చెప్పారు. నేటి ప్రభుత్వం ఈ విషయంలో ఎన్నో శాసనాలు చేస్తూ—ఎంతో కఠినంగా ప్రవర్తిస్తూ—అందుకు పాల్పడిన వారిని శిక్షిస్తుంది. ఇది ఎంతైనా హర్షించదగ్గది. దేశ పురోభివృద్ధికి ఇది సోపానం. కాని, నేటికింకా కళ్ళు తెరవని పురుషులు కొందరు ఈ దురాచారానికి దాసోహమనడం జరుగుతూంది. ఇలాంటి చీడ పురుగులు నశించినపుడే దేశాభ్యున్నతికి—స్త్రీ జీవితం నిత్యకల్యాణం—పచ్చతోరణంగా మారడం జరుగుతుంది.

"ఆడ పిల్లలు గల తల్లిదండ్రులు తమ పిల్లలకు వివాహం చేయాలనుకున్నప్పుడు, తమ కులంలో పురుషుడు వరకట్నం లేనిదీ ముందుకు రాకపోయినప్పుడు, వారు మరో కులంలో పురుషునికి యిచ్చి ముడిపెట్టడం జరగాలి అలా జరిగినప్పుడు వరకట్న పిశాచం రూపు మాస్తుంది. ఎంతవరకు కులభేదం వదులుకోరో అంతవరకు ఈ దురాగతం రూపుమాయదు కులానికి ఈ పద్ధతికి గల అవినాభావ సంబంధమే ఇందుకు కారణం''—అన్నారు గాంధీజీ.

ఇంతేకాక "తమ కుమార్తెలకు ఉన్నత విద్యాభ్యాసం గల యువకుడే కావాలనో, సిరిసంపదలతో తులతూగే వాడే కావాలనో అనుకొని ఆ వ్యామోహంలో కొట్టుమిట్టాడటం కన్న బుద్ధి మంతులైన యువకులకు తమ కుమార్తెలను యివ్వాలని" గాంధీజీ ఆడ పిల్లలగల తల్లిదండ్రులను దేశించి ఉద్బోధించారు. త్యాగమూర్తి బాపూజీ చెప్పిన ఈ మాటలలో ఎంతో సత్యం దాగుంది

సంసారమనే రథం సక్రమంగా ముందుకు సాగాలంటే, కుటుంబంలోని వారందరూ సుఖమయ జీవితం పొందాలంటే, ఆనందమయ జీవితం సాగించాలంటే పురుషునితో పాటు స్త్రీకి సమాన బాధ్యత ఉంది. పురుషుడు కష్టపడి సంపాదించితెస్తే, దాన్ని పొదుపుగా వాడుతూ—కాలాన్ని నడిపే శక్తి స్త్రీ వద్ద ఉంది. అందులో ఆమెకున్న నేర్పు—ఆమెకున్న సహనం; చాకచక్యం పురుషునిలో చాలతక్కువే!

సంసారమనే శకటానికి భార్యాభర్తలిద్దరు చక్రాలు. చక్రాలు సగ్గా ఉన్నప్పుడే శకటం సరిగ్గా ముందుకు పోతుంది. అలాగే సంసారంలో భార్యాభర్తలిద్దరూ ఒకరికొకరు అండదండగా ఉన్నప్పుడే ఏ ఒడుదుడుకులు లేక ఆ కుటుంబం ఉంటుంది. ఒక విధంగా చూస్తే సంసార బాధ్యత పురుషునికన్న స్త్రీకే అధికం!

ఒక మతం అభివృద్ధి చెందాలన్నా—కుటుంబంలోని పసిపాపల జీవితాలు బంగారుబాటలలో పయనించాలన్నా స్త్రీకి బాధ్యత అధికం, హిందూధర్మ రక్షణ—భారతమాత పరిరక్షణకు కంకణం కట్టుకొని చరిత్ర పురుషుడిగా నిలిచి శాశ్వత కీర్తి నార్జించుకున్న ఛత్రపతి శివాజీ జీవితం ఒకసారి తెరచి చూస్తే ఈ సత్యం వెల్లడవుతుంది. ఆయన అంతటి ఘనుడవటానికి కారణం ఆయన తల్లి జిజియాబాయే! ఆమె ఒక స్త్రీ.

ఇలా ఎందరినో దేశ భక్తులను—త్యాగమూర్తులను మన దేశంలో కన్నారు అందుకే స్త్రీజాతి కెంతవరకు ఈ సంఘంలో గౌరవం ఉంటుందో అంతవరకు దేశం అభ్యుదయ పథంలోకి పయనిస్తుంటుంది

కొన్ని రాజకీయ కారణాల మూలంగా—స్త్రీకి ఒకనాడు చిన్న వయసులోనే వివాహం చేయాలని నిశ్చయించడం జరిగింది. రాను రాను అది ఆచారమైంది. ఆమె దురదృష్టం వల్లనో—మరే

కారణం మూలంగానో ఆమె వివాహమాడిన పురుషుడు మరణిస్తే ఆమె తన జీవితాంతం విధవగానే ఉండాలని నిర్ణయించారు. అలాంటి స్త్రీ పట్ల సంఘం విముఖత కలిగి ఉండడం—ఆమెను చూడడం నేరంగా భావించడం జరిగేది. ఆమె తన కోర్కెలను—తన ఆశయాలను చంపుకోవల్సిందే। జీవితాంతం నరకం అనుభవించాల్సిందే। అలాంటి చిక్కు సమస్య కొందరి త్యాగధనుల మూలంగా పరిష్కరింపబడి ఆమెకు పురుషునిలాగా పునర్వివాహం చేసుకొనే హక్కు కలిగింది. ఇది అలాంటి స్త్రీల పాలిటి వరం। గాంధీజీ స్త్రీల బాల్య వివాహాల గూర్చి తన అభిప్రాయం ఇలా వ్యక్తం చేశారు—

"మనం మతం పేరిట గో సంరక్షణ అని గోల పెడుతాము. కాని మనం అంతా యిల్లు పట్టిన బాల విధవ అనే నోరు వాపీలేని గోవును రక్షించడానికి నిరాకరిస్తాం మతం పేరుతో బాల విధవను ఆమెకు ఏ ఆనందాన్నీ పంచివ్వక అలాగే జీవితాంతం విధవగా ఉంచుతాం. ఇది అమానుషచర్య......పదిహేనేళ్ళలోపుగా మనం పిల్లలకి వివాహం చేయకూడదు ఒక వేళ చేసినా పదిహేనేళ్ళలోప ఆమె భర్త చనిపోతే ఆమెను విధవగా ఉంచక తిరిగి ఆమెకు పునర్వివాహం చేయాలి బలవంతంగా ఆమెను విధవగా ఉంచడం మతానికి శ్రేయస్కరం కాదు" అన్నారు.

స్త్రీ మనస్సు నవనీతం। జాలి–దయ–దానం–ధర్మగుణాలను నిండుగా సింగారించుకుంది ఆమె. అందుకు గాంధీజీ అనుభవాల సరాలలోని ఒక ముత్యం ఇది—

ఒకనాడు గాంధీజీ హరిజనోద్ధరణ విషయమై తిరుగుతూ 'బడగరా' అన్న స్థలంలో ఒక బహిరంగ సభలో ఉపన్యసించి, అక్కడి మహిళలను విరాళాలుగా వారి అభరణాలను కోరారట। వెంటనే అక్కడ ఎందరో మహిళలు ఆభరణాలివ్వడం, వాటిని వేలం వెయ్యడం జరిగిందంట. ఆ సమయంలో 'కౌముది' అనే పదహారేళ్ళ ఒక అమ్మాయి వేదిక మీది కొచ్చి తన వద్దనున్న బంగారు గాజునొకటి తీసియిచ్చి, గాంధీజీ సంతకం కావాలని కోరిందట। గాంధీజీ సంతకం చేయటానికి సిద్ధమవుతూనే ఆ అమ్మాయి మరో గాజు తీసిచ్చిందట।

"నీవు రెండు గాజులివ్వవలసిన అవసరంలేదు. నేను ఒక గాజుకే దస్కతు చేసిస్తాను" అని ఆయన అంటుంటే, ఆ అమ్మాయి మరేం మాట్లాడక తన మెడలో ఉన్న బంగారు గొలుసు తీసిచ్చిందట। ఆ అమ్మాయి త్యాగ బుద్ధికి సభికులు పెదపెట్టున హర్ష ధ్వానాలు చేశారట।

గాంధీజీ ఆ సమయంలో, "నీవు యిలా చేయటానికి నీ తల్లిదండ్రుల అనుమతి పొందావా?" అని అడిగారట. ఆ అమ్మాయి మౌనంగానే ఉండి తన చెవులకున్న రాళ్ళతో పొదిగిన దుద్దులు తీసిచ్చిందట। అది చూసి గాంధీగారు మళ్ళీ అదే ప్రశ్న వేశారట। ఆమె నుండి సమాధానం రాకపూర్వమే, ఆ అమ్మాయి మరెవరో కాదు తనవద్ద నగలను వేలం వేస్తున్న వారిలో త్యాగ మూర్తి అయిన ఒక వ్యక్తి కూతురేనన్న సమాచారం అందిందట। దాంతో గాంధీజీ పరమానందభరితులై, సంతకంచేసి, "నీ మహా త్యాగం, నీవు దానం చేసిన నగలకన్న మహోన్నతమైన ఆభరణం" అని వ్రాయలేకుండా ఉండలేక పోయారట।

అంతటి త్యాగమూర్తి స్త్రీ. ఆమె తలుచుకుంటే సాధించలేనిదంటూ ఏదీలేదు. నిస్వార్థ బుద్ధికి–ప్రేమ స్వరూపానికి చిహ్నమైన స్త్రీ నేడు సంఘంలో పురుషునితో సమాన హక్కులు కావాలని కోరడంలో ఏ అనుమానం అవసరంలేదు.

ప్రభుత్వం నేడు అందుకు ఎంతగానో సహకరిస్తూంది. అన్ని రంగాలలో పురుషునితో పాటు చేయిచేయి కలుపుతూ శ్రమించడం—దేశాభ్యున్నతికి సహాయకారిగా ఉండేందుకు యత్నించడంలో ఆమెకు ప్రభుత్వం సన్నిహితంగా మెలగుతుంది.

అది స్త్రీ జాతికి నవోదయం—

శుభోదయం—

ఆనందదాయకం— దేశ ప్రగతికి పురోగమనం—

★

కాలం మారింది

సోదరా సోదరా నిదుర లెమ్ము సోదరా॥

అంధకారమైన రాత్రి అంతరించి పోయెరా
ఉదయ భానుడుదయించెను క్రొత్త వెలుగు రేఖలతో
బడుగు జీవితాల బాధ తొలగిపోయె నేడురా
పేద సాద ముఖాలలో క్రొత్త కాంతి నిండెరా ॥సోద॥

మనమంతా మానవులం ప్రగతి కోరు సోదరులం
కలిమిని, సమతను పంచే మానవతా వాదులం
కులమత వర్గాలను నేడు కూకటి వ్రేళ్ళతో తృంచి
పేదలు, ధనికుల భేదము రూపుమాపి సమత చూప ॥సోద॥

మననేత, జాతి పిత కన్న కలలు పండెరా
ఊసర క్షేత్రాలలో నాటిన విత్తులు మొలకెత్తెరా
పేద రైతు గుండెలలో వింత కాంతి చూపెనురా
వారి జీవితాలు నేడు క్రొత్త పుంత తొక్కెనురా ॥సోద॥

ఇందిర ఇరవై సూత్రాల్ పథకమెంతో గొప్పదిరా
పేదల జీవన భృతికై పొలాలెన్నొ పంచెరా
తర తరాల బానిసలకు వెట్టి రద్దు చేసెరా
కూడు గుడ్డ గొడ్డు గోద ఋణము లెన్నొ పంచెరా ॥సోద॥

ఆకాశము నంటు ధరల నట్టడుగున తీసుకొచ్చి
నీడలేని పేద ప్రజల గూడుల సమకూర్చి పెట్టి
ఒకటి లేక రెండు మేలని దంపతులకు బోధించి
భావి జీవితములను నందన వనమే చేయ ॥సోద॥

—శ్రీ కందాళం కుప్పస్వామి

స్కెచ్ :

తెలుగువారి హాస్య ప్రియత్వం

— శ్రీమతి వేదవతీ దేవి

ధనుర్మాసం వచ్చిందంటే తెలుగింటి పడుచు పిల్లకు పరమానందం. పక్షుల కన్నా, పిట్టల కన్నా ముందే లేచి పోవాలని పందెం వేసుకుంటుంది.

ఆ చలిలో, చిరు చీకట్లో — లేచి ముస్తాబై — ముగ్గు డబ్బా చేతిలో పుచ్చుకుని వీధిలోకి వస్తుంది.

కసవు చిమ్మి, కళ్లాపి చల్లిన వాకిలి. ఆ వాకిట్లో వేయాలి ముగ్గు. ప్రక్కింటి సీతా, ఎదురింటి రాధా — వేసిన దానికన్నా పెద్ద అందమైన ముగ్గు వేయాలి. ఆ పైన గొబ్బెమ్మలు పెట్టుకోవాలి. గొబ్బి తట్టుతూ పాడుకోవాలి!

"సుబ్బి గొబ్బెమ్మా సుఖము లియ్యావే
తామర పువ్వంటి తమ్ముణ్ణియ్యావే
చేమంతి పువ్వంటి చెల్లెల్నియ్యావే
మొగలీ పువ్వంటీ .... "

కూని రాగం తీస్తూ ముగ్గు పెడుతూ ఉన్న పిల్లకు ఎక్కడ లేని సిగ్గూ వచ్చింది. బుగ్గల్లో గులాబీలు పూసి నట్లయింది. ముసిముసిగా పెదవుల సందుకు త్రోసుకు వస్తున్న నవ్వును దాచుకోవాలని అణచి పెట్టుకుంటూ — ఏదో అలికిడి అయినట్లయి వెనక్కు తిరిగి చూసింది.

ఆ మసక వెలుతురులో — చల్లగా చప్పుడు చేయకుండా ఎప్పుడు వచ్చాడో కాని — బావ నిలువెత్తు విగ్రహంతో, చిరునవ్వు నవ్వుతూ — నిలుచుని ఉన్నాడు!

దొంగలాగా వచ్చి — తన పాటను విన్నాడు కాబోలు. ముందుకి వంగి — మరదలు పిల్ల జడగంటలు చేజిక్కించుకుని — "ఏం ఆగిపోయావేం! మొగలీ పువ్వంటీ .... ?" అంటూ కొంటెగా రాగం తీశాడు

పడుచు పిల్లకు సిగ్గుతో పాటూ ఉక్రోషం ముంచుకు వచ్చింది. అయితే గడసరి తనమూ చమత్కారంగా సమయస్ఫూర్తితో మాట్లాడటమూ తెలుగు కన్నెకు ఉగ్గుతో అలవడిన విద్య కనుక వెంటనే తేరుకుంది ఆ పిల్ల. ఒక్క విసురుతో — అతడి చేతిలో ఇరుక్కున్న జడగంటలు వదిలించుకుని.

"అత్త కొడుకు కొచ్చాడు పందిరెయ్యండీ
పందిట్లో బావకి పీట వెయ్యండీ
పల్లేరు తెప్పించి పక్క వెయ్యండీ
నల్లేరు తెప్పించి నలిచీ విడువండీ"
అని పాడుతూ ఇంట్లోకి పరుగు తీస్తుంది.

ఈ స్వాగతం, అందుతోపాటూ తనకు అందబోయే సత్కారం — విన్న కుర్ర నాగన్న — తానూ అంతటి గడసరి కాదైన ధీరోదాత్తుడైతే, నవ్వుకుంటూ, ఆ పిల్ల వెనుకనే ఇంట్లోకి దారి తీస్తాడు. కాస్త అర్భకుడైతే, మరదలు పిల్ల అన్నంత పనీ చేయిస్తుందేమోనని తటపటాయిస్తూ — గడప ఇవతలే నుంచుండి పోతాడు.

హాస్యాలు ఆడుకోవటమూ చమత్కారంగా మాట్లాడు కోవటమూ — తెలుగుగడ్డపైన జన్మ ఎత్తినవాడికి జన్మతః అలవడే విద్య.

ఒక చల్లని హాసం — ఒక రమ్యమైన పరిహాసం — సంభాషణల మధ్య విద్యుల్లత వంటి ఒక చమత్కారం లేక పోతే, మానవ జీవితంలో స్వారస్యం ఎక్కడన్నా మిగిలి ఉంటుందా!

తెలుగన్నలు బ్రతుకులు—అవి తీపి తక్కువ బ్రతుకులైనా, అక్కడొక చమక్కు, ఇక్కడొక తళుక్కు — సంతరించుకొనే ఉంటాయి. హాస్యాన్ని — అది లలిత హాస్యమైనా, మోటు హాస్యమైనా సరే — బ్రతుకులోకి ఈడ్చితెచ్చుకుని మరీ పులకరించిపోతారు. తన చుట్టూ ఉన్నవారిపైన శీతల తుషారంలా నవ్వుల పువ్వులను విరజిమ్మి — తానూ అంతకు అంతగా ఆనందిస్తాడు.

సరసాలతో, సరాగాలతో, పరిహాసాలతో — అడుగడుగునా అమృతపుసోనలను నింపుకుంటూ — సమస్యలమయమైన సంసారయానం సాగిస్తాడు.

మనస్సును గిలిగింతలు పెట్టే ఈ రాగతనం. ఈ జాణతనం. ప్రేయసీ ప్రియుల మధ్య, బావామరదళ్ళ మధ్య, భార్యాభర్తల మధ్య ... ఒక సరసంగా, ఒక ప్రణయ భావంగా — పరిణమించి చూస్తూ ఉండే వారికి కూడా గుండెలు పులకరించేటట్లు చేస్తుంది.

అలా పండుగవేళ తెలతెలవారుతూ ఉన్న వేళ, వాకిట్లోకి వచ్చిన బావ — అత్త కొడుకే కానివ్వండీ — కాబోయే మొగలి పువ్వంటీ మొగుడే కానివ్వండి, అక్క మొగుడే కానివ్వండి ... అంతటితో వదలి పెడుతుందా మరదల పిల్ల!

ఓహో! ఎన్ని చమక్కులు! ఎన్ని చమత్కారాలు చేస్తుంది బావని పట్టుకుని! ఎన్ని తిప్పలు పెడుతుంది అతడిని!

"బావయ్యొచ్చాడూ
కూరేమి లేదు
కుళ్ళి పోయిన గుమ్మడి కాయ
బావకు కూర!"

అంటూ రాగం తీసేటప్పటికి - ఏ బావకైనా, గుండెల్లో రైళ్లు పరిగెత్తుతుంటా ఉంటాయి!

తిరిగి చూసేటప్పటికి మరొకవైపు నుంచి చెంగున వస్తుంది ఆ పిల్ల. ఓణీ చెంగు నడుం చుట్టూ దోపి - ఒక చేత్తో చావడి స్థంభం పుచ్చుకుని గుండ్రంగా తిరుగుతూ,

"బావా బావా పన్నీరు
బావను పట్టుక తన్నేరు
వీధి వీధి తిప్పేరు
వీసెడు గంధం పూసేరు
చావడి గుంజకు కట్టేరు
చప్పిడి గుద్దులు గుద్దేరు"

అంటూ రాగంతో పాడేటప్పటికి- ఆ బావగారి స్థితి ఎలా ఉంటుందో మనకు తెలియదు! అతడి అప్పటి వైఖరికి నవ్వాలో, జాలి పడాలో కూడా తెలియదు! మరదలికన్నా గడసరి కాదైతే- ఆ పిల్లను తక్షణం ఒడుపుగా పట్టుకుని వీపుమీద- వీశెడు గుద్దులు వడ్డించి వదలటం మాత్రం తథ్యం!

"కోతి బావకు పెళ్ళంటా
కోవెల తోటా విడిదంటా
మల్లీ మాలతి వస్తారా
మాలికలల్లీ తెస్తారా" (కృష్ణశాస్త్రి)

పాట ఎంత మధురంగా ఉన్నా బావను ఉడుక్కునేటట్లు చేస్తుంది ఆ 'కోతి' అనే విశేషణం

పొట్టి బావ- చిట్టి మరదలు- ఆడుకునే హాస్యాలతో త్రుళ్లి త్రుళ్లి నవ్వుకోని తెలుగిల్లు ఉండదు.

అసలు ఈ పరిహాసాల పరంపర ముఖ్యంగా మన పెళ్లి పందిళ్ళలో పరాకాష్ట పొందుతుంది అనటంలో అతిశయోక్తి ఉండదు.

బావా మరదళ్ళ సరాగం దగ్గరనుంచి వియ్యాలవారి సరసాలవరకూ- హాస్యరసం మిళాయించుకొని- విద్వత్తుతో పాటు విద్యుత్తును కూడా జీవితంలో వెదజల్లుకునే సంప్రదాయం మనది.

ఆడపిల్లను కన్న ఆ తల్లిదండ్రులకు- శక్తికి మించిన అరణం ఇచ్చి అల్లుణ్ణి కుదుర్చుకు రావటం ఒకఎత్తు! వివాహ సన్నాహాలు చేసి ఎవరికీ ఏలోటుపాటులూ జరగకుండా, ఆ శుభకార్యం నిర్వహించటం ఒక ఎత్తు! అందులో వియ్యాల వారికి, మగ పెళ్ళివారికి- సకల మర్యాదలూ చేసి మెప్పించటం మరొక ఎత్తు!

ఎంత చేసినా తృప్తి పడరు- మొగపిల్లవాడిని కన్న మనస్సు లేని మరమనుషులు! ఇలా ఎత్తిపొడుస్తారు - కాస్త హాస్యమూ అతిశయోక్తి- కలగా పులగంగా కలిపి-

"ఏలాగు శోధించేతుమూ
ఈవిందు మేమేలాగు శోధించేతుము
విస్తర్లు వేశారు దొన్నెడేసి
వెడల్పు లేదండి హస్తము కదలుటాకూ
ముక్కు- బియ్యము వండిరీ
దానిలోకి ముద్దా పప్పే వేసిరీ
చెప్పుకుంటె సిగ్గౌతుంది
చెయ్యి కడిగిన జిడ్డే లేదు
కూరే వంకాయ కూర
దానిలోకి మార్చే వచ్చడి లేదు
కలహంబులే కానీ కారంబులు గుచ్చెత్తిరి!
పులిహోర పులుపట
అబ్బ! చింతకాయ పులుసు!
ఏ కలహంబు లేకా మరి
కరివేపాకు గుచ్చెత్తిరి
వడ్డించే వదిన గారికి వడ్డాణ మూడి పోయె!"

పైన ఆశీన నిష్ఠూరాలకు బిక్కముఖం పడిపోయి ఉంటుంది పెళ్ళివారికి! కాని ఆఖరు చరణంలో ఉన్న సురుచిరహాసం స్ఫురణకు వచ్చేసరికి- ఇదంతా ఎక సక్కెనికి, వేళాకోళానికి వియ్యాలవారు చేసే అధిక ప్రసంగం కాబోలు- అనుకుని గుండెలమీద చేయి వేసుకుంటారు ఆడ పిల్లలను కన్న అమ్మా-అబ్బా!

అసలే ఆణిగి మణిగి ఒత్తులు ఒత్తుతూ ఉండే ఆడ పెళ్ళివారిని-మరి కాస్త ఆడించాలని మగ పెళ్ళివారికి బుద్ధి పుట్టిందంటే

"విందూ చేసినారూ.—వియ్యాల వారి ఇంటా
విందూ మాట చెపితే — వింతగా ఉంటుంది
పొట్టి బావగారూ — కొట్టు పెత్తనమట
కొట్టులో సరుకులూ — ఇవతలకు రానీయరూ
అత్తగారు వచ్చీ — పళ్ళెం తట్టినాదీ
మామ గారు వచ్చీ — మట మట లాడేరు"

అంటూ చరణం ఎత్తుకుంటారు! ఇలా పాట ఎత్తుగడ జరిగిందీ అంటే, ఎన్ని చింతలూ చీకాకులు ఉన్నా—ఇరు పక్షాలవారి ముఖాలూ- మట మటలూ చాలించి—మతాబాలుగా వెలిగిపోవలసిందే!

వియ్యపురాలికి సకల మర్యాదలూ చేయవలసిన విధి ఉంది. కనుక చేస్తుంది కాని తెలుగమ్మకు అందులోనూ పరిహాసమే! వేళాకోళమే!

హాస్యాల మధ్య వదినగారికి స్వాగతం ఇలా చెబుతుంది!
"నీళ్ళు ఇద్దామంటె చిల్లి చెంబాయె!
చాపవెద్దామనగా చోటు దొరకదాయె;
కోడి కొడదామంటె గుడ్ల కోడాయె!
వక్కు దంచీ చూడ విత్తనాలాయె!
పీటలేయాబోవ పిల్లడమాయె!"

ఆ వచ్చిన వదినగారి ముఖంలో రంగులు మారి మారి హరివిల్లులా విరుస్తుందనటంలో అనుమానం ఉండదు.

ఈ వియ్యపురాళ్ళ వినోదం ఈనాటిదా మరి! ద్వాపర యుగం నాటి నుంచీ మనకు ఆనవాయితీగా సంక్రమించిన సరసమే ఇది.

సుభద్రార్జునుల వివాహ సమయం, వేడుకలకూ వేళాకోళాలకూ వేళాపాళా ఉండని సమయం!

"రుక్మిణీదేవి తమ యత్త మ్రొక్కిలకచికి
బసిడి చిన్నియ(కస్తూరి యొసగ నామె
చేదిగిచి దేవకీ దేవి మీద జిలికి
వదినె గారని యొక కొంత లాలి నెఱపె."

—విజయ విలాసము.

అంతటితో ఆగక—

"పీయపు రాలివైతి గదవే యిపుడత్తవు తొంటివావినో
తోయజ నేత్రుగాంచిన వధూమణి..."

—విజయవిలాసము

అంటూ వరుసలు తిరగవేస్తుంది ఇంద్రాణి।

ఈ వావి వరుసలూ, వేళాకోళాలూ అమరకాంతలకే అంత మనసైనప్పుడు—ఆంధ్రనారి తీసిపోయిందా!

"వదినాగారు మీరు వచ్చినారండీ కుదురుగ
గూర్చుండి మీరు నోరు ముయ్యండి।
పాట తెలియదు మాట తెలియని వదినెగారు।"

అంటూ కాస్త మోటు హాస్యమే చేస్తుంది అప్పుడప్పుడూ।

ఈ మోటు హాస్యం ఒక్కొక్కసారి మోతాదు మించుతుంది. అది పెళ్ళికొడుకు పైకి చంద్రహాసంలా రివ్వున వచ్చి తాకితే—ఇలా ఉంటుంది।

"ఎక్కడ దొరికి నాడమ్మా ఈ పెళ్ళికొడుకు
అద్దెడు మానెడు పోసినాము
అసెలైన వందినాము
అంగుడైన జూపడాయె
అరమొగము పెండ్లికొడుకు
అయిదువేలు పోసినాము
అత్తరు పన్నీరు చల్లినాము
చల్లుకోవటం చేతకాదు
చవట మొగం పెళ్ళి కొడుకు!"

అయిదు వేలూ పోసి కొని తెచ్చుకున్న పెళ్ళికొడుకు పైన ఆడపెళ్ళివారికి అవ్వగింజంత అక్కసు ఉండటం—సహజమేనేమో—అది ఈ రకమైన్నదెప్పి పొడుపుతో — హాస్యం పేరుతో తీర్చుకుంటున్నారేమో ననిపిస్తుంది।

పెళ్ళి తంతు పూర్తయినాక—అమ్మాయిని అత్తవారి ఇంటికి సాగనంపాలి. అమ్మాయిని అత్తగారి తరఫు వారందరికీ అప్పగింతలు పెడుతూ—పాటలు పాడుతారు. ఆ పాటలు వింటూ ఉన్న వారికి కూడా — ఆ సమయంలో హృదయం ద్రవించకమానదు. ఆ సన్నివేశం అటువంటిది. కని, కంటికి రెప్పలా సాకి—ఒక అయ్య చేతిలో పెట్టి—బంధం త్రెంచుకోవలసిన — విషాద ఘడియ అది. తల్లిదండ్రుల పట్ల—అయితే, ఇటువంటి బరువైన సన్నివేశాన్ని కూడా నవ్వుతూ—తేలికగా తీసుకునే హాస్యశీలులు పాడే పాట ఇలా ఉంటుంది—

"పతివ్రతా ధర్మంబు భక్తితో సలిపి
అతని చెంపామీద అంటిస్తు ఉండు।
సేవ చేయించుకో చిన్నత్తలా చేత
బావగారిని నీదు బానిసగ చూడు
తోటి కోడలి బిడ్డ కూటి కేడిస్తే
పీట కోడిచ్చుకో ఒక పెట్టవమ్మ।
అత్త వచ్చి నిన్ను పనిచేయమంటె
తలకి పటేసుకో పడకేయ వమ్మ।
ఏకువలె మెత్తంగ ఎరుగ నట్లుండీ
మేకువలె బిగుసుకుని మేలుకొనియుండు।"

పరాయి ఇంటికి వెళ్ళబోతున్నాననే పరాకుతో—దిగులుతో ఉన్న పెళ్ళికూతురయినా, ఈ పాట వింటే ఫక్కుమని నవ్వకుండా ఉంటుందా।

వదినా మరదళ్ళ మధ్య ఎన్ని సరసాలు। ఎన్ని వాక్యమత్కృతులు। వరుసకు వదినయితే చాలు—వదిలి పెట్టదు తెలుగు పడుచు।

"వంట వంటని యేరు అది యెంత వంట
వదినతో మరదళ్ళు వాదాడి నట్లు।"

అంత తేలిక, సరదా—వంట చేయటం కాని, వరస లాడటం కాని—తెలుగింట పుట్టిన ఆడపడుచుకు। ఆ వరసలాడటంలోనూ ఒక వరస ఉంటుంది। మాటకు మాట—వేటుకు వేటు అన్నట్లుగా ఆ విసిరికొట్టుకునే వాగ్బాణాలకు వేడీ వాడీ ఉంటుంది.

కొత్తగా పెళ్ళయి కాపురానికి వచ్చింది అన్న పెళ్లాం. ఇంటి ఆడపడుచుకు తిరిగే కాలూ తిట్టేనోరూ. ఇప్పుడు ఆడబిడ్డను అయాననే కొత్త గర్వం—పోదా. 'ఆడబిడ్డా—అర్ధమొగుడు' అని అననే అన్నారు.

"వదినా వదినా వల్లంకి పిట్టా
గదిలో పెట్టా గంజినీళ్లొయ్యా
నీ కొడుకుట్టా నాపేరెట్టా
అన్నయ్య కొట్టా నువ్వేడ్వా నేన్నవ్వా।"

అంటూ రాగం తీసి వదిన ముఖం వంక చూసి పడీ పడీ నవ్వుతుంది.

అన్నయ్య మాత్రం తన వాడు. తనకు తోడ పుట్టినవాడు. వదిన్ని పరిహాసం చేస్తూ మేలమాడటంలోనూ మంచి కోరికే కోరింది. వదినకు కొడుకు పుటాలి। తనపేరు, లేకపోతే, తన పేరులో కలిపే పేరు పెట్టాలి. ఆ పుట్టిన వాడికి మళ్ళీ వెంటనే కార్పణ్యం। వదిన్ని అన్నయ్య కొడితే ఆమె ఏడిస్తే తాను నవ్వాలి।

ఇది హాస్యానికి కట్టిన పాటే। ఈ పాట పాడుతూ చప్పట్లు చరిచే ఆడబిడ్డ వంకచూచి ఆ అన్న పెళ్ళాం ముసి ముసిగా నవ్వుకుంటుంది తప్ప కోపగించుకోదు. ఆ పాటలోని పదాలు శూలాల్లాగా ఆమెను బాధించవు. ఏ మల్లెల మాలో, ఏ విరజాజి దండో—

విసురుగా వచ్చి గిలిగింత పెట్టినట్లయి తానూ తిరిగి ఆ పూలమాలను విసిరి కొట్టటానికి సన్నద్ధం అవుతుంది.

ఈ వదినా మరదళ్ల సరసం ఈ నాటిదా ? పురాణ కాలం నుంచీ ఉన్న దే!

సుభద్ర అభం శుభం తెలియని ముద్దరాలు. కపట సన్యాసిని యోగిపుంగవుడిగా భావించి శుశ్రూష చేసింది-కొంతకాలానికి కపట సన్యాసి కథ తెలిసింది-తన మనసునిండా నింపుకొన్న మహా వీరుడా అర్జునుడు-తన కోసం ఈ వేషం వేసుకుని వచ్చాడు! సుభద్ర మనసంతా, తనువంతా పులకరింతలు-అతడి కోసం పలవరింతలు.

వదినెలు ముద్దుల ఆడపడుచు స్థితి కనిపెట్టారు. సరసాలు మొదలు పెట్టారు.

అందరి హాస్యోక్తులూ ఒక ఎత్తు. సరస శృంగార రస స్ఫూర్తి జీర్ణించు కొన్న సత్యభామ వదిన మాటల ఘాటు మరొక ఎత్తు! ఆవిడ అంటుందీ—

"క్రాగి యున్నది మిగుల నంగంబు చూడ?"
గళ వర్తించుచునున్నది; కలదొ ఏమొ
సోకు; డల్ల సన్యాసికే చూప వలయు
భామ నని పల్కె నా సత్యభామ నగుచు!"
—విజయ విలాసము

"వొళ్లు చూడ బోతే కాలిపోతూ ఉంది. మనిషి చూడబోతే కలవరింతలతో ఉంది. ఏదైనా గాలీ ధూళీ సోకిందేమో నమ్మా! ఆ సన్యాసికే చూపిస్తే-మా ఆడబడుచుకు మంత్రమో తంత్రమో చేసి ఈ తీవ్రం పోగొడతాడు!"...... అంటుంది ఆ వదినగారు.

ఇటు వంటిదే - రసవంతమైన వదినా మరదళ్ల సరస సంభాషణ - మన జానపద కావ్యం-'ఊర్మిళాదేవి నిద్రలో'...... మనకు దొరుకుతుంది.

పధ్నాలుగు దీర్ఘసంవత్సరాలు దీర్ఘ నిద్రలో మునిగి భర్త ఎడ బాటును వేగించింది ఊర్మిళాదేవి. లక్ష్మణస్వామి అన్నా వదినలతో పాటు అరణ్య వాసానంతరం—అయోధ్యకు తిరిగి వచ్చాడు. ఏకాంతంలో ధర్మ పత్నిని కలుసుకున్నాడు ఆమె స్థితికి కన్నీరు పెట్టుకున్నాడు ఆ తర్వాత అనునయింపులూ, కష్టసుఖాలు చెప్పు కోవటాలూ అయినాక ఊర్మిళ గది వీడి వచ్చింది. ఆమెకు అభ్యంగన స్నానం చేయించి అలంకారాలు చేశారు. అసలే చక్కని చుక్క. శోభనపు పెళ్ళికూతురి ముస్తాబుతో -మరీ మెరిసి పోతూ ఉంది ఆమెను చూచేటప్పటికి ఆడపడచు శాంతకు సరదా వేసింది.

తమ్ముని భార్యకు కాస్త గిలిగింతలు పెడదామని హుషారు పుట్టింది.

చేడెవినవే జానకి! నీ చెలియ
యూర్మిళ బుద్ధులన్నీ
భమిడి పానుపున సొలసి
యుండెనొక పదునాల్గేండ్లు పడతి
కుందనపు ప్రతిమ కళలు ఈ కళ
ఎందుండి దాగున్నదో!
దృష్టితగులా కుందును నీలాల
నివ్వాళు లివ్వరమ్మా!

ఊర్మిళకు ఎక్కడ లేని సిగ్గూ వచ్చింది. సిగ్గుతో ముఖం ఎర్రబడి పోయిన చెలెలి వంక ఒక సారి చూచి నవ్వుతూ, సీత గడుసరి తనంగా వదినగారికి సమాధానం చెప్పింది.

"ఇంద్ర చంద్రాదులను వలపించు
చంద్రులూ మీ తమ్ములూ
దృష్టి తగులా కుందను
నీలాల నివ్వాళు లివ్వరమ్మా !"

శాంత తక్కువ తిన్నదా ! వెంటనే అందుకుని.

"అక్క చెల్లెండ్రు మీరు
మిక్కిలి సౌందర్యశాలు రమ్మా
మా తమ్ములా నలుగురిని వలపించు
జాణలకు దృష్టి తగులూ..."

అంటూ మరదళ్ళ జాతనాన్ని ఎత్తిపొడిచింది.

అయితే - సీతకు ఈ ఎత్తిపొడుపులో. అనుకోకుండా పట్టుగొమ్మ చిక్కినట్లయింది! దానిని వెంటనే దొరక పుచ్చుకుని-

"మా యన్న ఋష్య శృంగు మనసులో
కూడి యెడ బాయ కున్న
ఏమి యెరుగని తపసిని - ఓ వదినె
కేళించి విడిచి నావూ !"

అని ఎత్తి పొడిచేటప్పటికి - ఘోటక బ్రహ్మచారిని, ఋష్య శృంగుడిని - వలచి వలపించుకున్న శాంత - తానెంత మాటకారి అయినా, ఏమి సమాధానం చెప్పగలుగు తుంది !

అది-త్రేతాయుగంలో-శాంతకూ, సీతకూ—నిజంగా జరిగిన సరస సంభాషణమేనా—అని తర్కించే వారికి జవాబు చెప్పడం కష్టం. కాని, ఒక మాట మాత్రం నిజం ! తెలుగు పడుచుల గుండెలలో ఉబికి వచ్చే హాస్య ప్రియత్వం—ఆ పురాణ పాత్రలకు అలా ఆపా దించుకుని మనస్సును రాగ రంజితం చేసుకున్న మధుర భావన—మటుకు అవును !

అలాగే—బావా మరదుల మధ్య - కూడా వరుసలాడుకోడం కద్దు. మన పల్లె సీమల్లో—ఇప్పటికీ—పడుచువారయినా, ముసలి వారయినా - బావా మరదుల మధ్య - సమార్ధ్యమైన - సరస భూయిష్టమయిన సంభాషణలు దొర్లుతూ - వినవస్తుంటాయి. ఈ సల్లాపం - వినేవారి మనస్సులను కూడా రంజింప చేసేదిగా ఉంటుంది. వరి వంగడం వద్ద నుంచీ, వంకాంకురంగా వెలిసిన ముని మనవడి ముద్దు ముచ్చట వరకు - వారేది మాట్లాడుకున్నా - ఒక విసురు, ఒక విరుపు - వినవస్తూ - వినేవారిని వివశులను చేస్తూనే ఉంటుంది !

(సశేషం)

సంఘసేవ-స్వచ్ఛంద సేవాసంస్థలు

—శ్రీ ఎన్. జనార్దనరెడ్డి

భారతదేశం వంటి అభివృద్ధి చెందుచున్న దేశాలలో సంఘ సేవా కార్యక్రమం అత్యంత ప్రాధాన్యత వహిస్తుంది. అనేక జాతులు, మతాలు, కులాలు, అలవాట్లు, వేషభాషలు ఆర్థికంగా, సాంఘికంగా ముఖ్యంగా నాగరికంగా వెనుకబడి తరతరాలుగా వెలుగు చూడని అనేక దీనజన గాథలు బాధలను 60 కోట్ల జనాభా గలిగి నూటికి 80 మంది మారుమూల పల్లెలలో జీవనం సాగిస్తున్న వారి స్థితి గతులను మార్చేందుకు ప్రభుత్వం చేసిన చట్టాలను యిస్తున్న సౌకర్యాల లాభాలు అట్టడుగునవున్న యీ పేద ప్రజానీకానికి అందాలంటే ఒక ప్రభుత్వ యంత్రాంగం మాత్రమే చాలదు.

ఇక్కడే స్వచ్ఛంద సేవా సంస్థలు తమ కర్తవ్యాన్ని నిర్వహించే బాధ్యత చేపట్టవలసింది. మూఢాచారాలను సంఘంలో పాతుకుపోయిన బూజుపట్టిన సిద్ధాంతాలను మార్చేందుకు చట్టం ఎప్పుడూ చాలదు. అందుకు అవసరమైన వాతావరణాన్ని సృష్టించి తమ కార్యక్రమాలపట్ల కార్యకర్తలు ఆత్మవిశ్వాసంతో చిత్తశుద్ధితో పనిచేసినట్లయితే స్వచ్ఛంద సేవాసంస్థలు దీనజనోద్ధరణకు చేపట్టే కార్యక్రమాలు విజయవంతమౌతాయి.

నిర్భాగ్యులకు ఆశాజ్యోతి

ఈ దేశంలో ఇళ్ళు వదలి తిరిగే బాలికలు, అనాథలుగా వదిల వేయబడినవారు, భర్తలు వదిలిన స్త్రీలు, శారీరకంగా మానసికంగా దుర్బలులకు తోడు మురికివాడల్లో (ముఖ్యంగా పట్టణాలలో) 1 కోటి 15 లక్షల మంది బడియీడురాని బాలబాలికల సంక్షేమం చూడాలి. ప్రభుత్వం ఎంత ధనం ఖర్చుపెట్టినప్పటికీ ఎంత మంది సిబ్బందిని నియమించినా, ఎన్ని పథకాలు తయారు చేసినను స్వచ్ఛంద సేవా సంస్థలు వివిధ రంగాలలో తగు కృషి సలుపుచున్నందుననే ఈ నిర్భాగ్యులకు ఆశాజ్యోతి కనిపిస్తున్నది.

హరిజన గిరిజనోద్ధరణకు గాంధీ శాంతి సంఘం మొదలు స్త్రీ శిశు సంక్షేమానికి లయన్సు, రోటరీ వంటి అంతర్జాతీయ సంస్థలతో పాటు అనేక స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రభుత్వ సహాయంతోను, తమ స్వంత ట్రస్టులతోను, విదేశీ సహాయంతో ఉత్సాహంగా పని చేస్తున్నాయి.

మురికివాడలలో నివసించే ఆర్థికంగా వెనుకబడిన కార్మికుల, కూలీల బిడ్డలపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. వారి ఆరోగ్యానికి పోషకాహారాలను అందించాలి. బడియీడు రాగానే వారిని ఆ వాతావరణం నుండి వేరు చేయకపోయినట్లయితే చెడు అలవాట్లకు లోనయి సంఘంపై ద్వేషం పెంచుకొని దేశానికి చీడపురుగులౌతారు.

వీరిని స్వచ్ఛంద సేవా సంస్థలు వారి తల్లిదండ్రుల నుండి దూరంచేసి వసతి గృహాలలోవుంచి తీర్చిదిద్దే బాధ్యత చేపట్టడం అవసరం. వీరేగాక అనాథ స్త్రీలకు తగు శిక్షణ యొసగి గౌరవంగా స్వయం కృషితో జీవించేందుకు తగు వసతి కల్పించాలి. శారీరకంగా మానసికంగాను బలహీనులు తగు విధంగా తమ జీవితం గడిపేందుకు అవసరమైన కుటీర పరిశ్రమలు, వైద్యశాలలు యీ స్వచ్ఛంద సేవా సంస్థలు మాత్రమే సక్రమంగా నడుపగలవు. యీ రంగంలో ఎంతో సేవ జరుగుచున్నప్పటికీ చేయవలసింది యింకా ఎక్కువ వున్నది

మన ప్రియతమ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీగారు యీ విషయంలో పేదరికాన్ని, అనారోగ్యాన్ని, అజ్ఞానాన్ని పారద్రోలేందుకు, దేశ సౌభాగ్యం పెంపొందించేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలను ప్రభుత్వ వ్యవస్థతోపాటు భాగస్వాములు కావాలని పలుమార్లు ఉద్ఘాటిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి స్వాతంత్ర్యానికి పూర్వం నుండి సంఘసేవా రంగంలో, సంఘసంస్కర్తలు అగ్రగాములుగా యుంటూ వచ్చారు. ఒక వ్యక్తి స్వయం కృషితో ఎందరి జీవితాలకు వెలుగు యివ్వగలడనే దానికి నిదర్శనంగా ఎన్నో సంస్థలు మన రాష్ట్రంలో వెల్లివిరిశాయి. అందులో వాకాడు విద్యా సంస్థల చరిత్ర పరిశీలిద్దాం. 1935 సంవత్సరంలో నెల్లూరు జిల్లా గూడూరు తాలూకాలోని వాకాడు గ్రామంలో హరిజనుల కొరకు ఒక రాత్రి పాఠశాలను పద్మశ్రీ నెదురుమల్లి బాలక్రిష్ణారెడ్డి ప్రారంభించారు. అగ్రకులాలవారు, కుటుంబ సభ్యులు అందరూ సహాయ నిరాకరణతోపాటు అన్ని విధాల అడ్డంకులు కల్పించినా దృఢ దీక్షతో తన రాత్రి పాఠశాలను కొనసాగించు సమయంలో ఒక రోజు ఒక హరిజన యువకుడు ఆకలితో దారిలో స్పృహ కోల్పోయాడు. యీ దృశ్యం శ్రీ రెడ్డిగారి హృదయాన్ని కరిగించింది. విద్యగరపాలనే వుద్దేశ్యంతోపాటు పేదరికంలోవుంటూ వుపవాసాలు చేస్తున్న విద్యార్థులకు భోజన వసతి కల్పించాలనే సంకల్పం బలంగా నాటుకుంది బిచ్చమెత్తి, ధార్మికులపంచల పడిగాపులుగాసి, సంఘంలో అంటరానివారితో తిరుగుతున్నాడనే తోటివారి క్రూర ప్రవర్తన సహించి సంకల్ప బలంతో సేవా దృక్పథంతో తన కార్యక్రమాన్ని కొనసాగించుటయేగాక దానిని స్వయం కృషితో దినదినాభివృద్ధిచేసి హరిజన విద్యార్థి ఉద్ధారక సంఘమును స్థాపించి, ఒక్కరి కొరకు ప్రారంభించిన వసతి గృహాన్ని సంవత్సరానికి 3000 మంది వరకు హరిజన గిరిజన తదితర పేద విద్యార్థి, విద్యార్థినులకు విద్యా భోజన సౌకర్యం కల్పించి ప్రభుత్వ గుర్తింపుబడని వారు, ఏకాకిగా రాత్రి పాఠశాలతో ప్రారంభించినా 40 సంవత్సరముల సేవ వలన నర్సరీ పాఠశాల మొదలు డిగ్రీ కాలేజీ వరకు 14 విద్యా సంస్థలను నడపుటయేగాక అనాథ బిడ్డల భవితవ్యానికి పేద ప్రజల జీవితంలో విజ్ఞానం పెంపొందించుటకు అహర్నిశలు కృషి సల్పుచున్నారు.

యీ వసతి గృహాలలోని విద్యార్థులకు ఆత్మస్థైర్యం పెంపొంది స్వయం కృషితో జీవించేందుకు కావలసిన దృఢ సంకల్పం కల్గించబడుచున్నది.

ప్రభుత్వ సహాయం ఒక దానంగా కాక తన అభివృద్ధికి ఒక చేయూతగా భావించి విద్యార్థి దశనుండి పనిచేసి ప్రతిఫలంతో జీవించే విధానాన్ని అలవరచుకోవాలి యీ మనస్తత్వం విద్యార్థి దశలోనే యువకునికి పాదుకుపోవాలి.


దీనికి కావలసిన వాతావరణం సృష్టించి పథకాలను స్వచ్ఛంద సేవా సంస్థలు అమలు పరచాలి.

మన విద్యా విధానంలోను విద్యార్థులు తమ మానసిక ప్రవృత్తిలోను చైతన్యవంతమైన మార్పు తేవాలంటే వేలంవెర్రిగా విశ్వవిద్యాలయాలవైపు ఎగబడడానికి స్వస్తి చెప్పించాలి.

ఇంటర్‌గాని మరేదైనా చదువుగాని డిగ్రీ చదువులోనికి ప్రవేశానికి ముందు కనీసం రెండు సంవత్సరాలపాటు తన ప్రాంతాలకు దూరంగా వేరే రాష్ట్రంలో దేశ నిర్మాణ ప్రాజెక్టులో పని చేయించాలి. పారామిలటరీ, సాంకేతిక శిక్షణతోపాటు కష్టించి పనిచేసి "శ్రమ విలువ" తెలుసుకొనేటట్లు చేయాలి. ఆ కార్యక్రమంలో నెగ్గినవారికి మాత్రమే డిగ్రీ, పైచదువులకు ప్రవేశం కల్పించినట్లయితే యూనివర్సిటీలపై వత్తిడి తగ్గుటేగాక, సరియైన మనస్తత్వంతో పరిపూర్ణ వ్యక్తిగా విశ్వవిద్యాలయంలోకి ప్రవేశిస్తాడు. ప్రిస్టేజీ కొరకు పైచదువులు మాని, విజ్ఞానానికి, దేశానికి, తనకు ఉపయోగపడే విద్యలో ప్రవేశించాలి. యీ విషయంగా దేశం మొత్తంపై ఒకే విద్యా విధానానికి నాంది పలికేటట్లు పథకాలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించడం జరిగింది. ఇది అమలుపరచిననాడు జాతీయ సమైక్యత లభిస్తుంది.

స్వచ్ఛంద సంస్థలు యీ విషయంలో తమ స్థాయిలో కొంత కృషి జరుపాలి.


యువజన కాంగ్రెసు నాయకుడు శ్రీ సంజయ్‌గాంధీ ప్రవచించిన 5 సూత్రాల పథకం ముఖ్యంగా యువజన సంఘాలు తదితర స్వచ్ఛంద సేవా సంస్థలు అమలు చేయవలసిన విధంగా కార్యక్రమాలను రూపొందించుకోవడంతోపాటు ప్రధాని 20 అంశాల కార్యక్రమం అమలులో యీ సంస్థలు అప్రమత్తతతో వ్యవహరించి ఆ పథకాల సత్ఫలితాలు ఎవరికొరకు నిర్దేశించినవో ఆ బలహీన వర్గాలకు అందేటట్లు పనిచేయుటయేగాక ప్రభుత్వానికి తగు సలహాలనిస్తూ తమ కర్తవ్య నిర్వహణలో నిస్వార్థంగా విధివంచితుల అభ్యున్నతికి కృషి సలిపిననాడు మన ప్రధాని వుద్దేశించిన సమ సమాజం నెలకొనగలదు.



1976 నవంబరు 1 నుండి 20 తేదీ వరకు

ఆంధ్ర ప్రదేశ్ అవతరణోత్సవాలు

ఆంధ్రప్రదేశ్ ద్విదశాబ్ది ఉత్సవాలు శ్రీకాకుళం జిల్లాలో అంతటా అతి వైభవంతో జరిగేయి. జిల్లా కలెక్టరు శ్రీ ఎస్. కె. పచౌరి, డి. ఆర్. ఓ, శ్రీ కె. మురళీధర్, జిల్లాపరిషత్కార్యదర్శి శ్రీ బి. కొండయ్య, శ్రీ పి. అనంతశయన రెడ్డి ప్రభృతులు ప్రత్యేక శ్రద్ధ వహించారు.



కొత్త ఢిల్లీలో ఆంధ్ర ప్రదేశ్ అవతరణోత్సవాల సందర్భంగా పారిశ్రామికాభివృద్ధి శాఖ కేంద్రమంత్రి శ్రీ టి. ఎ. పాయ్, స్పెషల్ కమిషనర్ శ్రీ సి. ఎన్. శాస్త్రి, చేనేత శాఖా మంత్రి శ్రీ కె. వి. కేశవులు

ఈ 20 దినాల ఉత్సవాలు 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమాలు జిల్లాలో ఎలా అమలు జరిగేయో సమీక్షించు కొందుకూ, ఇంకా ఎలా ఉధృతం చెయ్యాలో పథకరచనకి అధికారులు అనధికారులు ఉపయోగించుకొన్నారు. "20 సూత్రాల కాంతుల్లో శ్రీకాకుళం జిల్లా నవోదయం" అనే పుస్తకాన్ని ముచ్చటగా ముద్రింపించి విడుదల చేయడం ఈ ఉత్సవాల ప్రత్యేకత.

ఒకటవ తేదీనుండి 20వ తేదీవరకు శ్రీకాకుళంలోను, జిల్లాలోను, నిత్యోత్సవాల శోభ, సంరంభం, నూతన ఉత్సాహానికి కారణాలు అయ్యేయి, హరిజన, గిరిజన, మత్స్య పారిశ్రామిక, మహిళా, శిశు సంక్షేమాలు, పశు సంవర్ధక కార్యక్రమాలు, ముమ్మరంగా సాగించేరు, ప్రతిరోజు సాంస్కృతికోత్సవాలు 15 దినాలు శ్రీకాకుళం పురపాలక సంఘ కార్యాలయరంగస్థలిపై నిర్వహించారు.


అపూర్వ చరిత్రను, ఘనతను చేకూర్చిన కమీషనర్, ప్రత్యేక అధికారి శ్రీ డి. వి. రామా నాయుడు, ఇంజనీర్ శ్రీ ఆర్. ఎస్. నాయుడు, వారి సిబ్బంది అభినందనీయులు.

నవంబరు ఒకటవ తేదీని ప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖామాత్యులు శ్రీ ఒకలాపు లక్ష్మణదాసు అధ్యక్షత వహించిన సభను, మధ్యతరహా నీటిపారుదల శాఖామాత్యులు శ్రీ వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు ప్రారంభిస్తూ రాష్ట్ర పురోభివృద్ధిని, శ్రీకాకుళం జిల్లా నవోదయాన్ని సమీక్షించేరు. జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ త్రిపురాన రాఘవదాసు, కార్యదర్శి శ్రీతంగి సత్యనారాయణ ఇతర శాసన సభ్యులు కార్యక్రమాలకు చేవను చేకూర్చేరు.

రెండవ తేదీ కుటుంబ నియంత్రణ దినంగా పాటించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి శ్రీ వి. కామేశ్వరరావు, ఆసుపత్రి సూపరెండెంట్ డాక్టర్ జీవాధారం ఆధ్వర్యంలో 3000 మంది కార్యకర్తలు ఇంటింటికీ వెళ్ళి కుటుంబ నియంత్రణ ప్రచారం ముమ్మరం చేసేరు. జిల్లా అధికారులు, అనధికారులు, సుమారు 80 మంది ప్రభుత్వ ప్రయివేటు డాక్టర్ల కృషి ఫలితంగా ఈ 20 దినాల్లో చేసిన కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు 20 వేలకు పైగా దాటి ఉంటాయని అంచనా.

3 వ తేదీని పౌరసంబంధశాఖ నిర్వహించిన 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమంపై జరిగిన చర్చలో సుమారు 15 మందికి పైగా ప్రముఖ వక్తలు జిల్లా ప్రగతికి చక్కని దర్పణం పట్టేరు.

వెట్టిచాకిరి నిర్మూలన దినంనాడు జిల్లా కార్మిక శాఖ సదస్సును, సామూహిక చర్చలను ఏర్పాటు చేసింది. భూముల పంపిణీ దినంనాడు శ్రీకాకుళం తాలూకాకు చెందిన 145 ఎకరాల ప్రభుత్వ భూములను, 501 మందికి ఇళ్ళ స్థలాలను జిల్లా కలెక్టర్



క్రొత్త ఢిల్లీలో ఆంధ్ర ప్రదేశ్ అవతరణోత్సవాల సందర్భంగా ప్రధాన అతిథి శ్రీ టి. ఎ. పాయ్ ప్రసంగిస్తున్న దృశ్యం.

పంచి పెట్టేరు. ఆ రోజు వివిధ బ్యాంకులు ఇచ్చిన ఋణాలుగా బలహీన వర్గాల వారికి 813 వేల రూపాయలు ఆయన పంచి పెట్టేరు

ఆరవ తేదీని సాంఘిక సంక్షేమ దినం ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు దుస్తులు పంచేరు. కాజీపేటలో ప్రాథమిక పాఠశాల భవనానికి ప్రారంభం చేసేరు. బందరువాని పేటలో మత్స్య పారిశ్రామికుల పిల్లలకు ప్రభుత్వం ఈ జిల్లాలో ప్రప్రథమంగా మంజూరు చేసిన ఆశ్రమ పాఠశాలకు ప్రారంభం చేయడం ప్రత్యేకంగా పేర్కొనదగ్గది. ఆ రోజు, సాయంకాలం మరొక ఉత్సాహకరమైన కార్యక్రమం—వర్ణాంతర వివాహాలశోభ—జిల్లా కులాల నిర్మూలన సంఘం ఏర్పాటు చేసిన వర్ణాంతర వివాహాల ఆరు జంటలను అసంఖ్యాకజనం ఆశీర్వదించేరు. వర్ణాంతర వివాహాలు శాస్త్ర నిషిద్ధములు కావని కొందరు వక్తలు సప్రమాణంగా ప్రసంగించేరు. ఆ దినమే జిల్లా వెనుకబడిన ఆర్థిక సహకార సంస్థ 129 మందికి రూ. 1.02 లక్షలు షెడ్యూలు కులాల జాతుల సేవా సహకార సంస్థ 83 మందికి 2.12 లక్షల మేరకు ఋణాలు ఇవ్వడం చెప్పుకోదగ్గది.

ఏడవ తేది యువజన సంక్షేమ దినంనాడు నెహూర్రు యువక కేంద్రం కో-ఆర్డినేటరు శ్రీ పి. డి. నాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులుకాని గ్రామీణ యువకులకు బాలభట శిక్షణ ముగింపురోజు, యువకులు గిరిజన నృత్యాలతో ఊరేగింపు జరిగింది 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమముపై గ్రామీణ యువకుల పద్య, వచన గేయాలతో "ఉషఃకాంతులు" అనేది సంకలనం ఆవిష్కరింప చేయడం గొప్ప విశేషం. ప్రసిద్ధ వాయులీన విద్వాంసులతో సంగీత విభావరి నిర్వహించేరు

ఎనిమిదవ తేదీ గిరిజన దినంనాడు జరిపించిన ఉత్సవాలు చూసి తీరవలసిందే. గిరిజన ప్రాంతాలలో ఉత్సవాల నిర్వహణకు జిల్లా కలెక్టర్ ఒక ప్రక్క, డి. ఆర్. ఓ., టి. డ. ఏ. పి. ఓ. ఇన్‌చార్జి ఒక ప్రక్క, ఎస్. ఎఫ్. డి. ఎ. ప్రాజెక్టు ఆఫీసరు ఒక ప్రక్క పంచుకొన్నారు. జిల్లా కలెక్టరుతో పర్యటించిన విలేకరులు సీతంపేట, భద్రగిరి, మొండెల్, రామభద్రాపురం గిరిజన గ్రామాలలో సంరంభంచూచి "చూస్తూ, చూస్తూ, దీన్ని ప్రగతి కాదని ఎలా అనగలం" అని వితర్కించుకొన్నారు. గిరిజన ప్రాంతాలలో అభివృద్ధిని చూడవచ్చిన విశ్వవిద్యాలయం అధ్యయన సంఘం ప్రొఫెసరు పాత్రికేయులతో "ప్రభుత్వం గిరిజనులకు చాలా మేలు చేస్తున్నది. వారు దాన్ని సవ్యంగా ఉపయోగించుకోవాలి" అన్నారు. రామభద్రాపురం గిరిజనులలో చేపలు పట్టే వారిని మత్స్య పారిశ్రామిక సంఘంలో నమోదు చేసి ఒట్టిగడ్డ రిజర్వాయరులో చేపలు పట్టడానికి దుమ్మంగి గిరిజనులకు మత్స్యపారిశ్రామికులుగా నమోదుచేసి అక్కడి జలాశయంలో చేపలు పట్టుకోవడానికి అనుమతించడం ప్రభుత్వం శ్రీకాకుళం జిల్లా గిరిజనులకు ఇచ్చిన మరోవరం.


తొమ్మిదవ తేదీ సహకారం, పొదుపు దినంనాడు ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సూపర్ బజార్ శాఖ వెలయించడం చెప్పుకోదగ్గ విషయం. కళాశాల విద్యార్థులు చిన్న పొదుపు మొత్తాలుగా సేకరించిన 4,300 రూపాయలు ప్రిన్సిపాల్ శ్రీ డి. రామకృష్ణారావు జిల్లా కలెక్టరుకి అందచేసేరు కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకులో వ్యవసాయాభివృద్ధి బ్యాంకువారు ఋణాలు పంపిణీ చేసేరు.

పదవ తేదీ ధరల స్థిరీకరణ దినంనాడు డి. ఆర్. ఓ నాయకత్వంలో జిల్లా రెవిన్యూ అధికారులు పట్టణంలో సూపరు బజారుతో సహా 22 దుకాణాలపై దాడి చేసి ధరల స్థిరీకరణకు సక్రమ పంపిణీకి చర్యలు తీసుకొన్నారు. సాయంకాలం బాపూజీ కళామందిర్‌లో జరిగిన సభలో జిల్లా కలెక్టరు, డి.ఆర్.ఓ. ప్రభృతులు అక్రమంగా ధరలు పెంచడాన్ని ఖండించేరు.

పదకొండవ తేదీ వ్యవసాయ దినంనాడు రాగోలు, పెద్దపేట వ్యవసాయ క్షేత్రములలో వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్



"మా తెలుగు తల్లికీ మల్లె పూదండ" గేయం రాసిన శ్రీ శంకరంబాడి సుందరాచారిని ఆంధ్ర ప్రదేశ్ అవతరణోత్సవాల సందర్భంగా నెల్లూరు టౌన్ హాలులో సత్కరించారు.



నవంబరు 20న ఒంగోలు "ప్రకాశం భవనం"లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో నాలుగేళ్ళ బాలిక

ఆధ్వర్యంలో ప్రదర్శనలు జరిగేయి. అల్లిపురం, రణస్థలం, కళ్ళేపల్లి గ్రామాలలో రైతులు సమధికోత్సాహంతో పాల్గొన్నారు. ఈ 20 దినాలలో వివిధ వాణిజ్య బ్యాంకులు బలహీన వర్గాల వారికి 30 లక్షలకు పైగా ఋణాలు ఇచ్చి సేవ చేశారు.

12వ : తేదీ చేనేత దినోత్సవం నాడు జిల్లా కలెక్టరు పెదలాం చేనేత కేంద్రంలో వస్త్రాల అభివృద్ధి సంస్థకు ప్రారంభం చేశారు. రాష్ట్ర జవుళి సంస్థ ఆరు అంశాల కార్యక్రమం క్రింద జిల్లా కలెక్టరు మంజూరు చేసిన రూ. 62 వేల ఆర్థిక సహాయంతో 25 చేనేత మగ్గాలను ప్రారంభించేరు. దాదాపు వెయ్యి మగ్గాల వరకు ఏర్పాటు చెయ్యాలని నిర్ణయించేరు.

13వ తేదీ పరిశుభ్రతాదినం పురపాలక సంఘం ఆరోగ్యశాఖ నిర్వహించింది. జిల్లా కలెక్టర్ చీపురు పట్టి రెల్లివీధి ఊడ్చేరు. ఎస్ ఎఫ్.డి.ఏ. ప్రోజెక్టు ఆఫీసరు శ్రీ సుబ్బారావు తట్టల నెత్తి చెత్త తీసేరు. డి. ఆర్. ఓ. శ్రీ మురళీధర్ కుళ్ళుగోతులు పూడ్చేరు. మునిసిపల్ కమీషనరు, జిల్లా విద్యాశాఖాధికారిణి, పోలీసు ఇనస్పెక్టర్, ఒకరేమిటి? జిల్లా అధికారులు అంతా రెల్లి వీధి, దమ్మలవీధి తుడిచి పారిశుధ్యం ఆ వీధి వారికి బోధించేరు. ఇక్కడి గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు విటమినులు, ఖనిజ లవణాలు, మందులు పంచిపెట్టేరు.


14వ తేదీ బాలల దినం నాడు కన్నుల పండువుగా వేడుకలు జరిగేయి. ఆసుపత్రి సూపరింటెండెంటు పర్యవేక్షణలో పౌష్టికాహార ఔషధములు విద్యార్థులకు పంచేరు. బాలల ఎకాడమీ జరిపే ప్రతిభాపాటవ పోటీలలో పాల్గొనడానికి జిల్లా అంతటి నుండీ విద్యార్థులు వచ్చేరు. డి. ఇ. ఓ. ఇన్‌ఛార్జి శ్రీమతి వి. నరసుబాయమ్మ ఈ పోటీలను దగ్గరుండి జరిపించి ఉత్తమ విజేతలకు, ఉత్తమ ప్రదర్శకులకు సాయంకాలం సభలో ఎకాడమీ యోగ్యతా పత్రాలు పంచేరు సారవకోట సమితి గొర్రబంద గ్రామంలో నాలుగవ తరగతి చదువుచున్న విద్యార్థి చిరంజీవి నరసింహారావు మట్టిలో మాణిక్యంలాగ గోచరించేడు. కూచిపూడి, జానపదం, ఒడిస్సా నాగిని నృత్యాలు హావభావాలతో చేసి ప్రేక్షకుల హృదయాలను గిలిగింతలు పెట్టేడు.

పశ్చిమ గోదావరిజిల్లా పెరవలి గ్రామపంచాయితీ వ్యవసాయ శాఖ ఉద్యోగులు ప్రదర్శించిన ''మధుర క్షణాలు'' చూస్తున్నంత సేపు ప్రేక్షకులకు నిజంగా మధురక్షణాలే అనిపించింది.


15వ తేదీ పారిశ్రామిక దినం. స్వయం ఉపాధిపథకాల ఋణాలు, వృత్తి పని ఋణాలు పంచడం పారిశ్రామిక దారులను గుర్తించడం జరిగింది 16వ తేదీ కార్మిక దినంనాడు బొబ్బిలి, సీతానగరం, ఆముదాల వలస చక్కెర కర్మాగారాలలో గరివిడి ఫ్యాక్టరీలోను కార్మికులకు బోనసు పంచడం, సంక్షేమ పథకాలు చేపట్టడం జరిపించేరు.

17వ తేదీ వరకట్న నిషేధ దినం వేలాది మంది యువతీ యువకులు, అధ్యాపకులు న్యాయవాదులు ఊరేగింపుతో మహిళా కళాశాలకు తరలివెళ్ళేరు. అక్కడ జరిగిన వరకట్న నిషేధం చర్చపై ప్రముఖులెందరో పాల్గొంటూ ఉంటే యువతీ యువకుల ఆనందకోలాహలం మిన్నుముట్టింది. మూడు కళాశాలలకు చెందిన 300 మంది యువతీయువకులు కట్నాలు తీసికోమని, పుచ్చుకొన్న వారిని పెళ్ళాడమని ప్రతిజ్ఞలు చేసేరు.


18వ తేదీ పశుసంవర్ధక దినమునాడు ఆరసవిల్లిలో పాల ఉత్పత్తి దారుల సభ జరిగింది. మంచి పాడి పశువులను పెంచిన వారికి లియో, లయన్సు క్లబ్బులు వెండి కప్పులు బహూకరించేరు. కేంద్రీకృత వీర్య సేకరణ కేంద్రంలో పాల పోటీలు, సంకరజాతి లేగదూడల ప్రదర్శన, దూడలకు ఏలిక పాముల చికిత్స, పశుగర్భ రోగ చికిత్స, కేడక్టమీ, మందగుడి అపరేషను నిర్వహించి పశు సంవర్ధక శాఖ వారు మేలి జాతి పశువుల పెంపకానికి చేస్తున్న కృషిని వివరించేరు. కోళ్ళ పెంపకం. పశుగ్రాస ప్రదర్శనం ఏర్పాటు చేసేరు.



ఒంగోలు ప్రకాశం భవనంలో సాంస్కృతికోత్సవాల సందర్భంగా వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ శ్రీ చంద్రశేఖర రావు ప్రదర్శన. జిల్లాకలెక్టరు శ్రీ కె. స్వామినాథన్ సభకు హాజరయ్యారు.




నవంబర్ 17 న ఒంగోలు మునిసిపల్ ఆఫీసు ఆవరణలో వరకట్న వ్యతిరేక దినోత్సవానికి జిల్లా రివిన్యూ అధికారి శ్రీ టి. నారాయణ రెడ్డి అధ్యక్షత వహించారు. శ్రీ లిల్లీసుందరం ప్రసంగించారు.



కడపలో నవంబరు 16న యాంత్రిక శాఖామంత్రి డా. సి. హెచ్. దేవానందరావు యాంత్రిక ఇటుకల పరిశ్రమకు శంకుస్థాపనచేశారు.



మత్స్యశాఖామంత్రి శ్రీ మునిస్వామి ఆదోనిలో మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీచేశారు.



ఆర్థిక, సమాచార మంత్రి శ్రీ పి. రంగారెడ్డి నవంబరు 14 న ఒంగోలులో ఎగ్జిబిషన్‌కు ప్రారంభోత్సవంచేశారు. కలెక్టర్ శ్రీ కె. స్వామినాథన్, రెవిన్యూ అధికారి శ్రీ టి. నారాయణరెడ్డి చిత్రములో వున్నారు.]


19వ తేది ప్రధాని పుట్టిన రోజు. చేయడంలో మహిళాలోకం మగవారి తల తన్నింది. మహిళల మహాసముద్రం ఒకటి పట్టణ పురవీధులలో పొంగి పొరలింది. విశాఖ–పూరీ ఎక్సు ప్రెస్‌బస్సు 15 నిముషాలు రోడ్డుమీద ఆగిపోయింది, మిగిలిన వాటికి లెక్క ఏముంది? జిల్లా శిశు సంక్షేమ శాఖాధికారిణి, జిల్లా విద్యాశాఖాధికారిణి, స్త్రీ సమాజం, మహిళా మండలి ఆధ్వర్యంలో ముందు పోలీసు బ్యాండు నడుస్తుండగా, నిలువెత్తు ఇందిరాగాంధి విగ్రహ పటం ఉంచిన జీపుతో, నినాదాలతో ఊరేగింపు జరిగింది. సాయం కాలం జిల్లా పరిషత్తు హాలులో శ్రీమతి రాజారెడ్డి అధ్వర్యంలో 'ప్రగతి పథంలో మహిళల పాత్ర' అనే అంశంపై సభ జరిగింది. పలువురు తమ ముక్త కంఠంతో ప్రగతి పథంలో ప్రతిధ్వనింప చేసేరు.

ఉదయం మరొక మంగళ కార్యక్రమం అస్పృశ్యతా దినం సందర్భముగా 500 మంది హరిజనులు కోదండరామస్వామి ఆలయంలో ప్రవేశించేరు. ప్రధాని పేరిట పూజలు జరిపించేరు. ఊరేగింపుగా జిల్లా పరిషత్తు కార్యాలయం దగ్గరకు వెళ్ళేరు. పలువురు వక్తలు ప్రసంగించారు

20వ తేదీ ఉదయం జిల్లా పరిషత్తు హాలులో కవి సమ్మేళనం జరిగింది. ప్రభుత్వ కళాశాల ఆంధ్ర శాఖాధ్యక్షులు శ్రీచాగంటి గోపాలకృష్ణమూర్తి అధ్యక్షత వహించేరు. 10 మందికి పైగా కవులు 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం పై కవితలు వినిపించేరు. కవులందరినీ ఉత్సవకమిటీ దుశ్శాలువలతో సన్మానించింది.

సాయంకాలం 20 దినాల ఉత్సవాలకు మంగళగీతం పాడడం జరిగింది. వివిధ విద్యుదీపాలంకృతమైన బాపూజీ కళా మందిర్‌లో పెద్దసభ జరిగింది, కలెక్టర్ ఇన్‌చార్జి శ్రీ కె. మురళీధర్ అధ్యక్షత వహిస్తూ బలహీన వర్గాల అభ్యున్నతికి జిల్లా అధికార వర్గం చేసిన సేవలు వివరించేరు.

–శ్రీ ఎ.వి. రమణ



డోన్ శాసనసభ్యులు శ్రీ శేషన్నగారు నవంబరు 2న రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ పాల విక్రయ కేంద్రములకు ప్రారంభోత్సవం చేశారు.

విజయవాడలో :

ఆంధ్రప్రదేశ్ ద్విదశాబ్ది వుత్సవాల సందర్భాన్ని పురస్కరించుకుని, రాష్ట్ర సమాచార శాఖవారి సౌజన్యంలో ("హెల్ప్ ది హెల్ప్‌లెస్") నిస్సహాయులకు సహాయం చేయండి అనే స్వచ్ఛంద సేవా సంస్థ విజయవాడవారు, 15వ తేదీ రాత్రి బాప్టిస్టు పాలెంలో ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం గూర్చి సినీ రచయిత శ్రీ కొసరాజు రచించిన 'నవభారతం' అనే బుర్రకథను ఏర్పాటు చేశారు.

అవనిగడ్డ ప్రకాష్ దళంవారు బుర్రకథ చెప్పారు.

తొలుత హెల్ప్ ది హెల్ప్ లెస్ ఛైర్మన్ శ్రీ ఎం. హెచ్. మోజెస్. ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ నిస్సహాయులకు 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం ద్వారా ఏ విధంగా సహాయాన్ని అందిస్తున్నదీ వివరించారు. సమసమాజ నిర్మాణానికి పేదప్రజ అంతా యీ కార్యక్రమానికి మద్దతు నివ్వాలని ఆయన కోరారు.

శ్రీ బి. బెంజమిన్ వందన సమర్పణ చేశారు.

విశాఖ జిల్లాలో :

14-11-76వ తేదీన విశాఖజిల్లా భీమునిపట్నం తాలూకా రఘుమండ గ్రామంలో సమితి అప్పర్ ప్రైమరీ పాఠశాలలో 'బాలల దినోత్సవము' పంచాయతీ ఆధ్వర్యంలో జరిగింది భోగాపురం సమితి డిప్యూటీ యినస్పెక్టరు శ్రీ జి. బాబూరావు జెండా వందనము చేశారు. విద్యార్థులకు మిఠాయి పంచబడింది. మధ్యాహ్నం 3 గంటలకు భోగాపురం సమితి బ్లాక్ డెవలప్‌మెంటు ఆఫీసరు శ్రీ యం. నాగేశ్వరరావు అధ్యక్షతను బహిరంగ సభ జరిగింది. విజయనగరం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారిచే 60 కుటుంబాలకు చెందిన బలహీనవర్గాల వారికి ఋణముల పంపిణీ జరిగింది యూనియన్ బ్యాంక్ మేనేజరు శ్రీ వి రామారావు ఫీల్డు ఆఫీసరు శ్రీ జి జగన్మోహనరావు మొదలగు వారు ఉపన్యసించిరి. గ్రామ సర్పంచ్ శ్రీ పిళ్ళా కృష్ణారావు వందన సమర్పణతో సభ ముగిసింది.

తూర్పు గోదావరి జిల్లాలో :


ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాల సందర్భంగా నవంబరు 19వ తేదీన తూర్పు గోదావరిజిల్లా ప్రత్తిపాడులో శ్రీమతి ఇందిరా గాంధి జన్మదినోత్సవం ఘనంగా జరిగింది.

జిలాకలెక్టరు శ్రీయు బి. రాఘవేంద్రరావు కెనరాబ్యాంకి 100 మంది సన్నకారురైతులకు పాడిపశువుల నిమిత్తం మంజూరు చేసిన లక్ష ఏభైవేలకు, యూనియన్ బ్యాంకు ఏలేశ్వరం, ప్రత్తిపాడు 66 పాడిపశువులకూ 15 బండిఎడ్లకు లక్షా డెబ్బదివేలకు, ప్రత్తిపాడు వ్యవసాయ బ్యాంకు 38 సన్నకారురైతులకు భూమి మరమ్మత్తు, బావులకు, ఆయిల్ ఇంజన్లకు మంజూరుచేసిన డెబ్బది వేలకూ అప్పు మంజూరు పత్రాలు పంచారు.

ఈ సందర్భంగా కలక్టరు ప్రధాని జన్మదిన కానుకగా ప్రత్తిపాడులో కెనరా బ్యాంకువారు మొదటిదఫాగా నూరు పాడి పశువుల కొనుగోలుకు ఏర్పాటు చేసున్నారనియు, ప్రధాని 20 సూత్రాలు అమలుపరచడంలో ప్రజలు సహకరించి, ఆర్థికంగా ముందుకుపోవాలనియు నెలనెలా అప్పులు క్రమంగా చెల్లించి దారిద్ర్యం నుండి తొలిగేందుకు ప్రయత్నించాలనియు, అప్పులు ఎగవేయువారిపై గట్టిచర్య తీసుకుంటామనియు అన్నారు. కెనరాబ్యాంకు మేనేజరు శ్రీ పి. వి. ఎస్. రాజు వారి బ్యాంకి 2, 3 నెలలలో స్థానికంగా బ్రాంచిని ప్రారంభించ బోతున్నదని ఈ తాలూకాలోని 8 గ్రామాలు దత్తత చేసుకున్నామని అన్నారు. సన్నకారురైతు సంస్థాధికారి శ్రీ ప్రసాదరావు మాట్లాడుతూ సన్నకారురైతుల అభివృద్ధికి పాడిపరిశ్రమ చాల ఉత్తమ మార్గమనీ, మొదటి గేదె అప్పు త్వరగా తీర్చి రెండవ గేదెను



నవంబరు 1వ తేదీన ప్రకాశంజిల్లా కందుకూరులో జరిగిన ఉత్సవం



రెవిన్యూమంత్రి శ్రీ పి. నరసారెడ్డి ఆదిలాబాద్ జిల్లాలో "మా తెలుగు తల్లి" చిత్రాన్ని పూలమాలతో అలంకరించిన దృశ్యం

పొందాలనియు పాల ఉత్పత్తినంతా తీసుకొనేందుకు హార్లిక్స సంస్థ సహకరిస్తున్నదనీ చెప్పారు.

సభకు "హార్లిక్స్" సంస్థకు చెందిన శ్రీహరి పెద్దాపురం ఆర్. డి. ఓ. శ్రీ ఎమ్ ఎస్. మూర్తి హాజరైనారు.

బి డి. ఓ. శ్రీఅప్పారావు బ్యాంకులు పోటీపడి ఈ ప్రాంతములో పాడిపరిశ్రమను అభివృద్ధి చేస్తున్నాయని అభినందిస్తు వందన సమర్పణ గావించారు.

అంతకుముందు వ్యవసాయ బ్యాంకు వద్ద బ్యాంకు అధ్యక్షులు శ్రీ వి. జోగిరాజు జండా నెగురవేసి ప్రధాని చిత్రపటానికి పూలమాలలు వేశారు.

సమాచార శాఖ వారిచే 20 సూత్రాల పై గోష్ఠి, లలిత సంగీత కార్యక్రమాలు నిర్వహించబడినవి

చిత్తూరు జిల్లాలో :

ఆంధ్ర ప్రదేశ్ ద్విదశాబ్దపు వార్షికోత్సవ ప్రారంభోత్సవ వేడుకలు నవంబరు 1వ తేదీన చిత్తూరుజిల్లా చంద్రగిరిలో వైభవోపేతంగా జరుపబడ్డాయి.

ఉదయం 7 గంటలకు చంద్రగిరి బి డి ఓ. శ్రీ పి. రాధాకృష్ణ మూర్తిగారు సమితి కార్యాలయావరణములో జాతీయ పతాకా విష్కరణ గావించారు.

సాయంత్రం 6 గంటలకు బ్రహ్మాండమైన బహిరంగసభ జరుప బడింది. ఈ బహిరంగసభకు వివిధ గ్రామాల నుండి సర్పంచులు, ప్రజా ప్రతినిధులు హాజరైనారు. సుమారు 600 పెద్దలు, చిన్నలు, స్త్రీలు హాజరైనారు.

సభకు చిత్తూరు మాజీ జిల్లా పరిషత్తు అధ్యక్షులు, ప్రస్తుతం రేణిగుంట సహకార చక్కెర ఫ్యాక్టరీ ఉపాధ్యక్షులైన శ్రీ ఆర్. నాధమునిరెడ్డిగారు అధ్యక్షత వహించారు. తిరుపతి నియోజక వర్గ శాసన సభ్యులైన శ్రీ విజయశిఖామణిగారు ఈ సభకు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.

చంద్రగిరి హరిజనవాడకు చెందిన 85 హరిజనులకు చంద్రగిరి సర్పంచ్ శ్రీ కె. ముని రామయ్యగారి ద్వారా నివేశన స్థలాలు పంచిపెట్టబడ్డాయి.


ఆంధ్ర ప్రదేశ్ ద్విదశాబ్దపు వార్షికోత్సవాలను పురస్కరించుకొని చంద్రగిరి రూరల్ హెల్తు సెంటర్ మరియు శ్రీ వెంకటేశ్వర మెడికల్ కాలేజి వారి ఆధ్వర్యాన చంద్రగిరి రూరల్ హెల్తు సెంటర్లో నవంబరు 1వ తేదీ నుండి 20వ తేదీ వరకు హెల్తు ఎగ్జిబిషన్ జరిగింది.

ప్రకాశం జిల్లాలో :

పొదిలిలో 19-11-76 తేదీన భారత ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ జన్మ దినోత్సవ సందర్భంలో బహిరంగ సభ యేర్పాటు చేయబడినది. స్టేట్ బ్యాంకు మేనేజరు శ్రీ టి. అప్పారావుగారు 50 మంది దళిత వర్గ ప్రజలకు రు. 23,000/- లను పాడిపశువులను మొదలగునవి కొనుగోలు చేయుటకుగాను మంజూరు చేశారు. ఇంకా లోగడ స్టేట్ బ్యాంకు వారు రు. 75,000/- లను పాడిపశువులను, కుట్టు మిషన్లు, గొర్రెల పెంపకానికి మొదలగు వాటికి గాను 150 మంది బీదప్రజలకు ఋణాలు మంజూరు చేసినట్లుగా కూడా చెప్పినారు.

పొదిలి తహసిల్దారు శ్రీ టి. మూర్తిగారు కూడ ప్రసంగించారు.

ఈ సభకు పొదిలి డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ శ్రీ వి రాజేశ్వర రావుగారు అధ్యక్షత వహించారు.



నవంబరు 13వ తేదీన నిర్మల్‌లో రెవిన్యూమంత్రి శ్రీ పి.నరసారెడ్డి సర్‌పంచుల సమావేశములో ప్రసంగించారు.

కృష్ణా జిల్లాలో :

కృష్ణాజిల్లా దివి తాలూకాలో 1976-77 సంవత్సరానికి అవనిగడ్డ పంచాయతీ సమితిలో అవనిగడ్డ గ్రామ పంచాయతీయున్నూ, మొవ్వ పంచాయతీ సమితిలో పక్కలగడ్డ గ్రామ పంచాయతీయూ ఉత్తమ పంచాయతీలుగా ఎన్నికయ్యాయి. అవనిగడ్డ సమితిలోగల సొర్లగొంది గ్రామ పంచాయతీ నూటికి నూరుపాళ్ళు పన్నులు వసూలు చేసినట్లు యిటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్ అవ

గుండ్లమోటు ప్రాజెక్టు

—శ్రీ బి. కృష్ణారావు.

నల్లమల అడవులలోని అహోబిలము కొండలలో యెనుములేరుపుట్టి చెలిమ మోటువద్దగల మైదానములో ప్రవేశించుటకు 21 మైళ్ళ దూరము ప్రవహించుచున్నది. ఎనుములేరు సగిలేరు నదికి ఉపనది ఈ రెండును ఎనుములేరునకు గుండ్ల మోటువద్ద నిర్మింపబడనున్న రిజర్వాయరునకు 6 మైళ్ళ దూరమున కలియుచున్నవి. చాలకాలము క్రిందట ఎనుములేరునకు వెంకటాపురమువద్ద ఆనకట్టను నిర్మించి ఒక సప్లయిఛానలు ద్వారా నీటిని కంచిపల్లె ముండ్లపాడు చెర్వులకు పోవునట్లు చేయబడుచున్నవి.

ఈ గుండ్లమోటు ప్రాజెక్టును నిర్మించవలయునని ఈ ప్రాంతపు ప్రజలు 1960 నుండి ఆందోళన చేయుచున్నారు.

దాదాపు 8 మాసములు ప్రాజెక్టు క్రింది భూములకు నీటిని సరఫరా చేయుటకు వీలు కలుగుటచేతను, ఆయకట్టుగ నిర్ణయించిన భూములకు ఎక్కువగ మరమ్మత్తులు చేయనవసరము లేకపోవుట చేతను, పూర్వము గిద్దలూరు ప్రాంతము రాయలసీమ ప్రాంతములో చాల వెనుకబడిన ప్రాంతముగ నుండి ప్రస్తుతము కోస్తా జిల్లాల అభివృద్ధి మండలములో యీ ప్రాంతము చేర్చబడినను, అభివృద్ధి కార్యక్రమములకు రాయలసీమ అభివృద్ధి నిధుల నుండి ఖర్చుచేయబడుట చేతను ఈ ప్రాజెక్టును ప్రభుత్వమువారు మంజూరుచేయుట ముదావహము.

ఈ గుండ్లమోటు ప్రాజెక్టు రిజర్వాయరు నిర్మాణ ప్రదేశము ముండ్లపాడు గ్రామములో చేరిన వెంకటాపురమునకు మూడు మైళ్ళ దూరములోనున్నది. ఈ రిజర్వాయరు పరీవాహకపు ప్రదేశము 53.7 చదరపుమైళ్ళ విస్తీర్ణము కలిగి, 1300 ఎకరముల భూముని సాగులోనికి తెచ్చుచున్నది. ఖరీఫ్ పంటకు 1300 ఎకరములు, రబీపంటకు అందులో అర్ధ భాగమునకు నీటిపారుదలయగును.


ఈ ప్రాజెక్టు నిర్మాణములో పిక్అప్‌డాము నిర్మాణమొక విశిష్టత. మొదట రెగ్యులేటరును నిర్మించాలనుకొన్న స్థలములోనే వాగునకు రిజర్వాయరు నిర్మాణమునకు దిగువ భాగమున, ఈ పిక్అప్‌డాము నీటిని సమాయత్త పరచి, ఆ నీటిని కాలువల గుండ ఆయకట్టునకు సరఫరా చేయును. పిక్ అప్‌డాము 90 మీటర్ల పొడవు కత్తువునకు దానిలోనే తూములు దిగువ భాగమునకు కేటాయించబడినవి.

నిర్మాణము కాగల అంశములలో కొన్ని ప్రాధాన్యమును వహించినవి (1) ఎనుములేటికి అడ్డముగ 425 మీ. పొడవు 15 మీ. ఎత్తుగల మట్టి కట్టను నిర్మించుట, (2) ప్రధానమైన తూము నిర్మాణము, (3) పిక్ అప్‌డాము నిర్మాణము (4) పిక్ అప్‌డాము నుండి ఎర్రగుంట్ల కాలువను త్రవ్వుట, (5) వరద నీటిని వదలుటకు 200 మీ. పొడవుగల అలుగుకట్ట నిర్మాణము (6) డామునకు ఎడమ భాగము నుండి వెంకటాపురమునకు, బైనపల్లెకు కాలువల త్రవ్వకము. పిక్ అప్‌డాము ఎడమ వైపునుండి రెండు నీటిపారుదల కాలువలలో ఒకటి బైనపల్లె పొలములకు మరొకటి వెంకటాపురము పొలములకు స్వతంత్రముగ తూముల నుండి పారుదలయగును.

వెంకటాపురము కాలువ 3600 మీ. పొడవు కలిగి 20 00 క్యూసెక్కుల నీటిని విడుదల చేయుచు ఖరీఫ్ పంటకు ఎ 650. రబీ పంపకు ఎ 325. లకు, బైనపల్లె కాలువ 4140 మీ పొడవు కలిగి 20.00 క్యూసెక్కుల నీటిని విడుదల చేయుచు, ఖరీఫ్ పంటకు ఎ 650, రబీ పంటకు ఎ 325, లకు పారుదల చేయగలవు.

పై ఆయకట్టులో దాదాపు 15 ఎకరముల పొరంబోకు భూమి యున్నది. దానిని మార్కెట్టు ధరకు పట్టాల కివ్వవచ్చును.

1300 ఎకరముల భూమినేగాక, నిర్ణీతమైన నీటికన్న ఎక్కువయున్న. మిగిలిన భూములకు కూడ నీటిపారుదల సౌకర్యమును కలుగ చేయుటకు అవకాశములున్నవి. ఎనుము లేటికి అడ్డముగ రిజర్వాయరు నిర్మాణమును చేపట్టుటకు ప్రభుత్వము వారు రు. 28,57,000/- లు మంజూరు చేసింది.



ఇరవై స్థంభాలపై గుడి

—శ్రీ పోతుకూచి సాంబశివరావు

ఇరవై సంవత్సరాల సోపానాల
ఆరోహణ శ్రమ ఫలితం
ఇరవై స్తంభాలపై ఉన్న
సుందర దేవాలయ దర్శనం

గుడిలో దేవత లేదు, కానీ
ఒడిలో శిశువును సాకే మాతృమూర్తి
మందస్మిత వెలుగుల భాసిస్తోంది
మాతృ మమత మహోన్నతమైన ప్రేమ
మాతృ లాలన మధురమైన అనుభూతి

అవిగో గంటలు గణగణ మ్రోగుతున్నాయి
ఇవిగో హృదులన్నీ ఆనందంతో తొణుకుతున్నాయి
ఈ దేశ చరిత్రలో దేవాలయం
మానవ సమతా సమాజ నిలయం
న్యాయ నిర్ణయాలు, మంగళప్రద సంఘటనలు
కళావిన్యాసాలు, కదనరంగ వ్యూహాలు
కోటగా నిలుపుతున్న వేదిక, దేవాలయం.

చరిత్ర కాల గమనంలో
నియంతలు గుడులను దోడి చేశారు
అయినా పవిత్రత ఉరిత్రాడు వేసుకోలేదు
ప్రేమ మన సీమలు దాటి పోలేదు

రెండు దశాబ్దాల కాలంలో
పండుతనం పండుతుంది మనస్సుకు
క్రొత్త ఉషస్సులు తొంగిచూస్తాయి
సంశ్లిష్టతమస్సులు తొంగిపోతాయి

తెలుగు తల్లి ప్రపంచ వీధులలో పట్టిన జయపతాక
తెలుగు సీమ ఎల్లలు దాటి
భరత సీమ పెల్లలయింది
తన వయసు కిరణాలు ప్రసరించి
మన ఉనికికే క్రొత్త తనువు యిచ్చింది
ఇరవై స్థంభాలపై ఉన్న దేవాలయం
ఇంపు సొంపుల యాత్రాస్థలి అయినా.
మరచిపోవద్దు, స్థంభాల మాటున
అనంత నీరాల సుడిగుండాలు తిరుగుతున్నాయి

ఎవరా జ్యోతి ?
శతకోటి సూర్యుల వెలుగుల ప్రచండ తేజమై
దేవాలయాన్ని ప్రకాశమానం చేస్తోంది
ఈ అనంత నభోమూర్తిని
ఆపాద మస్తిష్కం పరిశోధనలో
ఈ వెలుగు పరిమితి నిస్సందేహం
మన మనోజ్యోతి పరిణతి అవశ్యం

ఈ ఇరవై స్తంభాలపై ఉన్న గుడిలోన
జరిగే మానవతా సమతా యజ్ఞంలో
ప్రతిధ్వనించి, ప్రకంపించే
ఋత్విక్కుల నూత్న విజ్ఞాన నాదాల
సరిగమల గమనంలో
ఏ క్రొత్త వీణ మ్రోగుతుందో !
ఏ క్రొత్త రాగం సాగుతుందో !

అదే జీవితంలో తొలగించు విపత్తు
అదే హృదిలో ప్రసరించు నవ విద్యుత్తు.

సీరియల్:



హరిజన వాడ

-శ్రీ ఉన్నవ మదన మోహనరావు

-5-

నాగాయ్య చౌదరి జాతీయ భావాలు గల మనిషి. గాంధీ మహాత్ముడు రామాపురం దర్శించే నాటికి ఆయన చిన్న పిల్లవాడు. పది, పన్నెండేళ్ల వయసు వుండ వచ్చును. మహాత్ముని దర్శన భాగ్యం కలిగిన వ్యక్తి. ఆయనకు యౌవనం సంప్రాప్తించే నాటికి దేశంలో రాజకీయ పరిస్థితి అస్తవ్యస్తంగా వున్నది. ఒక వైపున యుద్ధ జ్వాలలు ప్రపంచాన్ని చుట్టి ముట్టి దహించి వేస్తున్నాయి. అదే తరుణంలో గాంధీ మహాత్ముడు 'క్విట్ ఇండియా' ఉద్యమానికి శంఖారావం చేశాడు. బి. ఎ. ఫైనలియరు చదువుతున్న చౌదరి ఊరుకో లేక పోయాడు। ఫలితంగా ఆరు మాసాలు శ్రీ కృష్ణ జన్మ స్థానం లభించింది.

జైలు నుండి రాగానే చౌదరి మీద కుటుంబ బాధ్యతలు పడ్డాయి. తండ్రి కాలం చేశాడు. తల్లి అంతకు ముందే లేదు. ఉన్న పది ఎకరాల పొలంలో వ్యవసాయం చేస్తూ ఇంటిదగ్గిర వుండి పోవలసి వచ్చింది।

జాతీయ భావాలు కలిగినవాడవటం చేతనూ, జైలు జీవితంలో అనేక మంది పెద్దల పరిచయ, సహచర్య భాగ్యం కలిగిన వాడవటంచేతనూ, ఆయనలో దేశానికి సేవ చేయాలనే కోరిక ఉవ్విళ్లూర సాగింది। ఫలితంగా చౌదరి హరిజనుడైన రామదాసును తన ఇంట్లో జీతానికి పెట్టుకున్నాడు. ఆ రోజుల్లో హరిజనుణ్ని జీతానికి పెట్టుకోవటం కూడ గొప్ప కార్యంగానే పరిగణించ బడేది.

హరిజనుణ్ని పాలేరుగా పెట్టుకున్న రైతుల్లో చౌదరి మొదటివాడు. ఆ మరుసటి సంవత్సరమే పంచాయతీకి ఎన్నికలు జరిగాయి। చౌదరి ఎన్నికలలో పోటీ చేసి ఎక్కువ మెజారిటీతో గెలిచాడు।

అప్పటి నుంచి చౌదరి రాజకీయ జీవితం ప్రారంభమైంది. వ్యవసాయం రామదాసు భుజాల మీద వేసి తాలూకా బోర్డు ప్రెసిడెంటు కాగలగాడు. క్రమంగా అధికారపు నిచ్చెనలో జిల్లా బోర్డుకు గూడ ఒకసారి ప్రెసిడెంటు కాగలిగాడు।

ఈ నాడు చౌదరి జిల్లాలోని ప్రముఖ వ్యక్తి. ఆయన పేరు ప్రతిష్ఠలతోపాటు ఆస్తి కూడ పెరిగింది. పది ఎకరాల పొలం నుంచి ఏభై ఎకరాలకు కమతం పెరిగింది. ఇది కాక పది ఎకరాల మామిడి తోట వున్నది.

చౌదరికి, జిల్లా బోర్డు ప్రెసిడెంటుగా వున్న కాలంలో భార్య గతించింది. రాజకీయాలలో నిరంతరం విరామం లేకుండా తిరిగే చౌదరి ద్వితీయం చేసికోలేదు.

ఇరవై ఏండ్లుగా చౌదరి గ్రామానికి ముకుటం లేని చక్రవర్తి. ఇటీవలి కాలంలో తన గ్రామంలోని దాయాదుల నుండి కొంత పోటీ ఎదుర్కొవలసి వస్తున్నా, ఆయన పలుకు బడికి భంగం మాత్రం కలుగ లేదు.

చౌదరి పట్నం నుంచి వచ్చే సరికి పది రోజులు పట్టింది. ఆ క్రిందటి రోజే రామదాసు కోతలు పూర్తి చేయించి మేదెలు వేయించాడు. ఇక కంకులు కోయించి నూర్పిడి చేయించాలి।

ఈ పది రోజులూ లక్ష్మి కూలీలకు తలా ఒక తవ్వెడు బియ్యం కొలిపించింది, రామదాసు చెప్పినా విన కుండా ఆడ కూలీలకు మగ కూలీలతో సమానంగా కూలి రెండు రూపాయల చొప్పున ఇచ్చింది. దాసు మాత్రం లోలోపల భయపడుతూనే వున్నాడు.

నిజానికి లక్ష్మి కొలిచిన బియ్యం. ఇచ్చిన ఎక్కువ కూలి వృధా పోలేదు! కూలి జనం యావత్తూ లక్ష్మి ఔదార్యాన్ని పొగడటమే కాకుండా ఉత్సాహంగా పని చేశారు. పదిహేను రోజులు పట్టవలసిన కోతలు తొమ్మిది రోజులలో పూర్తి చేశారు! ఈసంగతి బాబుగార్కి నచ్చ చెప్ప వచ్చును అనే ధైర్యంతో వున్నాడు దాసు!

భయపడినంతా జరిగింది. చివరకు చౌదరి దాసుని పిలిచి చీవాట్లు పెట్టాడు?

"నేను వద్దనే చెప్పానండి చిన్నమ్మగారితో" మొర పెట్టు కున్నాడు దాసు.

అయినా చిన్న పిల్ల! దానికి తెలియక పోతే పెద్ద వాడివి నీవు చెప్పవద్దా! ఈసారి కోతలకు బియ్యం పెడితేగాని రామంటారు కూలీలు! మగకూలీలతో సమానంగా ఇవ్వమంటారు ఆడ కూలీలు! మగకూలీలు వాళ్ళకంటె ఎక్కువ ఇవ్వ మంటారు! ఇదేనా నిన్ను నమ్ముకున్నందుకు చేయాల్సిన పని! ఊళ్లో ఏ రైతు దగ్గరైనా బియ్యం కొలిపించ గలుగుతావా? ఏ రైతైనా ఆడ కూలీలకు మగ కూలీలతో సమానంగా కూలి ఇస్తున్నాడా"?

బాబుగారూ! నా మాట వినండి! చిన్నమ్మగారు జాలితో ధర్మం చేశారు బియ్యం! అంతేగాని అది రివాజు కాదు! పోతే ఆడ కూలీలకు పావలా కలిపి ఇచ్చారు మగ కూలీలతో సమానంగా! నిజానికి ఆడ కూలీలు కూడ అంతే పని చేస్తారని మీకు తెలియనిది ఏముంది బాబుగారు అయినా కూలీలు కూడ ధర్మం వుంచు కోలేదు బాబు! మామూలుగా అయితే కోతలు పూర్తి అయ్యేసరికి పదిహేను రోజు లకు పైగా పట్టేవి! అటువంటిది తొమ్మిది రోజులలోనే పూర్తి చేశారు! మనకు ఎనిమిది రోజుల కూలి మిగిలింది బాబు?

చౌదరికి చిర్రెత్తింది! లక్ష్మి చేసిన పని ఆయనకు ఇష్టం లేక పోయినా, పైకి మాత్రం కూలీల దృష్టిలో తను మంచి వాడుగా కనబడాలి! ఎన్నికలలో ఓట్లు తనకు రావాలంటే అప్పుడప్పుడు ఉదారంగా వ్యవహరించాలి! అయితే కార్మిక జనం ఎప్పటి మేలు అప్పుడే మరిచి పోతుంది! ఇప్పుడు ఎన్నికల హడావుడి లేకుండా ఈ దానం చేయటం అకాలదానమే అవుతుంది! పైకి మాత్రం దాసుతో 'చాల్లే! వెధవలెక్కలూ, నీవూను!' అంటూ రుస రుస లాడుతూ లోపలికి పోయాడు చౌదరి.

లక్ష్మి తన గదిలో కూర్చొని ప్రకాశం తెచ్చి పెట్టిన 'మాల పల్లి' చదువుతూ వున్నది. గుమ్మంలో నిలబడిన తండ్రిని గమ నించనేలేదు!

'ఏ వమ్మా నాలుగు రోజులు నేను లేక పోతే ఆ వెధవలకు బియ్యమన్నీ కొలిపించావేం?'' అన్నాడు చౌదరి.

లక్ష్మికి తండ్రి మాటలు వినిపించ లేదు! 'ఏమిటి నాన్నా'? అంది పుస్తకంలోంచి తల ఎత్తి తండ్రి వైపు చూస్తూ.

'ఏమిటా? జొన్న కోసినకూలీలకు బస్తా బియ్యం కొలిపించావేం?'

'ఓస్, అదా సంగతి! పోనీలే నాన్నా! నీవు చేసే ఖర్చులో ఇది ఏ పాటిది?' అంటూ చిలిపిగా తండ్రి కళ్లలోకి చూసింది లక్ష్మి. చౌదరికి కూతురంటే పంచప్రాణాలు. తల్లిలేని పిల్లకావటం చేత లక్ష్మి మాటకు ఎదురు లేదు! లక్ష్మితో కోపంగా మాటాడటం కూడ చేత కాదు చౌదరికి.

"అది గాదు తల్లీ! ఈ అలగా జనానికి అలుసిస్తే నెత్తికి ఎక్కుతారు! వాళ్లకి కడుపులో ఒక్క మూల కాలుతూవుంటేనే పని చేస్తారు! కడుపునిండితే పనికి రారు! ఈ రోజు బియ్యం పెట్టావనుకో రేపు బియ్యం పెట్టకపోతే మన చాయలకు రారు! పైగా ఆడ కూలీ లకు మగ కూలీలతో సమానంగా కూలి ఏనాడూ ఇవ్వలేదు! అసలు వాళ్లను ఎంత దూరంలో వుంచాలో. అంత దూరంలోనే వుంచాలి!'' చిన్న ఉపన్యాసంలాంటిది ఇచ్చాడు చౌదరి.

'నేనేం నెత్తికెక్కించుకున్నాను నాన్నా వాళ్లని? ఆ రోజు సుబ్బి అవస్థ చూడలేక బియ్యం ఇప్పించాను. పోతే స్త్రీలకు పురుషు లతో సమానంగా ప్రతిపత్తి కల్పించాలనీ, వారికి సమాన హక్కులు ఇవ్వాలనీ నీవు కూడ సభలలో చెప్పుతావు కదా నాన్నా! అటు వంటప్పుడు వాళ్లకు పురుషులతో సమానంగా కూలి ఇస్తే తప్పే ముంది? అయినా వాళ్ల పదిహేను రోజుల పని తొమ్మిది రోజుల్లోనే పూర్తి చేశారు గదా! నాన్నా' ? అన్నది లక్ష్మి

'ఇదంతా నీకు ఆ ప్రకాశంగాడు నూరి పోసి నట్లున్నాడు! వాళ్ళు విశ్వాసం లేని మనుషులమ్మా! క్రిందటిఎలక్షన్లలో చూడు! ఒక్క వెధవ మనకు ఓటు వేశాడేమో! అందరూ ఆ రమేశ్‌కే వేసారు!


'పోనీ నాన్నా! వాళ్లకు తోచిన వాళ్లకు వేసారు! అయినా మనం బియ్యం కొలిచింది ఓట్ల కోసం కాదుగా! కూలీలు పని చేశారు! కాబట్టి తిండి పెట్టాం! నిజానికి మనము ఇచ్చిన రెండు రూపాయలూ వాళ్ళ శ్రమ పడిన దాంట్లో ఏ పాటి? శ్రమకు రూపాయలతో సరిగా విలువ కట్టలేం నాన్నా?'

'కడుపు నిండితే వాళ్లకు కళ్లు నెత్తికి ఎక్కుతాయి తల్లీ! నీకు లోకం సంగతి తెలియదు! ఒకసారి ఎక్కువ కూలి ఇస్తే ఇక మీదట అదే రేటు పడిపోతుంది!'

'పోనీలే నాన్నా! ఇంకెప్పుడూ అలా చేయను లే! సరేనా! అన్నానికి పద!' అప్పలమ్మ ఎదురు చూస్తున్నది! అంటూ లక్ష్మితండ్రి చేయి పట్టుకొని డైనింగు టేబిల్ వైపుకి నడిపించింది.

(సశేషం)

వ్యవసాయ రంగంలో స్త్రీ పురుషులకు సమాన వేతనాలు



కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లా


ముఖ్యమంత్రి తుఫాను ప్రాంతాల పర్యటన







శాసన సభ్యురాలు శ్రీమతి కె. ప్రభావతమ్మ తుఫాను దెబ్బతిన్న రాజంపేట-కొండూరు రోడ్డు పరిశీలించారు











తెనుగుజాతిని

మయమ్మార

తుఫాను నష్ట











ఖాద్దిలో

ంచెత్తిన

దృశ్యాలు









పశ్చిమ గోదావరి,గుంటూరు జిల్లాల్లో......

తాడేపల్లిగూడెం తాలుకా పడమర విప్పర్రు గ్రామంలో లఘు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పై నారాయణస్వామి, శాసన సభ్యులు శ్రీ ఈలి ఆంజనేయులు పాడైపోయిన పైరును చూస్తున్న దృశ్యం





తెనాలి తాలూకా జాగర్లమూడిలో అరటి తోట
బాపట్ల రేపల్లె తాలూకాల్లో వరి పైరు నష్టా



సమతా సూత్రాలు

...శ్రీ టి. వి. భద్రిరాజు

సమిష్టి

అయ్యల్లారా ! అమ్మల్లారా,
ఆలకించుడీ పరమ రహస్యం ॥
ఆశలన్ని కడతేరువేళ
అరచేతను వైకుంఠము వచ్చె ॥అ॥

సృష్ట్యాదిని కుల దృష్టి యున్నదా?
సృష్టి మొదట భూస్వాములు కలరా?
మధ్య కాలమున మానవుడే యీ
శృంఖలాల సృజియించెను కాదా ? ॥అ॥

ఆదిని మానవులందరు సమమే
అందరివీ యీ భూమిసస్యములు
సమిష్టిగానే అరక దున్నికొని
సంతసమందగ అనుభవించరా ! ॥అ॥

తన సంతతి భేదాల వాదముల
భరతమాత కన్నీరు కార్చరా !
అదనపు భూముల పంపిణిలోన
బీదరిక్రమ్మును బూది చేయరా ॥అ॥

న్యాయం

ఇదేనా మన న్యాయం,
ఇదేనా మన ధర్మం ॥ఇ॥
మనిషికి మనిషీ బానిసకాగా
మనుట నీతియేనా ॥ఇ॥

తరతరాలుగా బంధించిన మన
దాస్య శృంఖలాల త్రెంచీ
మానవత్వము దిగజార్చి
మసలుట తగునా, మన గౌరవమా ॥ఇ॥

కాదు కాదు ఇది కర్తవ్యం
కాని అప్పులకు లోను చేయుచూ
జీవితమంతా వృధా చేయుచూ,
చీకటి బ్రతుకుల గడపించుటలో ॥ఇ॥

వింశతి సూత్ర ప్రణాళికవరమై
అవతరించినది ఆశల నింపి,
అమలుపరచి ఓ భారతీయుడా,
ఆనందము అందరికీ పంచుము॥ ॥ఇ॥

శుభకాలం

కాలం మారిందన్నా — శుభ
కాలం వచ్చిందన్నా

మానవత్వమే మంట కలుపుతూ
మనిషికి మనిషే బానిసకాగా.
వెట్టిచాకిరీ వెనుకకు నెట్టి
గట్టి పట్టుతో ముందుగు సాగగ ॥కా॥
ఏనాడో చేశారెవరో
చిన్నతప్పు తరతరాలకు ముప్పు
ఎవరోచేసిన దానికింకెవరో
కష్టపడేకాలం నశించెను ॥కా॥
భూమందుల దురాశలను
కాలదన్ని నడుముకట్టి
మానవసమతా సూత్రము
మన బాటగ నడువవలయు ॥కా॥

రాజ్యాంగ చట్టంలో విస్తృతమైన మార్పులు

—శ్రీ కామరాజుగడ్డ రామచంద్రరావు

రాజ్యాంగ చట్టంలో సవరణలు చేస్తున్నారనంగానే యేదో కొంప మునిగిపోతుందని అనుకొనే వాళ్లున్నారు ఎంతోమంది. మౌలిక హక్కులకు సంబంధించి రాజ్యాంగాన్ని మార్చటానికి పార్లమెంటుకు అధికారం ఉందా లేదా అని సుప్రీంకోర్టులో వివాదం జరిగిన తర్వాత ఈ భయం అమితంగా వ్యాపింప జేశారు కొందరు. ఒకసారి చీఫ్ జస్టిస్ కోకా సుబ్బారావుగారు అలాంటి మార్పులు చేయరాదన్నారు. 'రే' ప్రభృతులు చేయవచ్చన్నారు. ఆ తరువాత మళ్లీ కొన్ని మార్పులు మాత్రం చేయవచ్చన్నారు.

ఇప్పటికి ఈ సవరణలు ప్రతిపాదించటానికి సవరణ_విధిని చేయటానికీ వీలయింది. ఇంతకూ ఇప్పుడు ఏర్పాటుచేసిన సవరణల స్వభావం ఏమిటనేది మనగమ్యం.

మొట్టమొదటి మార్పు ప్రస్తావనలో 'ప్రజాస్వామిక' అని ఉండేచోట 'సామ్యవాదైక లౌకిక ప్రజాస్వామిక' అని మార్చటం. 1950 నుండి ఎప్పుడూ ప్రజలకే స్వామికత్వం ఉంది ఇప్పుడు ఆ స్వామికత్వానికి కొంత విశేషణ పూర్వపదం చేర్చారు. ప్రజల్లో సమానత్వం, లౌకిక విషయాల్లో ఇష్టా ప్రజాస్వామ్యం ఉండాలనే విషయం స్పష్టం చేశారు.

ఐతే ఇంతకు ముందు ఆ సమానత్వం లేదా అనచ్చు. 14 వ అనుచ్ఛేదంలో సమానంగా అందరికి ఏ 'విధి' గాని వర్తించాలనేది మౌలిక సూత్రంగా ఉండనే ఉందిగదా! అనవచ్చు.

నిజమే. ఉన్నది. అది ఇప్పుడూ ఉంటుంది. మరింకా తేడా యేమిటి ?

మౌలిక సూత్రాలు సంవిధానంలో అది ప్రారంభించిన రోజుల్లోనే ఇరికించాము. అవన్నీ ఒకానొక వ్యక్తికి లేదా పౌరుడికి అధికారపూర్వకంగా సంక్రమింపజేసిన హక్కులు. ప్రజాసామ్యానికి ఉమ్మడిగా ఇచ్చినవి కాదు. వ్యక్తులు వేరు_సమాజము వేరు. వ్యక్తికి ఎలా వ్యక్తిత్వం ఉందో సమాజానికి కూడ అలాగే ఒక ప్రతిపత్తి ఉంది. ఒకటి పర్సనాలిటీ అనీ ఇంకొకటి నేషనాలిటీ అని అంటాము. ఇప్పుడు వ్యక్తికిచ్చిన హక్కులకు ఒక సవరణగా ఈ జాతి విషయమైన హక్కు కూర్చబడింది అనచ్చు.

బ్రిటీషువారు పరిపాలించే వాళ్లు మన్ని_1947 కు పూర్వం. వాళ్లకు వ్యక్తిగత హక్కులు చాలప విత్రమైనవే. ఇంగ్లండులో వాటిని ఎంతో పవిత్రంగా పోషించి పాటించే వాళ్లు వాళ్లు. కాని ఐ.సి. యస్.పట్టాలు పొంది ఇక్కడకుపరిపాలనం కోసం వచ్చిన దగ్గర్నుంచి వారు వ్యక్తిగత హక్కులు పరిపాలించటం మాని దేశం కోసం అంటే "బ్రిటీషు పరిపాలన" కోసం శ్రమ చేసేవాళ్ళు. ఈ తేడా ఇదమిత్థంగా కనిపించేది. వీళ్లు ఇంగ్లీషువారి వ్యక్తిత్వానికిచ్చే గౌరవం భారతీయుడి వ్యక్తిత్వానికివ్వరేమో అని విస్తుపోయే వాళ్ళం. వాళ్లతో పాటు వాళ్ల పరిపాలనలో పాల్గొనే దేశీయులు కూడ అలాగే నడుచుకోసాగారు. దాంతో 1947 లో "వాళ్లు వెళ్లిపోతారు దేశాన్ని వదలి" అని తెలియంగానే ప్రజల్లో చిన్న అలజడి కలిగింది. ఈ పరిపాలనా వ్యవస్థలోకి వెళ్లేవాళ్లు–దేశం_దేశం_అనే పేరుపెట్టుకొని వ్యక్తిత్వ హక్కుల్ని చిన్నచూపు చూస్తారేమోనని కించకలిగింది. అందుకని దేశం స్వతంత్రం పొందుతోంది గనక, వ్యక్తుల హక్కులు సర్వత్రా రక్షింపబడాలన్నారు. అవి మన రాజ్యాంగ చట్టంలోనే పేర్కొనాలె వన్నారు. అవి మౌలికమైన వన్నారు. రాజ్యాంగంలో చేర్చకతప్పలేదు.

ఇప్పటికి పాతికేండ్లకు పైగా దాటింది భారత సంవిధానం అమలులోకి వచ్చి. మౌలిక హక్కులనే-ఈ వ్యక్తిగత హక్కులు ఎన్నో మంచి పనులకు అడ్డం వస్తుండటం అవగతమయింది. జమీందారుల ఎస్టేట్లు రద్దు చేద్దామన్నప్పుడు, ఈనాముల రద్దు సమయంలో, బ్యాంకులు జాతీయం చేసేటప్పుడు ఎప్పటికప్పుడే రాజ్యాంగంలోని వ్యక్తిగత హక్కుల నిబంధనలు అడ్డంకులు తెచ్చిపెట్టుతూనే వచ్చినయి. సమాజంలో జనసామాన్యాన్ని కాపాడ్డానికి తలపెట్టిన ఈ పనులన్నింటికీ ఏదోరకంగా కోర్టుల ద్వారా చిక్కులు తెచ్చి పెట్టటానికి ఈ మౌలిక సూత్రాలు ఎంతో సాకుగా అవకాశమిచ్చినయి. వ్యక్తుల మౌలిక హక్కులను రక్షించాల్సిన బాధ్యత సంవిధానంలో ప్రత్యేకంగా చెప్పారు గనక అదే గొప్పదనీ సామాజికమైన ఉమ్మడి ప్రయోజనాలను పరివృష్టం చేయాల్సిన అవుసరం అలా చెప్పలేదుగదా అని కోర్టులు శంకించినయి.

అందుకని ఆవివాదాన్ని మొదలంట తొలగించటం కోసం_ ప్రస్తావనలో ఈ సవరణలను ప్రవేశపెట్టారు. ప్రజాస్వామికం అంటే ప్రజల స్వామిత్వ హక్కు అని ధ్వని. వారి రాజ్యమని అర్థం. ఏదైనా వారి కొఱకేనని ఊహ. కాగా ఈ స్వామిత్వం సమాజానికిగల ప్రతిపత్తికి లోబడి ఉండాలి అనేది ఇప్పటి సామ్యవాద సూత్రం చెప్పేవిషయం. సమాజము యొక్క హక్కులకూ ఒకానొక వ్యక్తియొక్క హక్కులకూ వ్యతిరేకత వచ్చినపుడు సమాజపు హక్కులే చెల్లవలెగాని వ్యక్తిగత హక్కులు కాదనేది స్పష్టమయింది.

ఈ ప్రస్తావనలో చేసిన మరొక సవరణ ఏమిటంటే "దేశ ఐక్యతకు" అనే మాటకు బదులు దేశ ఐక్యత, అఖండతలకు అని ఉంచటం. దీనితో దేశంలో యే భాగం గాని రాజ్యంగాని

ఈ దేశం నుంచి "మేము విడిపోతాము" అనే అవకాశాన్ని తొలగించటమయింది. 1947 లో అప్పటి ఇండియా రెండు చీలికలై ఆవిర్భవించటం అది మళ్లీ మూడు చీలికలు కావటం చాలు—అని దీని అంతర్యం.

మౌలిక సూత్రాల్లో, ఆదేశిక సూత్రాల్లో మార్పు

అనుచ్ఛేదం 31—సీ లో ఒక మౌలిక సూత్రం ఉండేది. 39 'ఏ' 'బి' లలో చెప్పిన ఆదేశిక సూత్రాల పరిపూర్తి కోసం చేసిన శాసనాలు వేటిని గాని "మౌలిక సూత్రాలకు భంగం కలిగిస్తున్నాయి" అనే కారణం చెప్పి రద్దు చేయటానికి వీలులేదని అందులో ఉంది. ఇప్పుడు 31—సీ ని సవరించారు. దాని ప్రకారం ఆదేశిక సూత్రాల్లోని యే నిబంధనలోని ఉన్న యే విషయం కోసం చేసిన యే శాసనమైనా సరే—మౌలిక సూత్రాలకు వ్యతిరేకమయింది అనే కారణాన రద్దు చేయటానికి వీల్లేదని యేర్పాటు చేశారు. చిత్రమేమిటంటే ఇది 31—సీ మౌలిక సూత్రాల్లో భాగంగానే ఉన్న అనుచ్ఛేదం మౌలిక సూత్రాలకు వ్యతిరేకంగా చేసిన శాసనమయినా ఆదేశిక సూత్రాలకు అనుగుణంగా ఉండటం అనేది మౌలిక స్వత్వం క్రిందే లెక్కన్న మాట.

ఇంకా 31—డీ అనే అనుచ్ఛేదం ఒకటి చేర్చారు. దాని ప్రకారం దేశ ద్రోహులను వారి ఉద్యమం నుంచి నిషేధించేందుకు వారి ఆటలు కట్టించటానికి పార్లమెంటు ఎలాంటి శాసనాన్ని చేసినా 13 వ అనుచ్ఛేదం క్రింద అది చెల్లదని అనటానికి వీలులేదన్నారు. ఈ శాసనం పార్లమెంటేగాని రాజ్యవిధానమండలి ఏదిగాని చేయరాదన్నారు. పైగా ఈ "దేశద్రోహులూ" "వారి చర్యలు" అనే పదాలను నిర్వచిస్తూ ఇలా శాసించారు. దేశంలోని ఒకానొక భాగం ఇతరుల కెవరికో చెందాలి అనే వారు, దేశం అఖండతకు వ్యతిరేకులు, విధి ప్రకారం నడుస్తున్న ప్రభుత్వాన్ని తొలగించాలనే వాళ్లూ, ప్రభుత్వోద్యోగుల్లో గాని ఇతర దేశీయుల్లోగాని కలతలను చివరకు కులద్వేషాలు పెంచేవాళ్లు, కలిగించే వాళ్లూ కూడ దేశద్రోహులే అవుతారు—అన్నారు.

అస్పృశ్యతా నివారణ చట్టాన్ని మొన్నమొన్న సవరించి, అస్పృశ్యతను ప్రతిపాదించిన వానినల్లా నేరస్థుడుగా చేయటం అనేది, 17 వ అనుచ్ఛేదంలోని ఆదేశిక సూత్రమునూ ఈ 31—సీ, 31—డీ అనుచ్ఛేదాలనూ భూమికగా చూసుకొని మరీ అవతరించిందనచ్చు. అలా ప్రతిపాదించి ప్రవర్తించేవాడిని ఆ శాసనం ప్రకారం పోలీసులు వారంటు లేకుండానే అరెస్టు చేయవచ్చు కూడ.

ఆదేశిక సూత్రాల్లో—పిల్లలకు తగిన అవకాశాలు, సౌకర్యాలు యేర్పాటు చేయాలనీ స్వతంత్రమైన వాతావరణంలో జాతీయభిమాన పూర్ణులుగా వారు ఉండేటట్లు చూడాలి అనీ, బాలుర, యౌవనుల శారీరిక, మనో, బుద్ధిబలాలను దురుపయోగం గాకుండా చూడాలి అనీ అన్నారు. ఇంకా—కోర్టులలో బీదవాళ్లు కూడ న్యాయాన్ని అర్థించి పొందేటట్లు—వాద సహాయం చేయటానికి యేర్పాట్లు చేయాలన్నారు. కొందరు ప్లీడర్లను పెట్టి, వారు బీదవారి కేసులను తీసుకొని వాదించటానికి యేర్పాటు జరపాలన్న మాట. పరిశ్రమల్లోని పనివాండ్లు ఆ పరిశ్రమల పరిపాలనంలో పాల్గొనే అవకాశం కల్పించమన్నారు. వన్యమృగాలను అటవీ సంపదను పరిరక్షించాలన్నారు.

ప్రాథమిక కర్తవ్యాలు

మౌలిక హక్కులతో పాటు ఇప్పుడు మౌలిక కర్తవ్యాలు కూడ చేర్చుకొంటున్నాం. ఈ కర్తవ్యాలు నిజానికి మంచి పౌరుని హృదయంలో ఎల్లప్పుడూ ఉంటున్నవే-ప్రతి వ్యక్తి సంవిధానాన్నీ, జాతీయ పతాకాన్నీ, జాతీయగీతాన్ని. వీటి ఆశయాలను ఉద్దేశ్యాలను మన్నించాలి. భారత సార్వభౌమత్వం ఐక్యత దేశ అఖండతలను పరిరక్షించాలి. దేశరక్షణ కోసం ఎప్పుడు పిలిస్తే అప్పుడు వచ్చి జాతీయమైన సేవ చెయ్యాలి. సౌభ్రాత్రం సామరస్యం భారతీయుల్లో పదిలపరచి మత, భాషా ప్రాంతీయ విషయికమైన విచ్ఛేదాలను అధిగమించాలి. స్త్రీల గౌరవానికి న్యూనత కలిగించే అలవాట్లనుంచి సన్యసించాలి అన్నారు. భారతీయ సంస్కృతిని గుర్తించాలి, దేశ నైసర్గిక స్థితిని అడవులు, సరస్సులు, వన్య మృగాలు వీటిని పరిరక్షించాలి. జీవరాసులన్నిటిని దయాపూర్ణమైన దృష్టితో చూడాలి అన్నారు.

ఇంకా దేశ సంపత్తిని రక్షించాలి. హింస చేయకూడదు. శాస్త్ర పూర్వకమైన పురోగమనం ఉండాలి మానవత్వం ఉండాలి. విచారణ ఉండాలి. సంస్కారం ఉండాలి. ఈ మాటలు ఎంత లోతునకైన ఆలోచించవచ్చు. ఇవన్నీ ఇప్పుడు సంవిధానం క్రింద కర్తవ్యాలు. తన పురోభివృద్ధికే గాక జాతి పురోభివృద్ధికి పాటుపడాలి. అది తన దీక్షగా పెట్టుకోవాలి. విశ్వకవి అన్నట్లు,—

ఏడ దీక్షాస్రవంతి యే యోడులేక చేతులను జాచ సంపూర్ణ సీమలందు ఆడనే మమ్ము మేల్కొల్ప జూడుసామి—(గీతాంజలి.35)

అన్న విధమిది.

పార్లమెంటు, శాసనసభల విషయమైన మార్పులు

(1) సభ్యుల పదవీధారణ కాలం 5 ఏండ్ల నుంచి 6 ఏండ్ల వరకూ పెంచారు. ఇప్పుడున్న సభ్యులకు కూడ ఈ సవరణ వర్తిస్తుంది.

(2) సంవిధానములో సభలకు ఉండాల్సిన కోరం విషయం తీసివేసి, అది నిర్ణయించడం ఆ సభలకే వదిలివేశారు.

(3) ఇంతకుముందు సభ్యుడెవరైనా ప్రభుత్వంలో పదవిని వహించి ఉంటే అది అతడికి అనర్హత ఆపాదించేది. ఇప్పుడది తీసివేశారు. పార్లమెంటు యేదైన శాసనం చేసి ఫలాని పదవిలో ఉన్న వాళ్ళకే ఆ అనర్హత ఉంటుంది అనేదాక ఈ అనర్హత ఉండనే ఉండదు. కాగా రాష్ట్ర శాసన సభలు ఇలాంటి శాసనమేది చేయడానికి వీలు లేదు అనేది గమనీయం

(4) సభ్యుడికి అనర్హత ఉన్నదా, లేదా, అనే విషయం గాని అతడి ఎలెక్షను చెల్లుతుందా చెల్లదా అనే విషయం గాని

తీర్మానించటానికి రాష్ట్రపతి కొక్కడికే అధికారముంది. అతడు ఎలెక్షను కమీషన్‌ను సంప్రదించి తీరాలి. ఆ కమీషన్ ఒక విచారణ కూడ నడపవచ్చు. రాజ్యశాసన సభ్యుడి విషయంలో కూడ పార్లమెంటు శాసనమే గాని రాష్ట్రశాసన మేదీ చెల్లదు.

(5) సం॥ 2000 దాటిన తరవాత జనాభా లెక్కలు వేసి గెజెటులో ప్రచురణం చేసేవరకూ 1971 లోని లెక్కల ప్రకారం జనాభా ననుసరించే శాసన సభ్యుల సంఖ్యా, రిజర్వు స్థానాల సంఖ్యా క్రమబద్ధం అవుతూ ఉండాలి.

ఇవి సభల విషయమైన మార్పులు.

అత్యవసర పరిస్థితికి సంబంధించినవి

352 అనుచ్ఛేదం క్రింద అత్యవసర పరిస్థితిని భారతదేశానికి మొత్తంగా నే కల్పించవల్సిన అగత్యం లేకుండ చేశారు. ఒకే ఒక రాజ్యానికయినా అలాటి పరిస్థితిని డిక్లేరు చెయ్యవచ్చు ఆ ఉత్తరువు ఎప్పటికప్పుడు మార్చి దానిని అమలు చెయ్యొచ్చు ఒకానొక రాజ్యంలో అది అమలులో ఉందంటే కేంద్ర ప్రభుత్వం, పార్లమెంటు కూడ ఆ రాజ్యంలో చలాయించదగిన అధికారాలను అవసరమైతే ఇతర రాజ్యాల్లో కూడ అప్పుడే చలాయించవచ్చు పైగా అత్యయిక పరిస్థితికి గల ఆరు నెలల గడువు ఒక సంవత్సరం చేశారు ఇంకా యేమిటంటే పార్లమెంటు ఈ అత్యయిక కాలంలో చేసిన విధులు అలా నిలిచి ఆ తరువాత కూడ అమలు అవుతూనే ఉంటయి. మళ్లీ తగిన అధికారంతో అవి మార్చబడితే తప్ప

సంవిధానపు సవరణ విషయం

368 వ అనుచ్ఛేదం క్రింద ఈ సవరణ కోసం కొంత విధానం ఉంది. దాని ప్రకారం సవరణలు సంవిధానానికి చెయ్యొచ్చు. అది పాటింపకపోతేనే సవరణ చెల్లదని కోర్టులో దావాను ఎవరైన వెయ్యొచ్చుగాక. అంతేగాని ఆ సవరణ మౌలిక హక్కులకు వ్యతిరేకమని గాని ఇంకా ఇతరమైన ఇలాంటి కారణాలకు గాని రద్దు చేయాలి అనే అభియోగం కోర్టుల్లో తేవటానికి వీలులేదు.

శాసనాలు చేయటానికి అధికారాలు

సంవిధానపు ఏడవ అనుసూచిలో పార్లమెంటు శాసనాలు చేయదగిన విషయాలు I వ జాబితాలోనూ, రాజ్యాలు శాసనాలు చేయదగిన విషయాలు II వ జాబితాలోనూ రాజ్యసభలూ పార్లమెంటూ కూడ శాసనాలు చేయదగిన విషయాలు III వ జాబితాలోనూ ఉన్నాయి. ఇప్పుడీ జాబితాల్లో ఉన్న కొన్ని విషయాలను మార్పు చేశారు. హైకోర్టుకు సంబంధించిన విషయం, ఇంకా విద్య, అడవులు, వన్యమృగాలు, కొలతలు, ప్రమాణాలకు సంబంధించిన విషయాలు II వ జాబితాలోంచి తీసివేసి III వ జాబితాలో వేశారు. దానితో రాజ్య శాసన సభలతోపాటు పార్లమెంటుకు కూడ ఈ విషయాల్లో శాసనాలు చేయటానికి అవకాశం కలిగింది.

ప్రభుత్వోద్యోగుల శిక్ష విషయం

ప్రభుత్వోద్యోగిని బర్తరపు చేయాలన్నా తొలగించాలన్నా క్రింది పదవికి దింపాలన్నా క్రింది స్థితికి తేవాలన్నా అపరాధమేదో విచారణ చేసి నిశ్చయించుటయే గాక నీకా శిక్ష ఎందుకివ్వరాదో చెప్పవలసిందని ఒక నోటీసును ఇవ్వాల్సి వచ్చేది ఇంతవరకు

311 వ అనుచ్ఛేదాన్ని ఇప్పుడు సవరించి ఆ అవుసరం లేకుండా చేశారు. మొదటి విచారణలో గల సాక్ష్యాన్నే ఆధారం చేసి శిక్షించే అధికారి శిక్షను ఇయ్యవచ్చు. వేరే ప్రత్యేక నోటీసు అక్కరలేదు


కోర్టుల అధికారాల్లో మార్పులు

ఈ అధికారాల్లో తీవ్రమైన మార్పులు చేయటమైంది సుప్రీంకోర్టు వారికి యథాతథంగా 32 వ అనుచ్ఛేదం క్రింద దరఖాస్తు తీసుకొని ఏ రాజ్య శాసనమండలి యొక్క శాసనాన్ని గాని విచారణ జరిపి రద్దు చేసే అధికారం ఉండదన్నారు. అంటే హైకోర్టు తీర్పు మీద అప్పీలు వస్తే తప్ప వారు రాజ్య శాసనాన్ని రద్దు చేసే వీలులేదు అలాగే హైకోర్టుకు కేంద్ర శాసనాన్ని దేనిని గాని రద్దు చేసే అధికారం ఉండదు. రాజ్య శాసనాన్ని మాత్రం విచారించి దాని మాన్యత–అమాన్యతలను గూర్చి తీర్పు నియ్యొచ్చు రద్దు చేయ్యొచ్చు కూడ. రిట్టులు ఇవ్వచ్చు. అంటే మౌలిక హక్కులు దెబ్బతింటే రిట్టు నివ్వచ్చు ఇంకా సంవిధానానికి వ్యతిరేకంగా జారీ అయిన ఏ నిబంధన ఉత్తరువు, నియమం వల్లగాని తీరని నష్టం జరుగుతుంటే రిట్టు నివ్వొచ్చు శాసనానికి వ్యతిరేకమైన పని జరిగినప్పుడు కూడ అలాగే యివ్వొచ్చు.

కాని 'స్టే' యివ్వకూడదు, ప్రతివాదిని వింటేనే గాని నిలుపుదల ఉత్తరువు నివ్వరాదు అన్నారు. అథవా ఎంతో ప్రమాదభరితమైన కేసు అయినట్లయితే అందుకు కారణాలు లిఖితంగా చెప్పి అప్పుడు 'నిలుపుదల' ఉత్తరువు ఇవ్వవచ్చు అదైనా పధునాలుగురోజుల పాటు మాత్రం అమలులో ఉంటుంది ఈలోగా ప్రతివాది వచ్చి చెప్పుకొన్న తరువాత తిరిగి ఆ ఉత్తరువును జారీచేయకపోతే అది నిలవదు. ఏది ఏమైనా అలాంటి నిలుపుదల ఉత్తర్వులు–విచారణను దేనినైన నిలుపుదల చేయడానికిగాని, ప్రభుత్వపని నిర్వహించే విషయంలోగాను ప్రజోపయోగమైన ప్రాజక్టు విషయంలోగాని అలాంటి పనులకు ప్రభుత్వం భూమిని ఆర్జించే విషయంలో గాని ప్రభుత్వం క్రింద ఏదైనా కార్పొరేషన్ పనులను నడిపించే విషయంలోంగాని – జారీచేయడానికి వీలులేదు.

ఇంకో నిర్బంధముంది ఏదైన విధిని రద్దుచేస్తూ తీర్పు నివ్వడానికి సుప్రీంకోర్టులో అయితే ఏడ్గురున్నూ హైకోర్టులో అయితే ఐదుగురున్నూ జడ్జీలు కూర్చుని విచారించాలి. అందులో కనీసం మూడింట ఇద్దరు చొప్పున లెక్కవేసి అంతమంది రద్దుకు ఒప్పుకొంటేనే అలాటి తీర్పు నివ్వాలి. లేకపోతే రద్దు చేయటానికి వీలులేదు

(తరువాయి 54వ పేజీలో)


ఒక ఇంటివాడ
నయ్యానంటున్నావ్..!
పెళ్ళయిందా ఏవిటోయ్?
అబ్బే లేదండీ
ప్రభుత్వం
యింటి
స్థలంయిస్తే
పాకేసు
కున్నా..
నువ్వందిస్తున్నది వందరూ
పాయల నోటా..?!.. లేక
మరే దన్నానా..?
20 సూత్రాలు
పదేండ్లు వెట్టి చాకిరి చేసే
వాడికి యింకోయాభై యివ్వండంటే
నా మాట విన్లేదు! వాడు మానేశాక
యిప్పుడు నీకు తెల్సివస్తోంది కష్టం! ఇం
కెవ్వడూ ఈ చాకిరీకి రాడట
పత్రిక
C.I.D.
ఈ స్మగ్లింగ్ గూడ్సు
యిక్కడ దాస్తే
పట్టుకోవడం
ఎవ్వరి చేత కాదు
ఏవంటావ్...
తులసీరాం

కవులకు దారిద్ర్య బాధ తప్పదా?

—శ్రీ వాజపేయయాజుల రామసుబ్బారాయుడు

ప్రపంచమున మానవుఁడే కార్యము తలపెట్టినను నిర్విఘ్నముగ ముగింపఁజాలఁడు. కార్యసిద్ధికొఱకుఁ దగినంత మిత్రబలమైనను నర్థబలమైనను వాక్సహాయమైనను నుండవలెను. ఈ కాలమునఁ గవుల కిట్టి లాభము కొఱవడినది. పూర్వకవులట్లుగాక తగినంత ప్రోత్సాహమును ప్రోత్సాహమునకుఁ దోడు తగినంత ధన సాహాయ్యమును గలుగుటయేకాక వారక్కాలపు రాజరాన్యములచే దైవసమానులని పూజింపఁబడిరి. ధనమూలమిదం జగత్తని గదా రాజాస్థానమునందున్నవారికి ధనము "అంకసితార్థపేటి" కదా. ఈ నాఁటి కవులు వరప్రసాదలబ్ధులయ్యు నంతరాయములెన్నియో కలుగుచు దారిద్ర్యబాధలచే నలిగిపోవుచు నెట్టికృతులయందును సంకల్పసిద్ధులు గాకుండిరి.

ఈ నాఁడు విద్యాగంధమెఱింగిన రాజరాజనరేంద్రుండును కవిరాజగు శ్రీకృష్ణదేవరాయలును గవితారసజ్ఞుఁడగు భోజరాజును నుదయించినచోఁ గవితా కంఠాశీకమూల్యాభరణంబులను గట్టిపెట్టి కవితా కన్యా ప్రదాతలను బంగరుపల్లికి నెక్కించి యూరేగించి వారికి బ్రహ్మరథము పట్టకపోదురా? కవులు రాజులనాశ్రయించుట, రాజులు కవిరాజులను బోషించుట విద్యుక్త ధర్మమై యున్నది. రాజకవి బాంధవ్యము తరతరముల నుండి వచ్చుచున్నది.

ధన రాజులు విద్యాధినరాజులకన్న మిన్నయని భావించుట గర్వసూచకము. "విద్వన్నాధికుల పట్టున గర్వము మాన టొప్పగున్" యను భర్తృహరి వాక్యము సార్థకము చేయఁదలఁచి శ్రీకృష్ణదేవరాయలు పెద్దనార్యు నెట్లు గౌరవించెనో లోకవిదితమే కదా! విద్యాధనము నార్జించుట సులభముకాదు. బహుజన్మ కృతసుకృత తపఃఫలము చేతనుగాని విద్య లభించదు.

"విద్యలలోపల నుత్తమ విద్య కవిత్వము"

రవి కానని చోటులను గవికానఁగలఁడు.

సత్కవిరాజులనేకమూలలనుండి దాపరించుచున్నదోగాని వారి కవితాధారా ప్రవాహమున కడ్డుపడి దుర్భర దుస్సహదారిద్ర్యము వారి సద్గ్రంథములను సూర్యరశ్మి గానకుండ నణచివేయుచున్నది.

ఐహికాముష్మిక సుఖంబులిచ్చు శ్రీ మద్భాగవతము రచించిన పోతనార్యుని దారిద్ర్య దుఃఖము తలఁచుకొన్న నే మానవుని హృదయము నీఱుకాకుండును?

"రాజరాజేంద్ర సామ్రాజ్యభోగములందు
నన్నయభట్టు పాల్గొన్నవాఁడు
మనుమసిద్ధిక్షమా చక్రమరుదార
తిక్కన్న తన చేతఁ ద్రిప్పినాఁడు
వీరభద్రా రెడ్డి విరివియౌ విభవంబు
శ్రీనాథుఁడెంతొ భుజించినాఁడు
రాయలయొద్ద గౌరవమొందె పెద్దన్న
నెక్కు యందలము నూరేగినాఁడు
వెరగుపడనేల? వారి కవిత్వమునకు
బ్రదుకుపైయాస గూడను బాడుపేయు
ఘోర దారిద్ర్య దుఃఖంబుఁ గుడుచువకట!
యే గతిని బల్కెఁ బోతన్న భాగవతము?"

శ్రీ వ. సు. రాయకవి వాక్కు గుర్తుకు రాకపోదు.

సప్తసంతానములలో ఖిలముగానిది యాచంద్రార్కము శోభిల్లునదొక్క కృతియని రారాజులు కవుల నాశ్రయించి కృతులు రచింపంజేసి తన్మూలమున ధన్యులగుచుండిరి. ఇది యథార్థము. ఆ గర్భ శ్రీమంతుఁడైన కృష్ణరాయలేడ? పెద్దన్నయేడ? సమాన ప్రతిభనుగాంచుటేడ?

సప్త సంతానములలోఁ బ్రశస్తిగాంచి
ఖిలము గాకుండునది ధాత్రిఁ గృతియకాన
కృతి రచింపుము మాకు శిరీషకుసుమ
పేశల సుధామయోక్తులఁ బెద్దనార్య! (మనుచరిత్ర)

జనసుత కృష్ణద్వైపా
యన ముని వృషభాభిహిత మహాభారత బ
ద్ధ నిరూపితార్థ మేర్పడఁ
దెనుఁగున రచియింపు మధికధీయుక్తి మెయిన్ (భారతము)

ఇవ్విధంబున రాజులు కవిరాజుల సత్కరించుచుండిరి. ఆ నాటి రాజ కవిరాజ బాంధవ్యము వేఱు

కవులకున్న భారము విస్తరించి తద్వారమెఱుంగఁగాఁ గల నృపుఁడొక్కఁడున్న చాలునని శ్రీ తిరుపతి కవిచంద్రములు రచించియే యుండిరి.

కవితామాధురిఁ దాఁగ్రహించి "యిది శ్లాఘ్యంబిద్ది శ్లాఘ్యంబుగా
దు. విశేషంబిట నిర్విశేషమిట మాధుర్యం బిటన్ వహ్వారే!
కవిరాజా!" యని మెచ్చి యిచ్చునృపుఁడొక్కండైనఁ గర్వైనచోఁ
గవియై పుట్టుటకన్నఁ బాపపరిపాకంబుండునే ? భూవరా !

మొత్తము మీఁద లక్ష్మీసరస్వతీ వైరము కవిరాజుల యందెక్కుడుగఁ గన్పట్టుచున్నది. ఆ నాఁటి కవులందఱును దరించినవారుకారు.

శ్రీనాథుఁడు సంస్కృతాంధ్ర కవితా సామ్రాజ్య సింహాసనారూఢుండయ్యు నాంధ్ర కవితా ప్రపంచమును జగజ్జేయమానంబుగఁ బరిపాలించి యాంధ్ర కవితామతల్లిని ఆసేతుహిమాచల పర్యంతము బంగరుతూఁగుటుయ్యాలలో నూరేగించియు రాజాధిరాజులచే సన్మానంబులను బొందియు నవసాన దశయందు ఘోర దారిద్ర్యమనుభవించినాడు.

కవిరాజ కంఠంబుఁ గౌగిలించెనుగదా
పురవీధి నెదురెండ పొగడదండ
సార్వభౌముని భుజాస్తంభ మెక్కెను గదా
నగరివాకిట నుండు నల్ల గుండు......

ఆంధ్ర కవులటుండ సంస్కృత కవిరాజులు పడినపాట్లు వారికే యెఱుక గాని యిట్టివని వర్ణింపఁజాలము.

శ్లో॥ జాతే జగతి వాల్మీకౌ కవిరిత్యభిధా భవత్
కవీ ఇతి తతో వ్యాసేకవయ స్త్వయిదండిన.

అను లోకోత్తర ప్రశంసకుఁబాత్రుడగు దండిమహాకవికిని దాపురమయ్యె. దారిద్ర్య దేవత తుదకు మాఘ కవి ప్రాణములను గూడ నపహరించె

పెర్షియన్ ఉర్దు మహాకవులును నిట్టి బాధలకు లోబడినవారే

"సాది" యను మహాకవికృత గ్రంథములు మహాభారత గ్రంథమువలె పంచమ వేదమనబడుచు విరాజిల్లుచున్నవి. శ్రీమద్రామాయణ మహాకావ్యము వలె నీతులచే నలరారుచు శ్రీమద్భాగవతంబుకైనది భగవానుని లీలా విశేషంబులచే నొప్పిదమైయున్నవి. కాని "సాది" మహాకవి యంతటి సమర్థుండయ్యు ఘోర దారిద్ర్య మనుభవించె.

అతీష్, హలీం యను ప్రసిద్ధ చరిత్రకారుల జీవితములును జిరస్మరణీయంబులే. నవలలు వ్రాయుటలో "ఉర్దు" భాషయందు వీరికన్న మిన్నలు లేరు. "హలీం" మహాకవియయ్యు మరణాంతర కర్మల నాచరించుటకైనను దగిన ద్రవ్యము లేనివాఁడై మరణించెను. "రతన్ నాద్" యను కవి శేఖరుండు "ఫసానె అజాద్" యను నవలా రాజంబుచే లోకమునఁ బూజింపబడుచున్నవాఁడు. ఇందలి కథా భాగము చిన్నదైనను తన భాషా జ్ఞానము పెద్దది కనుక యా కథకు వన్నెలు చిన్నెలు గల్పించి వర్ణనంబులు జిలికించి యొక్క మహా ప్రబంధమువలె రచించెను. అవి నాలుగు భాగములు. ఒకొక్క భాగములో 1000 పేజీలు కలవు. ఏ భాష యందు నవలలో నింతపెద్ద గ్రంథములేదు. ఇది 1908 సంవత్సరమున ముద్రింపఁబడినది.

ఇది ఇక్కాలపు నవనాగరికత, దేశ కాలపరిస్థితులు, కథానాయకుఁడగు 'అజాత' మహా పురుషుని ధీరోదార సంపత్తియు, సత్య వాక్పటిమయుఁ జక్కఁగ వర్ణింపఁబడిన ముద్దుమూటగట్టు నవలారత్నము. ఇట్టి మహనీయుండును దారిద్ర్య దుఃఖంబు గుడువ వలసివచ్చినది. కవులు శబ్దధ్యాన పరాయణులై ధన్యులగుచున్నారు. భగవత్ప్రియులగుచున్నారు. ఇక్కట్టులయందే భగవంతుఁడు జ్ఞప్తికి వచ్చుచుండును. భగవధ్యానముచే నానందమును నెట్టుటకు కవులకే సాధ్యమగుచున్నది. కాన మోక్షసిద్ధినిఁగాంచుటకుఁగవులకు సులభమగుచున్నది. ఈ దారిద్ర్యము భౌతిక శరీర సంబంధమైనది కాని మోక్షపథమునకు భంగము వాటిల్లునది కారుగదా.

ఆంగ్ల కవులు గూడ ఘోర దారిద్ర్య దుఃఖము ననుభవింతురని యీ దిగువ నుదహరింపఁబడిన యాంగ్ల మహా కవి వాక్యములు తెలుపుచున్నవి.

Full many a gem of purest ray serene
The Dark un fathomed caves of the ocean bear
Full many a flower is born to blush unseen
And wast its fragrance in the desert air

—GREY

Poverty quenched their lofty aspirations, labour and want numbled the soul naturally sensitive and cooled the blood once ran hot in slow rises worth their veins, by poverty depressed.

—JOHNSON

There kept many charms cancealed from mortal eye
Like roses that in deserts bloom and die.

—POPE

Poverty freezes the very life stream of genius. Oliver Goldsmith, the great novelist travelled once Europe in precarious living with the flute or by begging. He was ever in debt and in distress. The life of Macanley, the great essayist was reduced to such straits that he had to sell his Cambridge gold medal.

ఏ నాఁటికైనను దారిద్ర్యమే కవిత్వమును జయింపగలదు. కవి యగు వాఁడింత మాత్రమున జంకక ధైర్యమును జిక్కబట్టి

'కవితా యద్యస్తి రాజ్యేనకిమ్మను నానుడి సార్థకముఁజేసి దారిద్ర్యము వేచిన కొలఁది పది పద్యములు పది వాక్యములు కాన్కఁగ సమర్పించి పరమేశ్వర ధ్యాన పరాయణుఁడై కాలము గెంట వలయును. ఇదియే మోక్ష సాధనము—జీవిత తరణోపాయము.

శ్రీమంతంబగు యీ భరత ఖండ మందనేక మహా కవులు వెలసినారు—వారి వారి ప్రజ్ఞా విశేషములచే సద్గ్రంథములు రచించి నిర్మల కీర్తి చంద్రికలు శాశ్వతముగ వ్యాపింప జేసిరి అందు నాంధ్ర భాష మేరలు తప్పక కటు బాటు కలిగి వెల్వొందుచున్నది.

ఏ సభ యందైనను నగ్రతాంబూలము గ్రహించుటకు కవియే పాత్రుఁడు. నైసర్గిక మహత్వతత్త్వ పటుత్వ దివ్య రహస్య స్వరూపంబుల నెఱింగి సుధారస ధారల వింపు సత్కృతుల చేఁప్రపంచమున నిరంకుశాధిపత్యమును వహించి సంచరించుచున్నవారు. స్వేచ్ఛ యన్న వారిదే.

శ్లో॥ అమ్భోజినీ వన విహార విలాస మేవ
హంస స్యహన్తు నితరాం కుపితో విధాతా
సత్వస్యదుగ్ధ జలభేద విధౌ ప్రసిద్ధాం
వైదగ్ధ్య కీర్తి మపహర్తుమసౌ సమర్థః.

కవిత నిరంకుశ ప్రతిభచే భేదింపుకొని ప్రపంచము నంతటను సంచరింపగలదు.

కవితా ప్రసక్తి జ్ఞానంబునకును, సత్యంబునకును ఆనంద మునకును మూలము—ఆంగ్లేయ మహాకవులు గూడ—కవి యను వాని కగ్రస్థాన మిచ్చిరి.

కవులు సరస్వతీ కంఠాభరణులు—సరస్వతీ సేవారాధనము కొఱకే కవులుదయింతురని నా భావము. వారల సత్కృతులు కాలము గుర్తింపక పోదు. *

ఈ సంచికలో రచయితలు

శ్రీయుతులు

రావుల సూర్య నారాయణమూర్తి, సమాచార, పౌరసంబంధ శాఖ, హైదరాబాద్,

"కూరెళ్ళ", వెలంకి,(వయా)వెలిగొండ, నల్లగొండజిల్లా.

మహమ్మద్ ఖమ్రొద్దీన్, కమలాపురం, (వయా)గార్ల, ఖమ్మం 507 210

వి. సువర్చలా రాణి, C/O శ్రీ వి. యజ్ఞరామయ్య, బ్రాహ్మణ వీధి, వనపర్తి,మహబూబ్‌నగర్ జిల్లా.

కందాళం కుప్పస్వామి, ప్రభుత్వ పుస్తక ముద్రణాలయం, మింట్‌కాంపౌండు హైదరాబాదు

శ్రీమతి వేదవతీదేవి, గోకుల్, 44, ఎల్. ఐ. సి. కాలనీ, మెహదీపట్నం హైదరాబాద్.

ఎన్. జనార్దన్ రెడ్డి, 10, తీన్ మూర్తి లేన్, న్యూఢిల్లీ

బి. కృష్ణారావు, కరెస్పాండెంట్, ఆంధ్రప్రభ, గిద్దలూరు, ప్రకాశం జిల్లా.

పోతు కూచి సాంబశివరావు, 208, న్యూ బోయిగూడా, సికిందరాబాద్—3

ఉన్నవ మదన మోహన్‌రావు, 6-3-354/2, హిందీనగర్ కాలనీ,బంజారాహిల్స్,హైదరాబాద్.

కామరాజుగడ్డ రామచంద్రరావు, పి. జె. 49, పంజగుట్ట, హైదరాబాద్

వాజ పేయయాజుల రాయ సుబ్బారాయుడు, కొవ్వూరు, తూర్పు గోదావరి జిల్లా.

పులిచెర్ల సాంబశివరావు, 17వ లైను, అరండల్ పేట, గుంటూరు—2

ఎం. నిజాముద్దీన్, ఆంధ్ర జ్యోతి విలేకరి, గోదావరి ఖని, 505 209 కరీంనగర్ జిల్లా

టి. వి. భద్రిరాజు, పి.ఎ.ఒ. కార్యాలయం, ముకర్రాంజాహి వీధి, హైదరాబాద్.

శ్రీమతి జి. పరిమళా సోమేశ్వర్, లెక్చెరర్, సుపీరి బిల్డింగ్స్, సిటీకళాశాల ఎదురుగా, హైదరాబాద్-2

కప్పగంపుల లక్ష్మణ శాస్త్రి, ఆదర్శనగర్, హైదరాబాద్.

శ్రీమతి సి. ఆనందా రామం, ఎస్. టి. 26, మారేడుపల్లి, సికిందరాబాద్.


ఎ వి. రమణ, సారంగడోల వీధి, శ్రీకాకుళం

ఎస్. పి. గంగిరెడ్డి, రీసెర్చ్‌స్కాలర్, 17—ఆర్. ఎస్. హాస్టల్, ఆంధ్ర విశ్వవిద్యాలయం, వాల్తేరు 530003

రాజ భద్రయ్య విశ్వకర్మ, రాజ్ ఆర్ట్స్, వరంగల్లు-2

తుదిరూపురేఖలు దిద్దుకుంటోన్న

రామగుండం ఎరువుల కర్మాగారం



కరీంనగర్ జిల్లాలో పావన గోదావరినది తీరాన, మన రాష్ట్రాన్ని మరింత సస్యశ్యామలం చేయడానికి తోడ్పడే భారత ఎరువుల కర్మాగార సంస్థ రామగుండంలో భారీఎత్తున నిర్మాణ దశలో నుండి తుది మెరుగులు దిద్దుకుంటోంది.

వ్యవసాయ ప్రధానంగా వుండే మనదేశంలో ఎరువుల వాడకం ప్రాముఖ్యత, "పచ్చని విప్లవం" దృష్టియందుంచుకుని భారత ప్రభుత్వంపావుశతాబ్ది కింద ఫెర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ప్రభుత్వ రంగ సంస్థ) తరపున మొట్టమొదట ఎరువుల ఫ్యాక్టరీని సింద్రీ (బీహారు) లో స్థాపించడమేగాక పెరుగుతున్న ఆధునిక వ్యవసాయ ధోరణులకు అనుగుణంగా ఎరువుల వుత్పత్తికి గాను దేశం మొత్తం మీద యింకా 11 ఎరువుల ఫ్యాక్టరీల నిర్మాణ కార్యక్రమం చేపట్టింది. కొన్ని కర్మాగారాలలో నుండి అనగా ట్రాంబే, గోరఖ్‌పూర్, నంగల్ మొదలగు ఎరువుల ఫ్యాక్టరీలచే ఎరువులు వుత్పత్తి కూడా ప్రారంభమయింది.


పెట్రోలు, చమురు పదార్థాల కొరత ఏర్పడిన కారణంగా బొగ్గుతో నడచు 3 ఎరువుల కర్మాగారాలను రామగుండం, తాల్చేరు, కోర్బాలలో నిర్మించుటకు పైసంస్థ పూనుకొనుట ముదావహం. ఫ్యాక్టరీకి కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానం కొంతవరకు సంస్థ ప్రణాళికాభివృద్ధి విభాగం వారి సౌజన్యంతో యింకొంత పశ్చిమ జర్మనీ, ఇటలీ, జెకోస్లొవేకియా, దేశాలనుండి నిపుణుల బృందాలను రప్పించి యంత్రభాగాలను అమర్చుతున్నారు. యంత్రపు అమరిక పనులు 84 శాతం, విద్యుత్ సామాగ్రి 90%, గొట్టపు అమరిక పనులు 73%, సూక్ష్మ యంత్ర సామాగ్రి 55% పనులు పూర్తయాయి


ఇది ప్రపంచంలో కెల్ల పెద్ద బొగ్గుతో నడుచు ఎరువుల ఫ్యాక్టరీ. పెట్టుబడి రూ॥ 160 కోట్లు వుండగా 1977 చివరనాటికి పూర్తిస్థాయి వుత్పత్తి ప్రారంభమవగలదనే విశ్వాసంతో యిటు కార్మికులు అటు ఉద్యోగులు కష్టించి రేయింబవళ్ళు పనిచేస్తున్నారు. దీని ప్రారంభపు వుత్పత్తి 3 వేల టన్నుల బొగ్గు; 15 మిలియను గ్యాలన్ల నీరు (గోదావరి నుండి) మరియు 15 మెగావాట్ల విద్యుత్ ఖర్చుతో రోజుకు 900 టన్నుల అమ్మోనియా 1500 టన్నుల యూరియా వుండగలదని, ఈ ఎరువుల వాడకంవల్ల అదనంగా 50 లక్షల టన్నుల ఆహారధాన్యాలు పండగలవని, సంవత్సర వుత్పత్తి ఆదాయం 87 కోట్ల రూ. విదేశీద్రవ్య మారకంలో 100 కోట్ల రూ॥ ఆదా చేయవచ్చునని (ఆహారధాన్యాల దిగుమతి లేకుండుటవల్ల) అంచనా.

దీనికి అవసరమగు బొగ్గును స్థానిక సింగరేణి కాలరీస్ వారు ప్రత్యేక బెల్టు కన్వేయరు ద్వారా నేరుగా ఫ్యాక్టరీలోనికి పంపే ఏర్పాటు చేశారు. ఆంధ్ర ప్రదేశ్ విద్యుత్ బోర్డు వారు ప్రత్యేక 'పవర్ గ్రిడ్'ను ఏర్పాటు చేసింది

కర్మాగారంలో ప్రత్యక్షంగా 1500 మందికి పరోక్షంగా 500 మందికి ఉద్యోగావకాశాలు లభ్యంకాగలవు యిందులో పనిచేయు కార్మికులకు భాగస్వామ్యం అవకాశం కల్పిస్తున్నారు. వీరి సౌకర్యార్థం ఒక ప్రత్యేక 'టౌన్‌షిప్'లో 1500 అధునాతన వసతులు గల యిండ్లను నిర్మించారు యింతియేగాక వారికి వైద్య, త్రాగునీటి సౌకర్యం. పాఠశాల, సెంట్రలుస్కూలు, ఆరుబయలు రంగస్థలం, ఆటస్థలం, ఆర్.టి.సి. బస్సులు మొ॥ వసతులు కల్పించారు. సిబ్బంది అంతయు ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ యొక్క 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం అమలుకు చేయూతనిస్తున్నారు.

భవిష్యత్‌లో రామగుండం ఎరువుల కర్మాగారం సాంకేతిక పరిజ్ఞానానికి, ఎరువుల వుత్పాదనలో రాష్ట్రంలోనేగాక దేశంలోనే ఒక ప్రత్యేక స్థానాన్ని పొంది ప్రగతి పథంలో ముందంజ వేస్తు మచ్చుతునకగా నిల్చి ప్రగతి శిఖరాన్ని అందుకోగలదని ఆశిద్దాం





నగరంలో...


ఎడమవైపు పైన: రాష్ట్రపతి శ్రీ ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ నవంబరు 23న వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు ఎకాడమీలో ఐ పి ఎస్ 28వ బృందం పెరేడ్‌ను పర్యవేక్షించారు.


కుడివైపు పైన: కేంద్ర విద్యామంత్రి ప్రొఫెసర్ నూరుల్‌హసన్ నవంబరు 27న నాంపల్లిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఇంటర్మీడియట్ విద్యా సంస్థ "విద్యాభవన్"కు శంకుస్థాపన చేశారు.

ఎడమవైపుమధ్యలో: గవర్నరు శ్రీ ఆర్. డి. భండారే భారత భూగర్భ పరిశోధన శాఖ 125వ వార్షికోత్సవం సందర్భంగా డిశంబరు 4న రవీంద్రభారతిలో సావనీర్ విడుదల చేశారు.

ఎడమవైపుక్రింద: గవర్నరు సతీమణి శ్రీమతి శకుంతలా భండారే నవంబరు 19న గాంధీ జ్ఞానమందిర్‌లో మద్యనిషేధంపై జరిగిన ప్రప్రథమ రాష్ట్ర మహిళల మహాసభలో పాల్గొన్నారు.

కుడివైపు క్రింద: కార్మికశాఖ కేంద్రమంత్రి శ్రీ కె. వి రఘునాథ రెడ్డి నవంబరు 24న రామనాధపురంలో ఎలెక్ట్రానిక్స్ పరికరాల వినియోగంపై డి జి.ఇ.టి శిక్షణాసంస్థకు శంకుస్థాపనచేశారు














కుడివైపు పైన : సికింద్రాబాదు జింఖానా మైదానంలో నవంబరు 12న అఖిలభారత సివిల్ సర్వీసుల క్రికెట్ పోటీలలో విజేతలకు ముఖ్య మంత్రి బహుమతులను అందజేశారు.


ఎడమవైపు పైన. ముఖ్యమంత్రి నవంబరు 16న బాలానగర్‌లో ఉపగ్రహసంబంధిత పారిశ్రామికవాడకు ప్రారంభోత్సవంచేశారు

ఎడమవైపుమధ్యలో రాజ్‌భవన్‌లో డిసెంబరు 2న ముఖ్యమంత్రి గోదావరి జలాల వివాద పరిష్కార ట్రిబ్యునల్ అధ్యక్షునికి, సభ్యులకు విందు ఏర్పాటు చేసినప్పటి దృశ్యం.

ఎడమవైపు క్రింద రవీంద్రభారతిలో నవంబరు 20 నుండి 22వరకు భూటాన్ నుండి వచ్చిన 16 మంది సాంస్కృతిక బృందం ప్రదర్శనలనిచ్చింది.

కుడివైపు క్రింద : వైద్య, ఆరోగ్య శాఖామాత్యులు శ్రీ కె. రాజమల్లు నవంబరు 16న స్థానిక కుటుంబ నియంత్రణ కేంద్రంలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ద్విదశాబ్ది ప్రగతి ప్రత్యేక సంచికను విడుదల చేశారు.







స్వర్ణయోగి

పులిచెర్ల సాంబశివరావు

—పంచమ యోగము—

మూగచింతపల్లె వేశ్యావాటిక.

ఎప్పుడూ అక్కడ సత్యగాన వినోదాలే! చీకటికీ, దుఃఖానికీ అక్కడ తావులేదు. అహస్కరుడస్తమించటం ఆలస్యం. మూగచింతపల్లి చిత్ర విచిత్రాలైన దీపం కాంతులతో దగద్దగాయమానమవుతుంది. పగలు వెన్నెల ఉంచే ఎంత సుందరంగా ఉంటుందో మూగచింతపల్లెలో రాత్రి అలా ఉంటుంది.

కలహంస, కర్పూరకలికి, మధురవాణి, చిత్రాంగి, కనకరేఖ, మదనాభిరామ, కామమంజరి, కమలనయవల పేరులతో కోకిల పంచమ స్వరంతో కూసినట్లుగా ఒకరినొకరు పిలుచుకుంటుంటారు. అంఘ్రి పద్మం చుట్టూ అతి వలయంగా నీలాల సరపణులు నీటు చూపుతుండగా నృత్యం చేస్తూంటారు. ప్రియము నయము చూపించి విటుల్ని ఆనంద పెడతారు. వసంతుడు పికసమూహంతో మలయ పవన సహితుడై అక్కడి ఉపవనాల్లో వీరవిహారంచేసి మనసిజుని పొగడ్తలందుకొంటూ ఉంటాడు.

మూగచింతపల్లిలోని మొదటి ఇల్లు మనోహరంగా ఉంటుంది. అది నాగులు నివాసగృహం.

ఆ ఊళ్లో ఆ గృహం చుక్కల్లో చంద్రునిలాగా మెరుస్తూంటుంది. నాగులను తిరునాళ్లలో కలిసింది మొదలు వేమారెడ్డి మనసంతా దానిపైనే ఉంది. తండ్రి మరణానంతరం అతడెక్కువ కాలాన్ని మూగచింతపల్లెలోనే గడుపుతున్నాడు. దాని చూపులు వేమారెడ్డికి శృంగార రసంలో చిలికి సేయించిన కంతుని మోహన సాయకములయ్యాయి. దాని పలుకులు చిత్తజుని తీరికలికి రాచిలుకల పలుకులయ్యాయి. దానిగానం మత్తకీర కలకంఠకు స్వానమనిపించింది.

నాగులు చేసే నృత్యాన్ని చూడటానికి వచ్చిన వేమారెడ్డి, దాని శరీర సౌందర్యాన్ని చూచి మోహించాడు. కళారాధన కోసం వచ్చిన వేమారెడ్డి కాముని కళా విలాసాలకు చిక్కాడు. నాగులు తన నృత్యగాన విలాసాదులతో వేమారెడ్డి హృదయాన్ని దోచుకుంది. దాని వలలో చిక్కుకొని వేమారెడ్డి విలవిలలాడాడు. దాని తోడిదే లోకంగా ఉన్నాడు.

నాగులు గృహం వేమారెడ్డికి మకరకేతను సభామండపమయింది.

కొండ వీటిలో వేమారెడ్డి వదినగారైన నరసాంబ మిగుల దిగులు చెందింది. మామగారి మరణంతో ఆమె మనసు కలత చెంది ఉంది. మరది వేశ్యాలోలుడై తిరగటంతో ఆమె మరింత క్రుంగి పోతూంది.

రాచవేమారెడ్డి కొండవీటికి ప్రభువయ్యాడు. రాజ్యంలో అరాచకం ప్రబలింది.

నరసాంబ మరదిని సన్మార్గంలో పెట్టటానికి తీవ్రంగా ప్రయత్నిస్తూంది. ఆమె ప్రయత్నాలన్నీ విఫలమవుతున్నాయి.

వేమారెడ్డి చిన్నతనంలోనే తల్లిని పోగొట్టుకున్నాడు. నరసాంబే వేమారెడ్డిని తల్లికన్న మిన్నగా పెంచి పెద్ద చేసింది. నరసాంబ ఒడిలో పెరిగిన వేమారెడ్డి ఆమెను 'అమ్మా' అనే అంటాడు-నరసాంబకు సంతాన మింతవరకు కలుగలేదు. ఇక ముందు ఆ ఆశ లేదు. అందువల్ల ఆమెకు వేమారెడ్డిపై వాత్సల్యం పెరుగుతూనే ఉందిగాని తరగటం లేదు!

వేమారెడ్డి వేశ్యాలోలుడై ధనంకోసం మాత్రమే ఇంటికొస్తున్నాడు. నరసాంబ వేమారెడ్డి ఇంటికి తిరిగివచ్చినందుకు సంతోషిస్తుంది. కొద్దికాలమలా ఉండి హఠాత్తుగా అతడు తిరిగి వెళ్లిపోతాడు. వేమారెడ్డి అడిగిన దాని కెప్పుడూ నరసాంబ 'లేదు' అని సమాధాన మీయలేదు. వేమారెడ్డి బిడియం విడచి ఆభరణాలకై చేయి చాచటం మొదలు పెట్టాడు. "వేమారెడ్డీ! ఇంటి పట్టున ఉండు నాయనా!" అని అనటం తప్ప మరేం పలికేది కాదామె! "అలాగే!" అంటూ వేమారెడ్డి దొరికినంత వరకు సొమ్ముల్ని తీసుకొని నాగులు కైంకర్యం చేస్తున్నాడు.

తిరిగి కొన్నాళ్ళకు వస్తాడు. వచ్చేది సొమ్ముకోసమే! కావలసినంత వరకూ ఎలాగో సంతరించుకొంటాడు. కొద్ది కాలం అలా ఉండి హఠాత్తుగా అతడు తిరిగి వెళ్ళిపోతాడు. ఇలా విలువైన ఆభరణాలెన్నో నాగులు వశమయ్యాయి.

వేమారెడ్డి నాగులు వశమయ్యాడు. దాని కడకంటి చూపు కోసం పరితపిస్తున్నాడు. నాగులు మాటలు విన్న తరువాత వేమారెడ్డికి కోయిల కూత రుచించటం లేదు ఆ ఆటవెలది ముఖ కాంతిని చూచిన తరువాత చంద్రుని యందు అభిలాష తగ్గింది. నాగులు నవ్వినపుడు వేమారెడ్డికి వెన్నెల మలినమైనట్లు కనిపించేది.

వేమారెడ్డి కొండవీటికి వచ్చి ఉన్నదినాల్లో విరహ వేదనను తాళలేక పోతున్నాడు. చంద్రుడు లోకులకు ఆనందం ఇస్తాడు. వేమారెడ్డిని మాత్రం బాధపెడతాడు. కోకిల మధురమైన కూత ఏడిపిస్తూంది. పిల్లతెమ్మరలు ప్రాణం తీస్తున్నాయి నాగులుకు ఆనందం కలగ చేయటానికై రెడ్డి తన యిల్లు గుల్ల చేస్తున్నాడు. వద్దని వారించిన మిత్రుల్ని లక్ష్య పెట్టటం లేదు. మామిడి సింగనవంటి పెద్దల సుద్దులకు ఫలితం శూన్యమయింది.

ఆ దినం వేమారెడ్డి అమూల్యములైన ఆభరణాలను నాగులకు కానుకగా తెచ్చాడు. దాని ఆనందానికి హద్దులేదు.

"నాగులూ! ఏదీ! నీ మొగం చూపించు! ఇతరుల మొగాలను చూడటం వలన నా దృష్టి చెడింది! నీ మొగమును చూచితే తిరిగి నాకు చూపు వస్తుంది! నాగులూ! తియ్యగా ఒక్కసారి పలుకు! నా చెవులు వీణ విని చిల్లులు పడినవి. నీవు పలికితే అమృతం పోసినట్లవుతుంది!"

వేమారెడ్డి తెచ్చిన ఆభరణాలు చూచి నాగులు కన్నులు తళతళ మెరిశాయి. సొమ్ములు చూచి దాని ఉల్లంలో ఉల్లాసం ఉప్పొంగింది.

ఇంతలో ఆ యింట పని చేసే చకోరాక్షి వాకిట నిలచింది.

"అమ్మా! క్షమించండి! అయ్యగారికోసం ఎవరో ఇద్దరు పురుషులు వచ్చి ఉన్నారు!"

"అయితే......మధ్యలో ఎవరూ లోపలికి రాగూడదని నీ కెన్ని సార్లు చెప్పాలే!"

"అమ్మా! క్షమించండి! రాక తప్పలేదు!"

"అంత గొంతు మీదికేం వచ్చి పడింది?"

"ఆ వచ్చిన పురుషు లిద్దరూ తొందర చేస్తున్నారు!"

"తొందరా? ఎవరువాళ్ళు! దేనికి తొందర?"

"ఏమోనమ్మా! నాకేం తెలుసు!"

"తెలీకపోతే పోయి అడిగి తెలుసుకొని వచ్చిచెప్పు!"

"ఎన్ని సార్లడిగినా చెప్పటం లేదమ్మా! పైగా కోపగించుకొంటున్నారు. హడావుడి చేస్తున్నారు, బెదిరిస్తున్నారు. అందులో ఒకడు వీరుడిలాగా ఉన్నాడు అబ్బ! అయన్ను చూస్తేనే భయమేస్తూంది. నన్ను అయనే కొట్టబోయాడు? భయంపుట్టి ఇలా లోనికి వచ్చాను...!"

"రెండవ వారెట్లా ఉన్నారు?" వేమారెడ్డి ప్రశ్నించాడు.

"రెండవ వ్యక్తి ఒక గొప్ప వ్యాపారిలాగా ఉన్నారు ప్రభూ!"

"సరే! వాళిద్దర్నీ వెంటనే లోనికి ప్రవేశపెట్టు!"

నాగులు వేమారెడ్డి వైపు చురచుర చూస్తూ లోపలకు పోయింది. అది విసవిసా నడచి పోవటం చూచి వేమారెడ్డి ముసిముసి నవ్వులు నవ్వుకొన్నాడు. "నాగులు కోపం వచ్చినప్పుడింకా అందంగా కన్పిస్తుంది...!" అనుకొన్నాడు.

(సశేషం)





పాఠకుల లేఖలు

ఆర్యా,

ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవ ప్రత్యేక సంచిక చాలా గొప్పగావుంది. ఇంత సమగ్రంగా, సర్వాంగ సుందరంగా సంచికను వెలువరించినందుకు మిమ్మల్ని హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. ఈ పత్రిక చరిత్రలో ఈ ప్రత్యేక సంచిక సువర్ణాక్షరాలతో లిఖింపదగిన ఒక అపూర్వ అమూల్య విజయ సాధనగా భావిస్తున్నాను.

అమరేంద్ర
గుంటూరు

ఆర్యా,


ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవ సంచిక చూడగానే ముచ్చట గొల్పునట్లుగానున్నది. రచనలకు హెడ్డింగులలో, పేర్లలో సొగసు గూర్చి, అన్ని పేజీలు అలంకరించారు. అన్ని అంశాలకు అవకాశం కలిగించి, అందరినీ సంతృప్తి పరచగల్గారు. గత 20 ఏండ్లలో రాష్ట్రం వివిధరంగాలలో సాధించిన ప్రగతిని మాత్రమే వివరిస్తారేమోనని నేను మొదట ఆశించాను. 'అ' నుంచి 'క్ష' దాకా అన్నింటినీ పొందుపరచారు. Preserve చేసుకొనవలసిన సంచికగా తీర్చిదిద్దినందులకు ధన్యవాదాలు తెలవు.

మాదల వీరభద్రరావు
బెంగుళూరు.

ఆర్యా,

అక్టోబరు 76 లోని బాపూజీ ఆశించిన రామరాజ్యం బాగుంది. కందుకూరి వీరేశలింగం చరిత్ర బొమ్మలు వేస్తూయివ్వడం అంతగా ఇంటరెస్టుగా వుండదంలేదు కార్టూనులు ఈ నెలవి పాతగా యున్నావి. (అంటే యిదివరకు చదివినట్టేవున్నవి) గడ్డు రోజులొచ్చాయి. సిరాకలో నిండుగుండె హైలైట్స్. గ్రామాలకు కావలసిన సదుపాయాలు ఆ గ్రామ కోర్కెలు గల లేఖలు ప్రచురిస్తే బాగుంటుంది అనే ఒక పాఠకుడి లేఖతో ఏకీభవిస్తున్నాను.

ముదుగంటి సుధాకర్ రెడ్డి
కరీంనగర్.



ఆర్యా,

ఆంధ్రప్రదేశ్ 20వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక సర్వాంగ సుందరంగా వుంది.

విలువైన, విశిష్టమైన సమాచారంగల ఉత్తమరచనలతో ప్రత్యేక సంచిక చక్కగా రూపొందించినందుకు సంపాదకులు మిక్కిలి అభినందనీయులు.

మండా సూర్యనారాయణ
('మసూనా')
విశాఖపట్నం

ఆర్యా,

ఆంధ్రప్రదేశ్ అక్టోబరు సంచిక అందమైన ముఖచిత్రంతో క్రొత్త వెలుగులు సంతరించుకుంటూ మా చేతుల్లో వాలింది ఉత్పల గారి గేయమూ, పద్మజా సోమేశ్వర్ గారి కథ, "గడ్డు రోజులొచ్చాయి'' పత్రిక్కి హైలైట్స్. అడపా దడపా కథలు కూడ ప్రచురిస్తుండాలి ఈ సంచికలో కార్టూన్స్ కాస్త ఎక్కువగానే ప్రచురించారు ఇంకా విరివిగానే ప్రచురిస్తారని ఆశిస్తాను. ఇన్ని విభిన్న శీర్షికలు, నాలుగు సీరియల్స్ అందించేది వన ఆంధ్రప్రదేశ్ పత్రిక ఒకటే అన్పిస్తుంది. ఇకపోతే, బాలలకూ, స్త్రీలకూ ప్రత్యేకంగా శీర్షికలు ప్రవేశపెడితే బావుంటుందని నాసలహా. మన పత్రికకు క్రొత్తగా రచనలు పంపేవారికి అనుగుణంగా రచయితలకు నిబంధనలు ప్రచురించండి. ముఖచిత్రాలు ఇంకా బాగుండేవి ప్రచురించండి పత్రిక గెటప్‌లో మరికాస్త శ్రద్ధ వహించ గలరు విజ్ఞానదాయకమైన ఆర్టికల్స్, వ్యాసాలను కూడ ప్రచురించి మన పత్రిక ద్వారా విజ్ఞాన సౌరభాన్ని ప్రతి గ్రామంలోనూ వెదజల్లండి. సంపాదకుల కృషికి నా ధన్యవాదాలు.

ఎస్. నరసింహమూర్తి
అనంతపురం.

నిరాశలో నిండు గుండె

— సి. ఆనందారామం

జరిగిన కథ:— శ్యామ్ తండ్రి జనార్దన్ వద్ద పెరిగిన సి ఐ డి అధికారి మోహన్ లోటస్ హోటల్ యజమాని సాంబశివం చేస్తున్న దొంగనోట్ల వ్యాపారం పట్టివ్వడానికి ప్రయత్నిస్తున్నాడు. ప్రసూన సాయం చేస్తానని మాట ఇస్తుంది. సాంబశివం గుప్పిటిలో నుండి శేఖర్‌ను విడిపిస్తానని వాగ్దానం చేస్తుంది సుశీల.

రేఖ సాంబశివం అనుమతితో మోహన్‌ను తమ వైపుకు తిప్పుకునేందుకు యత్నిస్తుంది. మోహన్, చిరంజీవి సాయంతో సాంబశివం గదిలో టేప్ రికార్డర్ పెడతాడు. కూలీ పేటలో ప్రసూన, పరమేశ్వరి చేస్తున్న సేవా కార్యక్రమాలకు నూరు రూపాయలు విరాళం ఇస్తాడు.

దొంగ నోట్ల కేసు నుండి ప్రసూనను దూరంగా ఉండేలా చేయమని సుశీలతో అంటాడు శేఖర్. ప్రసూన శేఖర్ ఎద్దకు నచ్చి రూపం చదువు గుణం—అన్నీ వున్న అతను ఇక్కడెందుకు చిక్కుపడ్డాడో, అని బాధపడి, అతన్ని మందలిస్తుంది. నిరుద్యోగమే ఇందుకు కారణమంటాడు శేఖర్.

—17—

మోహన్ హోటల్ లోటస్ కి వచ్చి స్వతంత్రంగా ప్రసూన గదిలోకి వెళ్ళబోయాడు—శేఖర్ అడ్డు తగిలాడు...

"అది మేనేజర్‌గారి ప్రైవేట్ సెక్రటరీ రూం సార్! ఆ గదిలోకి ఎవ్వరూ వెళ్ళకూడదు"....

"నాకు అక్కడే పని ఉంది..."

"మీకు పని ఉంటే బయట ఎక్కడైనా మాట్లాడుకోవచ్చు. ఇక్కడ వీల్లేదు..."

"నేను ఆ గదిలోకి వెళ్ళవలసినది డ్యూటీ మీద! మాట్లాడటానికి కాదు."

తన జేబులోంచి ఐడెంటిటీ కార్డు తీసి చూపించాడు మోహన్... శేఖర్ ఏమీ మాట్లాడలేకపోయాడు ...

స్ప్రింగ్‌డోర్ తలుపులు తెరుచుకుని మోహన్ లోపలకు వచ్చాడు.

అతడిని చూసి కంగారుగా లేచి నిల్చుంది ప్రసూన . .

"కూర్చోండి!" అన్నాడు మోహన్, తనూ కూర్చుంటూ...

ప్రసూన బల్లమీది ఫోన్ మ్రోగింది ...

"ప్రసూనా? జాగ్రత్త! మోహన్‌కు ఏ విషయమూ తెలియనివ్వకు!"

గట్టిగా పలికింది సాంబశివం కంఠం, ఎదురుగా కూర్చున్న మోహన్‌కి కూడా వినిపించేటంత స్పష్టంగా...

ప్రసూన వెలవెలపోయింది...

మోహన్ చిరునవ్వుతో "ఆ రికార్డు కోసం వచ్చాను" అన్నాడు

"అది...దాని సంగతి నాకు తెలియదు!"

"ఫరవాలేదు లెండి. నాకు తెలుసు!"

మోహన్ లేచివెళ్ళి ఆ గదిలో ఒక మూలగా పడివున్న పాత మేగజిన్ల కట్టలోంచి చిత్తుకాగితాల పుస్తకంలావున్న ఒకదానిని తీసి పరిశీలించి చూశాడు. వికసించిన ముఖంతో జేబులో పెట్టుకున్నాడు. అయోమయంగా చూస్తోన్న ప్రసూనను ఉద్దేశించి "దొరికింది లెండి. వెళ్ళొస్తాను" అన్నాడు ...

గుమ్మందాకా వెళ్ళి ఆగి వెనక్కు తిరిగిచూసి వెటకారంగా నవ్వుతూ "సాయంత్రం సంఘసేవకి వస్తారుగా! అప్పుడు మాట్లాడుకుందాం!" అనేసి తలుపు మూసేశాడు.....

ఆ తలుపులు ఒకదానితో ఒకటి టక్కున కొట్టుకున్నాయి. ఆ శబ్దం ఏదో అదృశ్య శక్తి తన హృదయంమీద కొడుతున్న దెబ్బకి ప్రతిధ్వనిలా అనిపించింది ప్రసూనకు ...

మోహన్ ఆ హోటల్ ఆవరణ దాటకుండానే శేఖర్ కలుసుకున్నాడు....

"మిమ్మల్ని మా మేనేజర్‌గారు ఒకసారి రమ్మంటున్నారు సార్!" అన్నాడు ...

అంతవరకూ మోహన్ సాంబశివాన్ని కలుసుకుని మాట్లాడలేదు. ఒక్కక్షణం ఆలోచించి "ఆల్‌రైట్!" అని సాంబశివం గదిలోకి వచ్చాడు... శేఖర్ వెళ్ళిపోయాడు

సాంబశివం లేచి మర్యాదగా మోహన్‌ను ఆహ్వానించాడు. ఇద్దరూ ఒకరినొకరు పరిశీలించుకుంటూ కొన్ని క్షణాలు మౌనంగా వున్నారు.

ఏవిధమయిన ఉపోద్ఘాతాలూ లేకుండా విషయంలోకి వచ్చేశాడు సాంబశివం...

"మీ రేటెంత!"

మోహన్ తంగున సమాధానం చెప్పాడు.

"నేను అమ్ముడుపోయే మనిషిని కాను."

సాంబశివం నవ్వాడు

"మనమంతా అమ్ముడుపోయి—పోపోతున్నవాళ్ళమే ! ఏదో ఒక విధమైన రేటు మనకి ఉండక తప్పదు ఇవాళ కాకపోతే... రేపు !..."

"సరే ! అలాంటి రేపులోకి మీరు రాగలిగినపుడు నాతో మాటాడండి !"

"అలాగే ! రేపటివ కూడ రాకుండా ఇవాళే పరిష్కరించు కోలేమా ?"

"లాభంలేదు !"

"ఒక్కసారి ఆలోచించుకోండి !"

"ఆలోచించుకోవలసిన అవసరమేమీలేదు."

మోహన్ లేచి చెయ్యిజాపాడు. సాంబశివం చిరునవ్వుతో ఆ చెయ్యి అందుకుని "గుడ్‌బై !" అన్నాడు.

మోహన్ తన గది దాటగానే రేఖకు ఫోన్ చేశాడు సాంబ శివం.

"నువ్వు నీపని ప్రారంభించవచ్చు !"

రేఖ మెరుపులావెళ్ళి వెళ్ళబోతున్న మోహన్‌కి అడ్డుగా నిల్చుంది...

"ఇంతదూరంవచ్చి నాతో మాట్లాడకుండా వెళ్ళిపోతారా ?"

"ఇప్పుడు పని ఉంది..."

"ఈ హోటల్‌లో నాకొక ప్రైవేట్ రూం ఉంది— రండి. కొంచెంసేపు కాఫీ తీసుకుని వెళ్ళిపోదురుగాని..."

"పద !" అన్నాడు మోహన్...

మోహన్‌ముందు కాఫీకప్పు ఉంచి "నా ప్రార్థన ఒకటి మన్నించరా ?" అంది ..

పక పక నవ్వాడు మోహన్.

"మీరెందుకు నవ్వుతున్నారో నాకు అర్థం కావటంలేదు !" బుంగమూతితో అంది రేఖ ...

"నా దగ్గర నుండి ఆ రికార్డు తీసుకోవటం అంత తేలిక అనుకుంటున్నారా, మీరంతా ! నిజంగా ?"

"ఏ రికార్డూ ? నాకేం తెలుసు ?" అంది రేఖ అమాయకంగా...

అది నటన అని మోహన్‌కు తెలుసు. మోహన్‌కు తెలుసునని రేఖకు తెలుసు...

"మీరు నన్ను అంత తేలిగ్గా అంచనా వేస్తున్నారా— నిజంగా ?" అంది మోహన్‌ను అనుకరిస్తూ...

మోహన్ రేఖను పరిశీలిస్తూ "మీ ప్రార్థన ఏమిటో చెప్పండి !" అన్నాడు...

"నేను ఏ క్షణంలోనైనా మీకు సహాయం చెయ్యటానికి సిద్ధంగా ఉంటాను. నన్ను ఎప్పుడు ఏది అడగవలసివచ్చినా సంకోచించకండి ఇదే నా ప్రార్థన—"

నిమ్మెరపోయాడు మోహన్.

రేఖ పెదవులపైన కనీకనిపించని చిరునవ్వు విరిసింది.

అది చూసిన మోహన్‌కు లిప్తమాత్రం తలతిరిగింది. క్షణాలలో సర్దుకుని రేఖను చూస్తూ చిరునవ్వు నవ్వాడు.

"నిజంగానే మిమ్మల్ని కొంత తక్కువగానే అంచనా వేసుకున్నాను. ఇంకమీదట జాగ్రత్తగా ఉంటాను"

రేఖ విలాసంగా వెటకారంగా నవ్వి "థేంక్యూ" అంది ...

ప్రసూన ఎలా ఉందో చూడాలని ఎంతగానో అనిపించింది మోహన్‌కి. కానీ ఆ గదివైపు మళ్ళకుండా తన కాళ్ళను అతి ప్రయత్నంమీద నిగ్రహించుకున్నాడు.

ఆ సాయంత్రం పరమేశ్వరి దగ్గి కు ప్రత్యేకించి ప్రసూనను చూడాలనే వెళ్ళాడు మోహన్...

ప్రసూన రాలేదు. చిరంజీవి ఎంతో ఉత్సాహంగా ఉన్నాడు .. తను కుట్టించుకున్న కొత్త సూట్ పరమేశ్వరికీ, మోహన్‌కీ చూపించాడు...

"నా ఫ్రెండ్స్ నాకు పార్టీ ఇస్తున్నారు సార్ ! అందుకే ఈ సూట్ కుట్టించుకున్నాను. సూట్ కాదు కాని భలే అవస్థ పడ్డాను లెండి. పడితే పడ్డాను. పార్టీకి ఆ మాత్రం సూట్ లేకపోతే ఎలా సార్ !"

నదిలీ వదలని అమాయకత్వంతో మాట్లాడే చిరంజీవి మాటల్లోని ఉత్సాహమూ, అతని ముఖంలో వెల్లివిరుస్తోన్న అపూర్వమైన ఆనందమూ అతనికి ఆ పార్టీ ఎంత అపురూపమైన విషయమో స్పష్టం చేస్తున్నాయి

పరమేశ్వరి వాత్సల్యంగా చిరంజీవి వెన్నుతట్టింది...

మోహన్ కూడా అభిమానంగా నవ్వి "నువ్వు ప్రెసిడెంట్ వ్వయి ఏం సాధిస్తావో చూస్తానుగా !" అన్నాడు.

"చూడండి సార్ ! నేను అందరిలా అనుకున్నారా ?" గర్వంగా నవ్వాడు చిరంజీవి...

"ప్రసూన ఎలా ఉందో ?" అడగకుండా ఉండలేకపోయాడు మోహన్...

చిరంజీవి తెల్లబోయాడు.

"ఏం సార్ ! ప్రసూనగారి క్షేమమేనుంది ?"

"ఏం లేదు, ఇక్కడికి రాకపోతే అడిగాను "

"అదా ? ఇవాళ ఆవిడ తన గదిలోనే పడుకున్నారుట ! బయటికికూడా రాలేదు. వాళ్ళ అమ్మగారే చెప్పారు నాకు సమాధానం......"

ఈ విషయం చిరంజీవికి సామాన్యంగా తోచింది కాని మోహన్‌కు చాలా చికాకు కలిగించింది. తనేం చేస్తున్నాడో తనకు అర్థమయ్యేసరికి మోహన్ ప్రసూన ఇంటిముందు ఉన్నాడు. అప్పటివరకు ప్రసూన ఎన్నడూ మోహన్‌ను ఇంటికి ఆహ్వానించలేదు. పైగా రావద్దన్నట్లే మాట్లాడింది. చదువుకునే రోజుల్లో ఎప్పుడో ఒకసారి - అదీ ఇంట్లో ఎవరూ లేనప్పుడు వచ్చాడు. అంతే! ఒక్క క్షణం సందేహించి ఇంట్లో ప్రవేశించాడు. "ఎవరూ? " అంది రాధమ్మ గట్టిగా ...మాటలో, వేషంలో అనాగరికత ఉన్నా - ఖరీదైన బట్టలూ, వంటినిండా మెరుస్తోన్న నగలూ చూసి పని మనిషి కాదని నిర్ణయించుకున్నాడు మోహన్. ప్రసూన తల్లి అయి ఉండాలి.

"ప్రసూన కోసం వచ్చాను."

రాధమ్మ గునగున నడుచుకుంటూ లోపలికి వెళ్ళింది.

"సూనమ్మా! నీ కోసం ఎవరో వచ్చినారు" అన్న మాటలు గట్టిగా వినిపించాయి. ప్రసూన ఏమందో వినిపించలేదు. రాధమ్మ వచ్చి "అమ్మాయి మాట్లాడకూడదంట! ఇప్పుడు ఇవతలికి రానంటా వుంది" అంది.

"మోహన్ వచ్చాడని చెప్పండి" అన్నాడు మోహన్. రాధమ్మ మళ్ళా లోపలికి వెళ్ళింది. అంతలో వచ్చి "కూసోండి. వస్తాదంట!" అంది.

కూచున్న మోహన్ మనసు పరిపరివిధాల పోసాగింది. ఏం చేస్తున్నాడు తను? తన మనసు ఎందుకిలా అయిపోతోంది?

కొంచెం సేపట్లోనే ప్రసూన బయటికి వచ్చింది. బాగా ఏడ్చినట్లు కళ్ళు ఉబ్బి ఉన్నాయి. కానీ ముఖం కడుక్కుని పౌడర్ వేసుకుని వచ్చింది.

మోహన్‌ను చూసి నిర్లక్ష్యంగా నవ్వి "ఎంత అదృష్టం! మా ఇంటికి స్వయంగా వచ్చారు" అంది.

రాధమ్మను చూపించి "మా అమ్మ!" అని పరిచయం చేసింది.

ఇన్నాళ్ళుగా ప్రసూన తనను ఇంటికి ఎందుకు ఆహ్వానించలేదో అర్థమయింది మోహన్‌కు.

"మీరు అదృష్టవంతులు. తల్లీ తండ్రి అందరూ ఉన్నారు. ఎవరూ లేని అనాథను నేను అందరి దయా ధర్మాలమీద బ్రతికాను" అన్నాడు.

ప్రసూన కళ్ళలో ఆశ్చర్యం కనిపించింది. మాట్లాడ లేదు.

మోహన్ కోసం ఫలహారం తెప్పించింది.

"మీరుకూడా తీసుకుంటేనే కాని నేను తీసుకోను!" అన్నాడు మోహన్. ప్రసూన ఏమీ తినిఉండదని అనిపించింది అతనికి.

"నాకు ఆకలిగా లేదు!"

"నాకు అసలు లేదు"

ఆప్యాయత ఉట్టిపడే అతని ధోరణి ప్రసూనకు ఆశ్చర్యంగా ఉంది. తనను విశ్వసిస్తున్నాడా మోహన్! అంత అదృష్టమా!

ప్రసూనతో కలిసి కాఫీ తీసుకున్నాక సందేహిస్తూ "మీరు ఈ ఉద్యోగం మానెయ్యరాదా" అన్నాడు మోహన్.

ప్రసూన ముఖంలో చిరునవ్వు ఎగిరిపోయింది. నిబ్బరంతో తలెత్తి "ఎందుకు మానెయ్యాలి?" అంది.

"మీకు బాగుందా ఈ ఉద్యోగం?"

"ఎందుకు బాగుండదు? ఈ రోజుల్లో ఇలాంటి ఉద్యోగం ఎంత మందికి దొరుకుతుంది?"

"అవును లెండి! ఇలాంటి ఉద్యోగాలకు చాలా అర్హతలు కావాలి!"

పకాలున నవ్వింది ప్రసూన.

"అవునా! మరి, ఆ అర్హతాలన్నీ ఉన్న నేను ఈ ఉద్యోగం ఎందుకు వదులుకోవాలి?"

"అవును వదులుకోవలసిన అవసరం లేదు. పరువు ప్రతిష్ఠ డబ్బు హోదా......"

"ఇన్ని ఇస్తోంటే వద్దనే మూర్ఖులెవరైనా ఉంటారేమో చూపించండి..."

"మూర్ఖులవునో, కావో, కాని ఇలాటివన్నీ కాదన్నుకుని తాము విలువలనుకునేవాటిని పాటించేవాళ్ళు ఉంటారు!"

"ఎవరు? మీ బోటివాళ్ళా?"

వెటకారంగా అడిగింది ప్రసూన

"మీరు నన్ను బాగా అర్థం చేసుకున్నారు!"

"మీరు నన్ను అర్థం చేసుకున్నదానికంటేనా?"

"ఇవాళ నేను మీ ఇంటిని వెతుక్కుంటూ వచ్చాను మిమ్మల్నెలా అర్థం చేసుకున్నానో చెప్పటానికి ఇది చాలదా?"

"చాలు! ఇవాళ రేఖ తీరిగ్గా లేదా?"

ప్రసూన ధోరణికి మోహన్‌లో సహనమంతా నశించిపోయింది.


"తెలియదు నేను మిమ్మల్నీ రేఖను ఒక లెవల్‌లో ఎన్నడూ ఊహించలేకపోయాను. ఆ పని మీరే చెయ్యగలిగితే... ఓ. కె. . థాంక్యూ!"

"వెళ్ళి వస్తాను" అన్నాడు లేచి నించుని చేతులు జోడించాడు మోహన్. ప్రసూన కూర్చున్న చోటినుంచి లేవలేదు. కనీసం అంగీకార సూచకంగా, మర్యాదగా తలకూడా ఆడించలేదు. వాలిన ఆవిడ కనురెప్పలముందు దట్టంగా అలుముకున్న అంధకారం తప్ప మరేమీ కనిపించడం లేదు.

(సశేషం)

ప్రగతి పథంలో వెదురుపాక సావరం

శ్రీ యస్. పి. జి. రెడ్డి



సర్పంచ్ శ్రీ సత్తిరాజు

ఈ ఆర్థిక సంవత్సరంలో తూర్పు గోదావరి జిల్లాకు ఉత్తమ గ్రామంగా ఎన్నికైనది వెదురుపాక సావరం. సుమారు 3,000 జనాభా, కేవలం 9 500 రూ లు పంచాయతీ ఆదాయం కలిగిన అతి చిన్నదైన ఈ గ్రామం తూర్పు గోదావరి జిల్లా, రామచంద్రపురం తాలూకా, రాయవరం సమితిలో రాయవరానికి ఒక మైలు దూరంలో వుంది. సువిశాలమైన రోడ్లు, ఆధునిక వ్యవసాయ సామగ్రి ఉపయోగంతో పచ్చ పచ్చని పైరుచేలతో, మోటారు ఇంజనుల సహాయంతో నిరంతరం జీవనదుల్లా ప్రవహించే పిల్లకాలువలతో, ఎన్నో సహకార సంస్థలతో చుట్టుప్రక్కల గ్రామాలకు ఆదర్శంగా రూపదిద్దుకున్న పల్లెటూరు అది.

1940కి పూర్వం ఈ గ్రామపు స్థితి వేరుగా వుండేది. ప్రజలు ఎంతో కష్టించి, ప్రభుత్వ సహాయంతో నేటికి తమ గ్రామానికి ఒక రూపునిచ్చుకున్నారు. కనీసం నడవడానికి కూడా వీలుకానట్టి మట్టిరోడ్లతో, విద్యుచ్ఛక్తి, విద్య, రవాణా సౌకర్యాలు కూడా లేకుండా, వర్షాలు వస్తేనే చేతికి పంట, లేకుంటే ఇక అంతే అనే పొలాలతో ఎంతో నిరాశాజనకంగా వుండే నాటి పరిస్థితికి, నేటికి ఎంతో తేడా దృగ్గోచరమవుతుంది 1940లో ఈ గ్రామంలో పంచాయతీ పాలన అమలులోనికి వచ్చింది. నాటినుంచి నేటివరకు ఎన్నికలనేవి లేకుండా ప్రజలు ఒకేమాటపై నిలబడి శ్రీ సత్తిరాజుగారిని సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకుంటూనే వున్నారు. ప్రజలకు వారు చేసే సేవ అపారం. వారికి రాష్ట్ర స్థాయిలో కూడా ఒక ప్రత్యేకమయిన గౌరవం వుంది. 10 సంవత్సరాలపాటు ఆయన తూర్పు గోదావరి జిల్లా ఖాదీ గ్రామోద్యోగ సంస్థకు అధ్యక్షులుగా వున్నారు.

నేడు గ్రామంలో ఒక ప్రాథమిక పాఠశాల వుంది తంతి, తపాలా సౌకర్యములు అందరికీ అందుబాటులో వున్నాయి. పంచాయతీ కార్యాలయానికి వచ్చే 4, 5 దినపత్రికలు, తదితర వ్యవసాయ, విజ్ఞాన సంబంధమైన పత్రికలను ప్రజలందరకూ అందుబాటులో వుండేలా శ్రీ వీరయ్యరెడ్డి మెమోరియల్ హాలులో వుంచుతారు. మట్టిరోడ్ల స్థానే కంకరరోడ్లు వెలిశాయి ఈ సంవత్సరమే గ్రామస్థుల ఆర్థిక సహాయంతో, అక్కడి విద్యార్థులు శ్రమదానంతో రోడ్లను విస్తృతపరిచే కార్యక్రమాన్ని చేపట్టి చక్కని సౌకర్యాన్ని ఏర్పరచారు. వీధిదీపాలు రాత్రికాలంలో అంధకారాన్ని పారద్రోలుతున్నాయి. మురుగునీటి పారుదల సౌకర్యం, పారిశుధ్య పనివారి ప్రత్యేక శ్రద్ధ ఈ గ్రామాన్ని మరింత శుభ్రంగా వుంచుతున్నాయి.

ఈ గ్రామవాసులకు చాలా కాలం నుండి ఘనమైన చరిత్ర వుంది. 1959లో ఒక నెలరోజులు ఈ గ్రామ సర్పంచ్‌గారు, ప్రజలు సర్వోదయ ప్రచారంకోసం పాదయాత్ర జరిపారు. చుట్టు ప్రక్కల అనేక గ్రామాలలో సర్వోదయం యొక్క వుద్దేశ్యాన్ని ఆరోగ్య సూత్రాలను, పొదుపు యొక్క ఆవశ్యకతను విరివిగా ప్రచారం చేయడమే కాకుండా ఈ పల్లెలోని క్రీడాకారులు యోగాసనాలను, వ్యాయామ ప్రదర్శనలను ప్రదర్శించి పదిమందికీ నేర్పారు. ఆ యాత్రలో ప్రజలకు యివ్వబడ్డ సందేశాలు: 1. ఆరోగ్యమే మహాభాగ్యం 2 పొగత్రాగరాదు, 3. మత్తుపదార్థములు సేవింపరాదు, 4. జీవహింస కూడదు, 5 సత్యమునే పలుకవలెను. అత్యుత్తమమైన ఈ సందేశాల ద్వారా సుషుప్తావస్థలోవున్న గ్రామీణ జనత జాగృతమయింది. ఈ ప్రచారం అంతటితో సమసిపోరాదనే వుద్దేశ్యంతో సావరం గ్రామంలో ఒక ఆశ్రమం నెలకొల్పబడింది. గౌతమబుద్ధాశ్రమం అనే ఈ ఆశ్రమానికి అనుబంధంగా ఒక ప్రకృతి వైద్యశాల కూడా స్థాపించబడింది యోగాసనాల కార్యక్రమం కొనసాగింది. కాని ఆర్థికంగా సహాయం లేనందువల్లను, కొన్ని ఇతర కారణాలవల్లను ఇవి కొద్దికాలంగా పనిచేయటంలేదు. ప్రభుత్వం తగిన ఆర్థిక ప్రోత్సాహం ఇచ్చినట్లయితే ఈ సంస్థలు ప్రజలకు ఉపయోగం కాగలవు. ఈ సందర్భంలో ఇక్కడికి విచ్చేసిన శ్రీ రామానందయోగీశ్వరులు, గాంధీగారి శిష్యులయిన ప్రభాకర్ జీ ప్రజల ఐకమత్యాన్ని నిస్వార్థ సేవాపరాయణతను కొనియాడారు.

ఇక్కడ సర్పంచ్‌గారి ఆధ్వర్యంలో ఎన్నో సహకార సంస్థలు, కుటీర పరిశ్రమలు నెలకొల్పబడ్డాయి. 1948 లో దంపుడు బియ్యం సొసైటీ, 1957 లో ఖాదీ గ్రామోద్యోగ సంస్థ, 1960 లో బ్రిక్ సొసయిటీ ప్రారంభించబడ్డాయి. ఖాదీ సంస్థ ఎందరో నిరుద్యోగులకు ఉపాధిని కలిగించింది నిరాశ, నిస్పృహతో కృంగిపోతున్న చేనేత పనివారికి పునర్జీవితాన్ని ప్రసాదించింది. మధ్య తరగతి గృహిణులకు ఈ సంస్థ అంబర్ చరఖాలు సరఫరా చేసి, వారు వడికిన నూలు కొనుగోలు చేయుటద్వారా ప్రశంసనీయమైన సేవ చేసింది ప్రస్తుతం ఈ సంస్థ బిక్కవోలు గ్రామానికి తరలించబడింది. ప్రస్తుతం ఇక్కడ మూడు ఇటుక బట్టీలు పని చేస్తున్నాయి దంపుడు బియ్యం సొసయిటీ 1958 లో మూత బడింది.

వ్యాయామ క్రీడలలో ఈ గ్రామానికి ఒక ప్రత్యేకమైన స్థానం. గౌరవం వున్నాయి. 1959-60 లో 'ఆంధ్ర ఫెదర్ వెయిట్ ఛాంపియన్‌షిప్' (132-142 బరువు) సంపాదించిన శ్రీ వ్రారంపూడి వెంకటరామా రెడ్డి గారు ఇక్కడివారే. 1959 లో రాష్ట్ర స్థాయిలో ఆయన స్థాపించిన 'స్నాచ్ రికార్డు' (185) 1969 వరకూ కూడా ఎవరూ అధిగమించలేకపోయారు. మరో క్రీడాకారుడు కీ॥ శే॥ శ్రీ కోనాల ఈశ్వర రెడ్డి గారు 1950 లోను, 1960 లోను లయిట్ వెయిట్‌లో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ, స్థానం సంపాదించి ఘనత వహించారు. తేనె పట్టు పరిశ్రమను స్థాపించారు. ఈ క్రీడాకారులు 1960 లో సావరంలో 'శ్రీ చంద్రారెడ్డి మెమోరియల్ వ్యాయామ కళాశాల' స్థాపించి తర్వాత వ్యాయామ క్రీడాకారులను తయారు చేశారు. ప్రఖ్యాత వ్యాయామ క్రీడాకారుడు శ్రీ కామినేని ఈశ్వరరావు గారు ఈ కళాశాలకు విచ్చేసి ఇక్కడి యువ క్రీడాకారులను ఆశీర్వదించి ప్రోత్సహించారు. ప్రస్తుతం ఈ కళాశాలకూడా జీర్ణావస్థలో వుంది. ప్రభుత్వం ప్రోత్సాహం యిచ్చి క్రీడాకారులకు ఆసకి వుంటే వెంకట్రామా రెడ్డిగారుదేశానికి పేరు తెచ్చే మరెందరో యువకులను తన వారసులుగా తీర్చి దిద్దగలరు.

వ్యవసాయ రంగంలో ఇక్కడి రైతులు సాధించిన ప్రగతి ప్రత్యేకముగా పేర్కొనదగినది. ఇక్కడ పంట పొలముయొక్క విస్తీర్ణము 350 ఎకరాలు. 70 శాతం వరి, 30 శాతం చెఱకు పండిస్తూ వుంటారు. మొత్తం భూమిలో 80 శాతం భూమి నందు సంవత్సరమునకు రెండు పంటలు మరియు పైరు ధాన్యము పండుతాయి. 1954 లో వీరికి విద్యుచ్ఛక్తి లభించింది. వ్యవసాయ క్షేత్రంలో విద్యుచ్ఛక్తి వాడకాన్ని, అందలి వుపయోగాన్ని వీరు సంపూర్తిగా తెలుసుకొన్నారు. వీరు సమిష్టిగా 'ఫిల్టర్ పాయింట్ సొసయిటీ' స్థాపించుకొన్నారు. 1954లో అప్పటి కేంద్ర ఆర్థిక శాఖామాత్యులు శ్రీ సి. డి. దేశ్‌ముఖ్‌గారు ఈ గ్రామంలో 'ఫిల్టర్ పాయింట్ ఇరిగేషన్ ప్రాజెక్టు' కు ప్రారంభోత్సవం చేసారు. ఇటువంటి ప్రాజెక్టు ప్రారంభించిన గ్రామాలలో ఈ రాష్ట్రంలోనే ఇది రెండవది. ప్రస్తుతం 30 వరకు ఫిల్టర్ పాయింట్లు వున్నాయి. వర్షాలతో ప్రమేయం లేకుండా, నదీ జలాలు లాభించకపోయినా ఫిల్టర్ పాయింట్ల ద్వారా వచ్చే నీటిలో ఇక్కడి కాలువలు జీవ నదుల్లా ప్రవహిస్తూనే వుంటాయి. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం ఎన్ని ప్రణాళికలు వేస్తున్నా రైతులు ఎప్పుడు ఏదో ఒక అవాంతరాన్ని ఎదుర్కొనవలసివస్తూనే వుంది. 5, 6 సంవత్సరాలుగా దాళ్వా పంట కాలంలో విద్యుచ్ఛక్తి కొఱత విపరీతంగా ఏర్పడి కర్షకులకు నష్టాన్ని కలిగిస్తోంది. ఇక్కడి కర్షకులు అంతులేని ఆత్మ స్థైర్యం తో 20 ఆయిల్ ఇంజన్లనుకూడా స్థాపించుకొని ఉత్పత్తిని సాధిస్తూనే వున్నారు. గోదావరి ఆనకట్ట గండిపడిన కారణంగా ఈ సంవత్సరంలో ఈ రైతులు కొంత నష్టానికి గురయ్యైనా, ఉత్పత్తి తగ్గినా చుట్టు పక్కల గ్రామాలకన్నా మెరుగు. ప్రభుత్వం వీరికి 6 ఆయిల్ ఇంజన్లను ఈ సంవత్సరం ఋణంగా ఇచ్చింది. ఎక్కువ మంది రైతులకు స్ప్రేయర్లు, డస్టర్లులాంటి చిన్న చిన్న పరికరాలు వున్నాయి. పరస్పర సహకారంతో అవి అందరు రైతులు ఉపయోగించుకుంటారు. గ్రామంలో రెండు ట్రాక్టర్లున్నాయి ; 1963 లో రైతులంతా కలసి 'శ్రీ భీమేశ్వర సేవా సహకార పరపతి సంఘం' ఏర్పరచుకొన్నారు. ఈ సంస్థ ప్రతి సంవత్సరం కుల, మత భేదాల ప్రసక్తి లేకుండా అందరికీ 1 లక్ష 50 వేల రూపాయలవరకు అప్పుయివ్వడమే కాకుండా, క్రిమి సంహారక మందులు, ఎరువులు తక్కువ ధరలకు పంపిణీ చేస్తుంది. ప్రస్తుతం ఈ సంస్థ గవర్నమెంటువారు నియమించిన ప్రత్యేక అధికారి నిర్వహణలో వుంది. పుట్టెడు పంటనిచ్చే పొట్టి వరి వంగడాలను వీరు చాలా కాలంగా పండిస్తున్నారు, గత 2 సంవత్సరాలుగా వీరు 'జగన్నాథ్'అనే వరి వంగడాన్ని ఎక్కువగా పండిస్తున్నారు. 1975-76 లో వీరు ఎర్లీ దాళవాను సాగుచేసి అతి స్వల్ప వ్యవధిలో, కాలవ నీరు లభించకపోయినప్పటికీ ఇంజన్ల సహాయంతో అధికోత్పత్తిని సాధించారు. అందువలననే ఈ గ్రామం జిల్లాకే ఉత్తమంగా ఎన్నిక కాగలిగింది. వరి తరువాత చెఱకు వీరిముఖ్యపంట. ఇక్కడ చెఱకునుండి బెల్లం తయారుచేసే పరిశ్రమ చాలా కాలంనుండి అభివృద్ధి చెందుతూ వచ్చింది. ప్రస్తుతం 15 క్రషర్లు వరకూ ఇక్కడ పనిచేస్తూ వందలాది ప్రజలకు జీవ నాధారం అయింది. ప్రతి దినం ఇక్కడి నుండి బండ్లద్వారా, లారీలద్వారా బెల్లం ఎగుమతి అవుతూ వుంటుంది. అంతేకాకుండా మినుములు, పెసలు, కందులు మున్నగు పప్పు ధాన్యములు, ఆకు కూరలు, కాయగూరలు కూడా వీరు బాగా పండిస్తారు. ఈ చుట్టు ప్రక్కల 20-30 గ్రామాలకు, నగరాలకు కాయగూరలు అనుదినం సరఫరా అవుతూ వుంటాయి. పాడి పరిశ్రమకూడా అభివృద్ధి చెందుతూ వుంది. పాల సరఫరా కేంద్రంద్వారా వీరు పాలనువిక్రయిస్తూ వుంటారు. 1958 లో ఈ గ్రామాన్ని సందర్శించిన అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి 'శ్రీ నీలం సంజీవరెడ్డి' గారు వీరు వ్యవసాయ రంగంలో వేస్తున్న ముందంజను గమనించి ఇదొక ఆదర్శ గ్రామం అని ఆనాడే అభినందించారు.

ఇక్కడ కుల, మత భేదాలు కనిపించవు. అనురాగానికి పరిశ్రమకు ఇక్కడివారు ప్రతిరూపాలు గ్రామంలో అన్ని వృత్తి విద్యలవారు వున్నారు. శివాలయం, 3 రామాలయాలు వున్నాయి. గ్రామస్తులంతా కలసి హరిజనవాడలో ఒక రామాలయాన్ని నిర్మించారు. శివాలయంలో జరుగు నిత్యాభిషేక కార్యక్రమము వీరి

భక్తి శ్రద్ధలకు తార్కాణము. ప్రతి సంవత్సరము అమ్మవార్లకు జాతరలు జరుగుతూ వుంటాయి. పర్వదినములలో పురాణములు ఉపాటకములు, బుర్రకథలు, హరికథలు మున్నగు సాంస్కృతిక కార్యక్రమములు నిర్వహించబడుతూ వుంటాయి. గ్రామ పంచాయతీకి గల సామాజిక రేడియో ప్రతిదినం ఉదయం 6 గం॥ నుండి రాత్రి 10 గంటలవరకు క్రమం తప్పక కార్యక్రమాలు వినిపిస్తూనే వుంటుంది.

ఇక్కడి యువకులలో 80 శాతం అక్షరాస్యులు. ఎక్కువ మంది పట్టభద్రులు, యూనివర్సిటీస్థాయి విద్య నభ్యసించినవారు కలరు. ఆధునిక వేషభాషలకు, భేషజాలకు వీరు పోరు. వీరిలో చాలామంది జీవనోపాధికోసం పట్టణాలకు ఎగబ్రాకక మాతృ భూమినందే వ్యవసాయ, వాణిజ్య రంగాలలో స్వయం ప్రతిభతో పురోగమిస్తూ గ్రామాభ్యుదయమునకు పాటు పడుచున్నారు. వీరంతా యువజన సంఘంగా ఏర్పడి 1969లో ఒక గ్రంథాలయాన్ని, 1970 లో ప్రజా టెలిఫోన్ సౌకర్యాన్ని ఏర్పరిచారు. 1976 లో రోడ్ల విస్కృత కార్యక్రమం చేపట్టారు గ్రంథాలయంలో ప్రస్తుతం 800 వరకు పుస్తకాలు వున్నాయి. 20 సంవత్సరాల క్రితం ఈ గ్రామానికి విచ్చేసిన సినీనటులు పద్మశ్రీ నాగయ్యగారు, కవిపద్మశ్రీ దేవులపల్లి క్రిష్ణశాస్త్రిగారు ఇక్కడి కళాకారులకు ప్రోత్సాహాన్నిచ్చారు. ఇచ్చటి యువకులలో కవులు, గాయకులు, నటులు వున్నారు. నేడు గ్రామంలో అనేక నాటక సమాజాలు వున్నాయి. నిరక్షరాస్యులయిన రైతులకు, గ్రామస్థులకు పత్రికలు, పుస్తకములు వినిపించి వారిలో విజ్ఞానాన్ని కలిగించుట ఇక్కడి విద్యారులు చేస్తున్న మహత్తరమయిన పని.

మన ప్రధాని ప్రకటించిన 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమంలోని కొన్ని అంశాలు ఇక్కడ చాలా కాలం నుండి అమలులో వున్నాయి. వెట్టిచాకిరీ అనే పదం వీరి నిఘంటువులో లేదు. వడ్డీ వ్యాపారుల బెడద వీరికి ఏనాడూ లేదు. పేకాట, బ్రాకెట్టు లాంటి జూదములు ఇక్కడ కానరావు. మద్యపానం అతి తక్కువ. 20 సూత్రాల పథకం ద్వారా గ్రామస్తులకు చాల మేలు చేకూరుతున్నది. హరిజనులకు ఇండ్ల స్థలములు ఇవ్వబడ్డాయి. బలహీన వర్గాలవారికి పాడి పశువులను కొనుగోలు చేయుటకు ఋణాలు ఇవ్వబడ్డాయి. ఇక్కడ అల్లరులు, ఆందోళనలు ఉత్పన్నం కావు. వారిలో వారికి చిన్ని గొడవలు వచ్చినా సర్పంచ్‌గారి సమక్షంలో తీర్చుకుంటూ వుంటారు.

ఈ గ్రామానికి ప్రభుత్వంనుంచి ఆర్థిక సహాయం ఇంకా అందాలి, వీరికి గ్రామ పంచాయతీ భవనం లేదు. గ్రంథాలయములో గ్రంథముల కొఱత. మహిళా మండలి కార్యక్రమములకు ప్రోత్సాహం లేదు. పాఠశాలలో పిల్లల సంఖ్యకు తగిన నిష్పత్తి ఉపాధ్యాయులు లేరు. మరుగుదొడ్డి సౌకర్యములు సరిగా లేవు. వీటన్నిటికి ప్రభుత్వ సహాయం లభిస్తే ప్రజలు సహకారంతో తమ గ్రామాన్ని భూతల స్వర్గంగా చేసుకోగలరు. ఈ గ్రామం చుట్టుప్రక్కల గ్రామాలకు ఆదర్శప్రాయంగా చాలా కాలంగా భావించబడుతోంది. ఈనాడు వ్యవసాయ రంగంలో సాధించిన ప్రగతికి ఉత్తమమయినదిగా వారికి గుర్తింపు లభించింది మరింత ప్రోత్సాహం, ఆర్థిక సహాయం వారికి లభిస్తే ఈ గ్రామం జిల్లాకే కాదు, రాష్ట్రానికే మణిదీపిక కాగలదు.

11-11-76 న సామర్లకోటలో జరిగిన రైతు దినోత్సవ సభలో ఈ గ్రామమునకు 'మిస్టర్ టో వర్' (పవర్ స్ప్రేయర్) బహుమతిగా ఇవ్వబడింది.

రాజ్యాంగములో మార్పులు

(38వ పేజీ నుండి)

ట్రిబ్యునలు

ఉద్యోగుల సేవానిబంధనలకు సంబంధించిన ట్రిబ్యునలును ఏర్పాటు చేస్తూ శాసనం చేసే అధికారం పార్లమెంటుకు ఒక్కదానికే ఇచ్చారు. ఈ అధికారం రాజ్య శాసనసభలకు లేదు. కేంద్ర ఉద్యోగులకు వేరుగా — రాజ్య ఉద్యోగులకు వేర్వేరుగా ట్రిబ్యునలులను ఏర్పాటు చేయవచ్చు. రాజ్య విధాన మండలులకు కొన్ని ఇతర ట్రిబ్యునలులను మాత్రం యేర్పాటు చేస్తూ శాసనాలు చేసే అవకాశం ఉంది. పన్నుల విధింపు నిర్ధారణ, వసూలు, అమలు విషయంలోను, విదేశ మారక విషయంలోను, కస్టమ్సు విషయములోను, పారిశ్రామికులు కార్మికులకు చెందిన విషయంలోను అర్బన్ సీలింగ్ ఎలెక్షను విషయంలోను అత్యవసర వస్తువుల ఉత్పత్తి పంపిణీ సరఫరాల విషయంలోను ట్రిబ్యునలులను ఏర్పాటు చేయవచ్చు.

ముగింపు

ఇన్ని మార్పుల్లో అతి ముఖ్యమైన విషయం "సామ్యవాదైక ప్రజాస్వామిక గణరాజ్యమీ దేశం" అనేది. మనిషి తన బ్రతుకు తాను బ్రతకాలి. శ్రమపడి పనిచేయాలి. కాని అతడి హక్కులు, ఆపేక్షలు సమాజ ఆపేక్షలకు వ్యతిరేకం కారాదు. వ్యక్తి హక్కులు సమాజ హక్కులకు దోవ నిచ్చెయ్యాలి ఇదీ కీలకం. ప్రస్తావనలోని పునాది. ఇది పాటిస్తే సర్వమూ కరతలామలకమే.

సీరియల్:

మహాభారతము

శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

(విరాట పర్వము)

101

ఆ మాటలు విని సుదేష్ణయిట్లనెను:-

"సుందరీ! నిన్ను తలపైన పెట్టుకొని ఆదరించెదను. ఒకవేళ రాజు నిన్ను ఇచ్చట ది0చుటకు ఇష్టపడకున్నను నేను తప్పక నాకడ ఉంచుకొనెదను. ఈ రాజభవనమునందున్న స్త్రీలే ఆసక్తితో నిన్నుచూడ పురుషులు నీ యెడ మోహితులగుదురని చెప్పవలసిన యక్కర లేదు. నా భవనమునందున్న వృక్షములుగూడ నిన్ను చూచుటకై వంగినవాయన్నట్లు వంగియుండగా నిక పురుషులమాట చెప్పనేల? విరాటరాజు ఒకవేళ నిన్ను చూచినచో, నీ మానవాతీత రూప సౌందర్యములుగల నీ శరీరమును చూచి నన్ను విడిచి నీ యందే ఆసక్తుడగును. సుందరీ! నీవు ఏ పురుషుని చూచినను అతడు సంపూర్ణముగా నీయెడల కామమోహితుడై నీకు వశుడు కాగలడు. ఏ పురుషుడు సర్వదా నిన్నుచూచునో, అతడు తప్పక కామవ్యాకులుడగుననుటలో సందేహము లేదు. నిన్ను నాయింటిలో నుంచుకొనిన నేను, ఆత్మహత్యకై చెట్టుపైకి ఎక్కిన వానిగతికి లోనగుదును. ఎండ్రకాయ తన మృత్యువు కొరకే గర్భధారణ చేసికొనుగతి, నిన్ను నాయింటిలో నుంచుకొనినందువల నాకు పట్టును."

ఆ మాటలు విని ద్రౌపది సుదేష్ణతో నిట్లనెను:

"దేవీ! నన్ను విరాటరాజుగాని, లేక మరి యేయితర పురుషుడుగాని పొందజాలడు, యువకులైన గంధర్వులు నా పతులు ఐదుగురున్నారు. వారు మహా బలపరాక్రమవంతులైన యొక గంధర్వరాజు యొక్క పుత్రులు. (పాండురాజు గంధర్వ రాజుతో సమానుడు అని భావము.) వారు ఎల్లప్పుడు అదృశ్యముగా నుండి నన్ను రక్షించుచుందురు. నేను కూడ స్వయముగా శక్తిమంతురాలను. ఇతరుల ఆక్రమణకు లోబడుదానను కాను. నన్ను ఎవ్వరుగూడ బెనకకాలరు. నేను సేవచేయు నింటిలో, ఎవరు నాకు వారి యెంగిలి అన్నము పెట్టరో, తమ కాళ్ళను నా చేత కడిగించుకొనరో, అట్టి వారి యెడల గంధర్వులు ప్రసన్నులై యుండెదరు. ఎవరు నన్ను సామాన్య స్త్రీలనువలె బలాత్కరించి పొందదలచెదరో, అట్టివారిని ఆ రాత్రియే పరలోకమునకు నా పతులు పంపెదరు. ఎవరుగూడ నా పాతివ్రత్యమును భంగపరచ జాలరు. నాపతులు బలవంతులు, తీవ్రస్వభావము గలవారు. గుప్తముగా నన్ను సర్వదా రక్షించుచు నాపై కన్నువేసినవారిని కఠినముగా దండింతురు" ఆ మాటలు విని సుదేష్ణాదేవి ద్రౌపదితో నిట్లనెను. "అలాగైనచో నిన్ను నా యింటిలో నుంచుకొనెదను. నీవు యితరుల ఎంగిలిగాని, పాదములనుగాని తాకవలసిన యవసరము లేదు."

"జనమేజయా! ఈ విధముగా సుదేష్ణచేత ఆదరింపబడి ద్రౌపదీదేవి ఆ నగరమునందు, తన పాతివ్రత్యమును కాపాడుకొనుచుండెను, ఆ నగరము నందు ఆమెను ఎవరుగూడ గుర్తుపట్టజాలనట్లుగా నుండెను." అని చెప్పి వైశంపాయన మహాముని జనమేజయునితో తరువాతి వృత్తాంతమిట్లు చెప్పదొడగెను.

సహదేవుడు విరాటసభకు పోవుట

"సహదేవుడు గోపాల వేషభాషలతో విరాటరాజు వద్దకు పోయెను. అక్కడ రాజభవన సమీపముననే యున్న గోశాలకు పోయి నిలిచియుండెను. అతనిని రాజు ప్రాసాదమునుండి విరాటరాజు చూచి సేవకులను పిలిపించెను. మహా ప్రతిభాశాలిగా వచ్చుచున్న సహదేవుని చూచి విరాటుడు విస్మయము చెంది యెదురేగి యాతనిని తోడ్కొనివచ్చెను. "నీవెవడవు? ఎవని పుత్రుడవు? ఎక్కడినుండి వచ్చితివి? ఏ పని చేయగోరి వచ్చితివి? నిన్నెప్పుడు నేను చూడలేదు. నిశ్చయముగా చెప్పుము." అని విరాటరాజు అడిగెను. ఆయిరువురికి నిట్లు సంభాషణ జరిగెను:

సహ : "రాజా! నేను వైశ్యజాతివాడను. నా పేరు 'అరిష్టనేమి' యందురు. నేను పాండవుల వద్ద గోవుల రక్షణము - వాటి గణనము మొదలైన పనులయందు నియుక్తుడనై యుంటిని. ఇప్పుడా పాండవులెక్కడనున్నారో తెలియక, నీకడ నివసించుటకు వచ్చినాను. ఏ పనియు చేయకుండ జీవనము

గడపుట శక్యము కాదు. నీవు దప్ప నితరులవద్ద వసించుటకు నాకు ఇష్టములేదు."

విరా : "భద్రపురుషా! నీవు బ్రాహ్మణుడవో లేక క్షత్రియుడవో అయియుందువు. సమస్త భూమండలము నేలు చక్రవర్తి వంటి రూపముతో ప్రకాశించుచున్నావు. వైశ్యకర్మ- అనగా గోపాలనము నీకు యోగ్యమైనది కాదు ఏ రాజు ఏ దేశము నుండి వచ్చితివి? ఏ కళను నీవు నేర్చితివి? మా వద్దనీవు సర్వదా ఏ పని చేయుచునుండగలవు? నీకు వేతన మెంతకావలెను."

సహ : "యుధిష్ఠిర మహారాజు వద్ద ఉత్తమ గోవర్గములు ఎనిమిది లక్షలు ఉండెను. ఒక్కొక వర్గమునందు నూరు నూరు గోవులుండెను. ఇవిగాక యితర విధములైన గోవుల వర్గములు ఒక లక్ష, మరియు అటువంటివే యితర వర్గములు రెండు లక్షలు ఉండెను. ఒక్కొక్క వర్గము నందు నూరు నూరు గోవులుండెను. ఆ గోవుల పర్యవేక్షణమునందు గణనమునందు నేను నియుక్తుడనై యుంటిని. వారు నన్ను 'తంతిపాలుడు' అను పేరుతో పిలుచుచుండిరి. నాలుగు దిక్కుల యందు పది యోజనముల (ఆమడలు)విస్తీర్ణము వరకు ఉన్న గోవుల యొక్క భూత-భవిష్యత్-వర్తమాన సంఖ్యలు అన్నియు నాకు తెలిసియుండెను ఈ మొత్తము గోవుల సమాచారమంతయు నాకు తెలిసియుండెను. ఈ నా గుణములన్నియు యుధిష్ఠిర మహారాజునకు బాగుగా తెలిసియుండెను. నా యెడల యుధిష్ఠిరుడు మిక్కిలి సంతుష్టితో నుండెను. ఏయే ఉపాయములచేత గోవుల సంఖ్య అభివృద్ధి చెందునో, వాటికి రోగములు రాకుండనుండునో ఆ ఉపాయములన్నియు నాకు తెలియును మహారాజా! ఈ కళలన్నియు నేను బాగుగా నేర్చుకొందును. ఇదియేగాక ఉత్తమ జాతి వృషభములనుగూడ నేను ఎరుగుదును. అట్టి వాని మూత్రమును మూర్కొనినంత మాత్రమున గొడ్డుటావులుగూడ గర్భధారణపొంది సంతానోత్పత్తికి యోగ్యములగును".

విరా : తంతిపాలా! నావద్ద ఒక లక్ష గోవులున్నవి. వాటిలో కొన్ని ఒకటే రంగు కలవి, మరికొన్ని మిశ్రిత వర్ణములు గలిసియున్నవి. ఈవిధముగా వివిధ వర్ణములతో నొప్పారుచున్న గోవుల నన్నింటిని ఈనాటినుండి నీ యాధీనములో నుంచెదను.

"జనమేజయా! ఈవిధముగా సహదేవుడు విరాటరాజుచేతగాని, ఆదేశ ప్రజలచేతగాని తెలియబడకుండా అక్కడనే నివసించుచుండెను. అతడు కోరిన వేతనమును విరాటరాజు అతనికిచ్చుచుండెను." అని వైశంపాయన మహాముని చెప్పి తరువాతి వృత్తాంతమును జనమేజయ మహారాజునకు ఇట్లు చెప్పదొడగెను.

అర్జునుడు విరాట సభకు పోవుట :

"జనమేజయా! ఆ తరువాత విరాటరాజుకు ఆ సమీపమునందున్న యొక మట్టి దిబ్బపై నిలిచియున్న యొక పురుషుడు కనబడెను. అతడు ఆజానుబాహుడు. స్త్రీలు ధరించు వేషభూషణములను ధరించియుండెను చెవులకు కుండలములు, చేతులకు శంఖముల గాజులు, వాటిపైన బంగారు కంకణములు తొడుగుకొనియుండెను. గంభీరమైన మదగజగమనముతో నతడు విరాటుకడకు వచ్చి నిలిచెను

"కపటవేషములో తన స్వరూపమును దాచుకొని విరాజిల్లుచు వచ్చిన యర్జునునిచూచి విరాటరాజు సభాసదులతో నిట్లనెను :- "ఇతడెక్కడినుండి వచ్చినవాడో! ఇంతకు పూర్వమెప్పుడుగూడ నేను ఇట్టి పురుషుని చూడలేదు. ఆమాటకు సభ్యులలో నెవడుగూడ బదులు చెప్పజాలకుండిరి. అప్పుడు విరాటరాజు ఆశ్చర్యముతో నర్జునుని చూచెను. వారిరువురికి నిట్లు సంభాషణ జరిగెను :-

విరా : భద్రుడా! నీవు ధైర్యము బలము గలిగి దేవతలతో సమానుడవుగా నున్నావు. నీ శరీరకాంతి శ్యామముగానున్నది. గజయూథపతివలె గంభీరముగా తరుణరూపములో నున్నావు. వెంట్రుకలు విరియబోసుకొని స్త్రీల ఆభరణాలను ధరించియున్నావు. మెడలో పూలమాలికను ధరించినావు. స్త్రీజనోచిత వేషమున నున్నప్పటికి నీవు తద్విపతరీముగా ధనుర్బాణ కవచములను ధరించు వీర పురుషునివలె శోభిల్లుచున్నావు. నీవు రథాది వాహనములపైన గూర్చుని యిచ్చానుసారముగా నా పుత్రునివలెగాని, నావలెగాని ఇక్కడ ఉండుము. నేను వృద్ధుడనైనాను, రాజకార్యములను విడువదలచుచున్నాను, ఈ మత్స్య దేశమును పాలింపుము. నీవంటి గంభీరోన్నత రూప సంపన్నుడు నపుంసకుడుగానుండడు అని తలచుచున్నాను."

అర్జు: రాజా! నేను జెడ అల్లెదను, కుండలములను, పుష్పమాలికలను నిర్మించగలను. కప్పుకొను దుప్పట్లు (ఓణీలవంటివి) తయారు చేయగలను. స్నానము చేయించెదను. అద్దములను తుడచుట, వివిధములైన చందన రేఖలను తీర్చుట మొదలైన అలంకార క్రియలను చేయుటలో నాకు నేర్పుగలదు. నపుంసకులు, బాలకులు సాధారణ జనుల యెదుట సంగీత-నృత్యకర్మలు చేయుటయందు నాకు మంచి యోగ్యత యున్నది. స్త్రీల కొప్పులలో పూలు ముడుచుటవంటి పనులు చేయగలను. ఈ పనులు చేయుటలో స్త్రీలుగూడా నన్ను మించజాలరు.

విరా : నీవు నపుంసకుడనుటకు తగియుండలేదు. ఈ వేషములో నీవు మేఘావృతమైన సూర్యునివలె ప్రకాశించుచున్నావు. నీ ఆజానుబాహువులకు ధనుర్ధరత్వమే శోభిల్లును.

(సశేషము)

గ్రంథసమీక్ష

భారత నారి, నాడూ - నేడూ

(రచయిత్రి . ఇల్లిందల సరస్వతీదేవి; ప్రచురణ : యువ భారతి, 6 కింగ్స్‌వే, సికిందాబాదు 3.)

ఇల్లిందల సరస్వతీదేవి గారు తెలుగు పాఠకలోకానికి సుపరిచితులు భారత నారి-నాడూ-నేడూ అన్న యీ చిన్నపుస్తకంలో వేదకాలం నుండి నేటి వరకు స్త్రీలకున్న ప్రతిపత్తిని గురించి సమాజంలో వారికి గల స్థానాన్ని గురించి క్లుప్తంగా వివరించేరు. ఉపనిషత్తులలో, ధర్మశాస్త్రాలలో ప్రస్తుత న్యాయశాస్త్రంలో స్త్రీకి ఎలాటి హక్కులీయబడినవీ, ఆమెకు ఎలాటి గౌరవస్థానం ఉన్నదీ చెప్తుకుంటూ వచ్చేరు. మొదటినుండీ కూడా పుస్తకం చదువుతున్నంతసేపూ స్త్రీకి భారత దేశంలో చాలగౌరవమైన పవిత్రమైన స్థానం ఉన్నదనీ,దానిని నేటి స్త్రీలు (పురుషులుకూడా) గ్రహించక పోవటం వల్లనే స్త్రీలలో అశాంతి. కసి ఏర్పడి అనవసరంగా స్త్రీ పురుషుల మధ్య సామరస్యం ఉండకుండా పోయిందనీ రచయిత్రి చెప్పదల్చుకున్నట్లు మనకు కనిపిస్తుంది. కాని పుస్తకం చివర్లో మాత్రం చట్టాల వల్ల, గ్రంథాలవల్ల మనుషులు మారరనీ సమైక్యత సాధ్యం కాదనీ, స్త్రీపురుషులిరువురూ పరస్పరం అర్థం చేసుకుని, గౌరవించుకుని, కలసి కట్టుగా ఉన్నప్పుడే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమౌతుందనీ, చెప్తారు రచయిత్రి. స్త్రీ అంటే ఒక తల్లి, ఒక భార్య, ఒక కుమార్తె, యీసంగతి పురుషులు గ్రహించాలి - అంటారు రచయిత్రి.

కాని స్త్రీని ఒక వ్యక్తిగా, సమాజంలో పురుషుడితో పాటు ఆమెని కూడా బాధ్యత గల పౌరురాలిగా ఆలోచించి ఆమెకు మన సమాజంలో ఉన్నస్థానమేమిటో, ఉండవలసిన స్థానమేమిటో సరస్వతీ దేవిగారు చెప్పినట్లయితే బాగుండేది. తల్లిగా, భార్యగా, కుమార్తెగా తప్ప ఒక వ్యక్తిగా సమాజంలోని ఒక యూనిట్‌గా ఆమెకు స్థానం లేక పోవటమే నేటి స్త్రీల ఆందోళనలకు అశాంతికీ కారణం అన్న సంగతిని రచయిత్రి గ్రహించక పోవటం వల్లనే ముగింపు వాక్యాలు నేటి పరిస్థితులకు నేటి స్త్రీల ఆందోళనలకు పరిష్కారాన్ని చూపలేక పోయినవి.

రామాయణ కాలంలో స్త్రీకి గల గౌరవాన్ని స్త్రీల యెడల సత్పురుషులు ప్రవర్తించే విధానాన్ని లక్ష్మణుని

"నాహం జానామి కేయూరే
నాహం జానామి కంకణే
నూపురే త్వభిజానామి
నిత్యం పాదాభి వందనాత్"

అన్న వాక్యాలతో ఉదహరించేరు రచయిత్రి. ఐతే ఆదే రామాయణంలోని సీత భర్తచేత అడవులలో వదిలి పెట్టబడటం శీల పరీక్షకు నిలబడవలసివచ్చిరావటం రావణుడామెను ఎత్తుకు పోవటం మొదలైన స్త్రీజాతికి అవమానం కలిగించే విషయాలను గురించి ప్రస్తావించనే లేదు. ధర్మశాస్త్రాలలో, పురాణాలలో, కావ్యాలలో స్త్రీని ఎల స్తుతించేరన్నది కాదు మనకి కావలసింది. ఏ కాలంలోనైనా ఏ వ్యవస్థలోనైనా సగటు స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం సామాజిక గౌరవం ఎంతవరకు ఇవ్వబడింది అన్నదే ప్రశ్న. క్రీస్తు పూర్వము నాల్గవ శతాబ్దంలోనే కౌటిల్యుడు వితంతు పునర్వివాహం గురించి, భర్త దేశాంతర గతుడైనా, సాధువులలో కలిసినా స్త్రీ మరల వివాహం చేసుకోవచ్చునని వ్రాసినప్పటికీ 1829 లో ఆంగ్లేయులు జోక్యం చేసుకొని శాసనం చేసేవరకు సతీ సహగమనం నిరాటంకంగా సాగటం, ఈ నాటికీ వితంతువుల వివాహం ఒక పెద్ద సమస్యగా ఉండటం- ఇదంతా ఎందుకు జరుగుతున్నది? చదువుకుని ఉద్యోగాలు చేస్తున్న స్త్రీలకు కూడా కట్నం లేనిదే వివాహాలు జరగటం కష్టమవడానికి కారణం ఏమిటి? వీటికి జవాబులీ పుస్తకంలో లేవు సమాజంలో వర్గ భేదాలు ఎప్పుడు ప్రారంభమైనాయో అప్పుడే స్త్రీకి ఒక వ్యక్తిగా గుర్తింపు కూడా తగ్గిపోయింది. ఫ్యూడల్ వ్యవస్థలో స్త్రీ పురుషుని ఆస్తిలోని భాగం. పెట్టుబడి దారీ వ్యవస్థలో స్త్రీ ఒక విలాస వస్తువుగా వ్యాపార ప్రచార సాధనంగా ఉపయోగించబడుతోంది.

వర్గ సమాజం ఉన్నంత వరకు ప్రైవేటు ఆస్తిమీద హక్కులు తొలగించబడనంతవరకు స్త్రీకి గాని యితర బలహీన వర్గాలకు గాని నిజమైన గౌరవ ప్రపత్తులు రావు. సూక్తుల వల్ల హితోక్తులవల్ల పురుషులలో మార్పురాదు. పురుషజాతిని దుమ్మెత్తి పోసినంత మాత్రాన కూడా స్త్రీలకు గౌరవం రాదు. స్త్రీపురుష వివక్షత లేకుండా అర్హతలను బట్టి వ్యక్తి వికాసానికి దోహదం చేసే అవకాశాలు గల సామాజిక వ్యవస్థ ఏర్పడిననాడే స్త్రీకి పురుషుడితో పాటు అన్ని విధాల సమాన గౌరవ ప్రతిపత్తి లభిస్తుంది. ఈవిషయాన్ని పుస్తకం చివర్లో రచయిత్రి చెప్పినట్లయితే బాగుండేది.

—పరిమళా సోమేశ్వర్

జిల్లా వార్తలు


గ్రామీణ బ్యాంకుకు ప్రారంభోత్సవం

గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ పి. శేషావతారం, కడప జిల్లా కమలాపురం నియోజక వర్గంలోని వల్లూరులో రాయలసీమ గ్రామీణ బ్యాంకుకు ప్రారంభోత్సవం చేస్తూ ముఖ్యంగా సమాజంలోని వెనుకబడిన వర్గాల ప్రజలకు సహాయ పడడంలో పరిపాలనా యంత్రాంగం దృక్పథంలో మార్పు వచ్చిందని అన్నారు. బ్యాంకుల జాతీయకరణ తరువాత మహత్తరమైన విప్లవం తేబడిందని మంత్రి అన్నారు.

కరువు పరిస్థితులను తట్టుకోవడానికి వి. పి. ఎ పి. క్రింద ఒక కోటి రూపాయల ఖర్చుతో అమలు జరుపుతున్న వివిధ పథకాలను గురించి ఆయన వివరించారు కుటుంబ పరిమితి పాటించని వ్యక్తులు కరువును సృష్టించడానికి బాధ్యులవుతారని అందువల్ల ప్రతివారు కుటుంబ నియంత్రణను పాటించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. బ్యాంకులలో డబ్బు డిపాజిటు చేసినవారికి పాస్‌బుక్‌లను మంత్రి పంపిణీ చేశారు.

పాఠశాల భవనానికి మంత్రి శంకుస్థాపన

గృహ నిర్మాణం, వ్యవసాయ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పి ధర్మారెడ్డి, నవంబరు 21న వరంగల్ తాలూకాలోని దామెర గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, జవహర్‌లాల్ నెహూ్రు విజ్ఞాన మందిరానికి, పాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవనం నిర్మాణానికి దామెర గ్రామస్థులు 3 యెకరాల స్థలం యిచ్చారు.



చిన్నతరహా నీటి పారుదల శాఖామాత్యులు శ్రీ ఎ. వెంకటరెడ్డి నెల్లూరు టౌన్ హాలులో నవంబరు 1న ప్రధాని జన్మ దినోత్సవం సందర్భంగాను, మహిళా దినోత్సవం సందర్భంగాను ప్రసంగిస్తూన్న దృశ్యం.



ముఖ్యమంత్రి శ్రీ జె వెంగళరావు నవంబరు 7న నక్రేకల్‌లో సహకారసంఘ మహాసభలో ప్రసంగించారు.

హరిజనులు, గిరిజనులకు రూ. 20,000 మేరకు బ్యాంకు రుణాలను మంత్రి పంపిణీ చేశారు.

మంత్రి ఈ సందర్భంగా ప్రసంగిస్తూ అభివృద్ధి కార్యక్రమాల్లో చురుకుగానూ, ఉత్సాహంగానూ పాల్గొంటున్నందుకు గ్రామస్థులను అభినందించారు.

ఆ తర్వాత జిల్లా ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంస పత్రాలను మంత్రి పంపిణీ చేశారు.

సహకార మార్కెటింగ్ సంఘం కార్యాలయానికి ఆర్థిక మంత్రి ప్రారంభోత్సవం

ఆర్థిక, సమాచార శాఖా మంత్రి శ్రీ పిడతల రంగారెడ్డి, నవంబరు 14న ఒంగోలులో ప్రకాశం జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం కార్యాలయానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగిస్తూ ఉత్పత్తిదారుకు వారి ఉత్పత్తులకు సరసమైన ధర లభింపజేయడానికి, అదే విధంగా లాభనష్టాలు లేని రీతిగా సరసమైన ధరలకు అత్యవసర వస్తువు వినియోగదారులకు లభింపజేయడానికి ఒక ఏజెన్సీగా మార్కెటింగ్ సంఘాలు పని చేయాలి అన్నారు. తద్వారా వారు ధరల పెరుగుదలను అరికట్టవచ్చు.


సంఘం అధ్యక్షుడు శ్రీ బి. వెంకటేశ్వర రెడ్డి సభికులకు స్వాగతం చెప్పారు.

వరకట్న వ్యతిరేక మహాసభ


ఆర్థిక, సమాచారశాఖ మంత్రి శ్రీ పిడతల రంగారెడ్డి నవంబరు 8వ ఒంగోలులో యువజన కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తూ జాతిని విప్లవాత్మకమైన దోరణిలో ఉత్తేజ పర్చడానికి వరకట్ననిషేధం, కుటుంబనియంత్రణ కార్యక్రమాలు చాలా ముఖ్యమైనవని అన్నారు. వరకట్న వ్యతిరేకదినోత్సవాన్ని జరపాలనీ, చెట్లు నాటేకార్యక్రమాన్ని చేపట్టాలని యువజనులకు ఆయన విజ్ఞప్తి చేశారు.



ఎపెంబ్లీ స్పీకర్ శ్రీ ఆర్. దశరథరామిరెడ్డి నవంబరు 2న సూర్యాపేట మహాసభలో ప్రసంగిస్తున్న దృశ్యం. ముఖ్యమంత్రి రెవిన్యూ మంత్రి చిత్రంలో వున్నారు



యాత్రి శాఖామాత్యులు డా. సి హెచ్ దేవానందరావు నవంబర్ 20న కడపలో బలహీన వర్గాల వారికి ఆర్థిక సహాయపు మంజూరీ పత్రాలు అందజేశారు. కలెక్టరు శ్రీ పి ఎల్. సంజీవరెడ్డి ప్రక్కన వున్నారు.




పౌరపు పెంపకాలు, పునరావాస శాఖామంత్రి శ్రీమతి ఎం. లక్ష్మీదేవి నవంబరు 12న మార్తాండు గ్రామంలో "జ్యోతి మహిళామండలి"కి శంకుస్థాపన చేశారు.

అస్పృశ్యతా వ్యతిరేక దినోత్సవం

ఒంగోలు జిల్లా కలెక్టరు శ్రీ కె స్వామినాథన్ నవంబరు 19న ఒంగోలులో అస్పృశ్యతా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తూ, యీదురాచారాన్ని సంఘం నుంచి నిర్మూలించడానికి ప్రజలు సహాయ సహకారం చేయాలని అన్నారు. సర్వశ్రీ డి ప్రకాశం ఎం ఎల్ ఎ, ఎ కోటయ్య ఎం ఎల్ ఎ, డా డి రామనాథశాస్త్రిగారలు షెడ్యూలు కులాల వారి అభ్యుదయానికి ప్రభుత్వం చేస్తోన్న కృషిని శాఘించారు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బలహీన వర్గాల వారికి మంజూరు చేసిన ఋణాలకు సంబంధించిన చెక్కుల్ని ముఖ్య అతిథిగా విచ్చేసి శ్రీ శాంతకుమార్ పంపిణీ చేశారు



ఇటీవల శాసనసభ్యులు శ్రీ ఇ. అయ్యపరెడ్డి నంద్యాల తాలూకా మహానంది అటవీ పార్కులో మొక్కను నాటిన దృశ్యం

ప్రధాని జన్మదినోత్సవ వేడుకలు

నెల్లూరుజిల్లా కోట గ్రామములో కోటయువజన మండలివారు నవంబరు 19న ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ జన్మదినోత్సవాన్ని జరుపుతున్నారు. ఈ సందర్భంగా బలహీనవర్గాలవారు పాడి పశువులను కొనుగోలు చేసుకోవడానికి, రజకులు ఇస్త్రీపెట్టెలు కొనుక్కోవడానికి ఋణాలను పంపిణీ చేయడం జరిగింది


విద్యానగర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజరు శ్రీ ఎస్. రామకృష్ణ ఋణాలను పంపిణీ చేశారు.

గూడూరులోని పోలీసు సూపరింటెండెంట్ శ్రీ రంగప్ప యీ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు 20 అంశాల కార్యక్రమం క్రింద కల్పింపబడే సౌకర్యాలకు సక్రమంగా వినియోగించు

కోవాలని ఆయన ఋణాలు పొందిన వారికి సలహా యిచ్చారు. శ్రీ ఎస్. రామకృష్ణ, శ్రీ ఎస్. హనుమంత రెడ్డి కూడా ప్రసంగించారు. శ్రీ వి. రామ ప్రసాద్ వందన సమర్పణ చేశారు.

నెల్లూరులో మునిసిపల్ దుకాణాల సముదాయానికి మంత్రి ప్రారంభోత్సవం

మునిసిపల్ పరిపాలన శాఖామంత్రి శ్రీ చల్లా సుబ్బారాయుడు, నవంబరు 1న నెల్లూరులో రు. 3 లక్షల 75 వేల ఖర్చుతో నిర్మించిన దుకాణాలను సముదాయానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ పట్టణాల అభివృద్ధికి అవసరమైన ఆర్థిక వనరులను పెంపొందించుకోవడానికి మున్సిపాలిటీలు శ్రద్ధతో కృషి చేయాలని అన్నారు. పౌరులు తమ తమ ఇండ్లకు డ్రైనేజీ పద్ధతిని కల్పించుకోవాలని ఆయన సలహాయిచ్చారు. పట్టణంలో శానిటరీ పరిస్థితులను మెరుగుపర్చడానికి డ్రైనేజీల నిర్మాణానికి రు. 50 లక్షలు ఖర్చుఅయ్యాయని ఆయన అన్నారు.



ఆర్థికమంత్రి శ్రీ పి. రంగారెడ్డి డిశంబరు 5న గుంటూరులో శ్రీ పెండ్యాల నాగేశ్వరరావును సన్మానించినప్పటి దృశ్యం

చిన్నతరహా నీటిపారుదల శాఖామంత్రి శ్రీ ఎ. వెంకటరెడ్డి, ఉత్సవానికి అధ్యక్షత వహిస్తూ ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకున్నందువల్లనే నెల్లూరు జిల్లాలో సోమశిల, గండిపాడు ప్రాజెక్టు, కావలి–కనుపూరు కాలువ పథకాలవంటి ముఖ్యమైన నీటిపారుదల పథకాలను త్వరితగతిన అమలుజరపడానికి వీలైందని అన్నారు.

జిల్లా కలక్టరు శ్రీ పి. అర్జునరావు ప్రసంగిస్తూ పరిసర ప్రాంతాలలో పారిశుద్ధ్యాన్ని పెంపొందించడానికి మురికివాడలను అభివృద్ధి పర్చాలని కోరారు.



ఇటీవల నంద్యాల తాలూకా మహానంది అటవీ పార్కులో శాసనసభ్యుడు శ్రీ బి. వెంకటరెడ్డి మొక్కనాటిన దృశ్యం


సమిష్టి సహకార వ్యవసాయ సంఘం

మంత్రిగారు నెల్లూరు తాలూకాలోని ముదివర్తిపాలెం, నాగరాజు తోపులలో సహకార సమిష్టి వ్యవసాయ సంఘాలకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ భూములు పొందినవారు కష్టించి పనిచేస్తూ ఉత్తమ జీవితాన్ని గడపాలని ఉద్బోధించారు. చెడుఅలవాట్లన్నిటినీ విడిచిపెట్టి, తమ పిల్లల భవిష్యత్తు కోసం పొదుపును అలవర్చుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

ముదివర్తిపాలెం సహకార సమిష్టి వ్యవసాయ సంఘంలో 67 మంది షెడ్యూల్డు కులాల వారు వున్నారు. ఈ సంఘం ఆధ్వర్యంలో 27 ఎకరాల భూమి వుంది. నాగరాజుతోపు సంఘంలో



నవంబరు 1న తాడేపల్లిగూడెంలో లయన్సుక్లబ్ ఆధ్వర్యంలో 3 రోజుల మూగ, బధిర చికిత్సా శిబిరానికి అప్పటి కలెక్టరు శ్రీ జి. కుమారస్వామిరెడ్డి ప్రారంభోత్సవం చేశారు.



ప్రకాశంజిల్లా కలెక్టరు శ్రీ కె. స్వామినాథన్ నవంబరు 6 న పెద్రమిట్ట హరిజన కాలనీలో సామాజిక వారోత్సవాలు ప్రారంభించారు

70 మంది షెడ్యూలు కులాలు, వెనుకబడిన తరగతుల ప్రజల సహాయం లభిస్తున్నది. ఈ సంఘం ఆధ్వర్యంలో 59 ఎకరాల భూమి వుంది.

జిల్లా కలక్టరు శ్రీ సి అర్జునరావు సభకు అధ్యక్షత వహిస్తూ భూములను సేద్యం చేసుకొనువారి కౌలుపట్టాలను రద్దుచేయడం జరుగుకుందని అన్నారు

జిల్లాలో ఇంతవరకు 300 సహకార సమిష్టి వ్యవసాయ క్షేత్రాలను ఏర్పాటు చేశారనీ వాటి ఆధ్వర్యంలో 30 వేల ఎకరాల ప్రభుత్వ భూమి, 15 వేల ఎకరాల మిగులు భూమి వున్నదనీ, భూగర్భజలాలను వినియోగించుకొని ఈ భూములను సేద్యం చేయడానికి వీలుగా ఆర్థిక సహాయక సంస్థలన్నీ దాదాపు రు 2 కోట్ల మేరకు అందజేశాయని అన్నారు.

హరిజనవాడలో పాఠశాల భవనానికి శంకుస్థాపన

లఘుపరిశ్రమలమంత్రి రు 20 వేల ఖరీదు చేసే 5 పందుల పెంపక కేంద్రాలకు శనివారపు పేట గ్రామంలో ప్రారంభోత్సవం చేశారు. దగ్గిరాలలో 99 ఇండ్ల స్థలాల పట్టాలను హరిజనులకు పంపిణీ చేశారు అపూరుగ్రామంలో హరిజనవాడలో రు 10 వేలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు. నందిపురంలో గ్రామ పంచాయతీ భవనానికి ప్రారంభోత్సవం చేశారు పెదపాడులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ట్యూబెక్టమీ శిబిరానికి శంకుస్థాపన చేశారు ఇండియన్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంకు ఏలూరు బ్రాంచీలు బలహీనవర్గాల వారికోసం పాడిపశువులు, కుట్టుమిషనులు కొనుగోలుకు ఆర్థికసహాయం చేసిన రు. 1,39,00 లను 173 మంది బలహీనవర్గాల వారికి మంజూరు పత్రాల రూపంలో పంపిణీ చేశారు


తిరుపతి-మద్రాసుల మధ్య చందాదారుల ట్రంక్ డయలింగ్ సర్వీసుకు కేంద్రమంత్రి ప్రారంభోత్సవం

కమ్యూనికేషన్లశాఖ కేంద్ర మంత్రి డా శంకర్ దయాళ్ శర్మ నవంబరు 6 వ తేదీన తిరుపతిలో తిరుపతి-మద్రాసుల మధ్య చందాదారుల ట్రంక్ డయలింగ్ సర్వీసుకు ప్రారంభోత్సవం చేశారు ఈ సందర్భంగా మొట్టమొదట తమిళనాడు గవర్నరు శ్రీ మోహన్‌లాల్ సుఖాడియా ఫోను చేయడంతో ఈ సర్వీసు ప్రారంభమైంది తంతి తపాల శాఖ సభ్యులు శ్రీ యస్ యన్ రంగనాథం కార్యక్రమానికి అధ్యక్షత వహించారు పార్లమెంటు సభ్యులు శ్రీ పి. బాలకృష్ణయ్య ప్రసంగించారు టెలికమ్యూనికేషన్ల శాఖ ఆంధ్రప్రదేశ్ సర్కిల్, డైరెక్టరు శ్రీ కనకారావు అతిథులకు స్వాగతం చెప్పుతూ 8 నెలల స్వల్ప వ్యవధిలో 2 లక్షల టెలిఫోను కనెక్షను యిచ్చినట్లు తెలియజేశారు

తరువాత మంత్రి తిరుమలలో అన్నమాచార్య బొమ్మ వున్న ప్రత్యేక తపాలా ముద్రను విడుదల చేశారు

నిజాంసాగరుకు మరమ్మతులు

మధ్యతరహా నీటిపారుదల శాఖామాత్యులు, శ్రీ వి కృష్ణమూర్తి నాయుడు నవంబరు 5 వ తేదీన నిజామాబాదులో మాట్లాడుతూ రు 25 కోట్లవ్యయంతో నిజాంసాగర్ కు మరమ్మతులు చేస్తారని తెలియజేశారు ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవాల సందర్భంగా ఒక బహిరంగ సభనుద్దేశించి ప్రసంగిస్తూ దుర్భిక్షకు గురైన ప్రాంతాలలో సహాయక చర్యలు తీసుకుంటారని అన్నారు దేనాబ్యాంకు ట్రక్కుల కొనుగోలుకై ఆర్థిక సహాయం చేసిన పైకం రు 56 లక్షల సంబంధించిన రుణపత్రాలను 10 సైకిల్ రిక్షాలను ఆయన పంపిణచేశారు శాసనసభ్యుడు శ్రీ చక్రధరరావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు కలక్టరు శ్రీ టి వి. ఆనందకుమార్ జిల్లాలోని అభివృద్ధి కార్యకలాపాలను వివరించారు.



నవంబరు 1 న తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రిలో రోటరీక్లబ్బు ఆధ్వర్యం వహించిన 10 రోజుల కుటుంబనియంత్రణ శిబిరానికి అనంతపురం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డా॥ కృష్ణారావు జోనేకర్ ప్రారంభించారు.

అంతకుముందు మంత్రి సంజీవయ్య హరిజన కాలనీకి శంకుస్థాపన చేశారు.

మహిళలు చిన్నతరహా పరిశ్రమలు చేపట్టాలని మంత్రి ఉద్బోధ


చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ ఎర్రా నారాయణ స్వామి, వట్లూరు గ్రామంలో శ్రీ వివేకనందా మహిళామండలి సమావేశాన్ని ఉద్దేసిస్తూ ప్రసంగిస్తూ చిన్నతరహా పరిశ్రమలు ప్రారంభించేందుకు మహిళలు ముందుకు వస్తే ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని సాంకేతిక అవసరాలను సమకూరుస్తుందని అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక సహాయం చేసిన రు. 40 వేలకు సంబంధించిన మంజూరీ పత్రాలను మంత్రి పంపిణీ చేశారు.

బాలికల పాఠశాల భవనానికి పంచాయతీరాజ్ శాఖ మంత్రి శంకుస్థాపన

పంచాయతీరాజ్ శాఖామాత్యులు శ్రీ యల్. లక్ష్మణదాసు నవంబరు 5 వ తేదీన రాజాంలో ఒక బహిరంగసభను ఉద్దేశించి ప్రసంగిస్తూ. 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం అమలులో ఒక భాగంగా సన్నకారు రైతులను వడ్డీ వ్యాపారస్తుల బారి నుండి రక్షించే ఉద్దేశ్యంతో 5 ఎకరాల కంటే తక్కువ ఆస్తి గలిగిన సన్నకారు రైతులు వడ్డీ వ్యాపారస్థులకు రుణాలను తిరిగి చెల్లించాల్సిన అవసరంలేదు అని త్వరలోనే ఒకశాసనం రూపొందించ నున్నట్లు, ఈ మేరకు ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలియజేశారు. ప్రతి గ్రామంలోను న్యాయ పంచాయతీలను ఏర్పాటు చేసేందుకై పంచాయతీరాజ్య చట్టంలో వీలు కల్పించేందుకు ప్రభుత్వం యోచిస్తున్నదని ఆయన అన్నారు. 150 ఎకరాలకు చెందిన 200 బంజరుభూమి పట్టాలను హరిజనులకు మంత్రి పంపిణీచేశాక తరువాత సారధి గ్రామంలో 6 లక్షల రూపాయల వ్యయమయ్యే బాలికల పాఠశాల అదనపు బ్లాకునకు మంత్రి శంకుస్థాపన చేశారు.



ఇటీవల గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శ్రీ పి. శేషావతారం నంద్యాల తాలూకాలో మహానంది అటవీ పార్కుకు ప్రారంభోత్సవం చేశారు.



చిన్నతరహా పరిశ్రమల మంత్రి శ్రీ వై. నారాయణస్వామి నవంబరు 4 న పెదపాడు హరిజనులకు భూమి పట్టాలను పంపిణీ చేశారు.


రాయలసీమ యువజన సాంస్కృతిక ఉత్సవం ప్రారంభోత్సవం

విద్యాశాఖ మంత్రి శ్రీ ఎం. వి కృషారావు నవంబరు 9 న తిరుపతిలో రాయలసీమ యువజన సాంస్కృతిక ఉత్సవానికి ప్రారంభోత్సవం చేస్తూ సాంస్కృతిక వ్యవహారాలకు విడిగా ఒక డైరెక్టరేటును ఏర్పాటు చేసి రాష్ట్రంలో త్వరలోనే సాంస్కృతిక కార్యక్రమాలన్నిటినీ క్రమబద్ధం చేయాలనే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నదని అన్నారు. పురాతన సంస్కృతిని, లలితకళలను ప్రోత్సహించి పెంపొందించడానికి వీలుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు, విదేశాలలోని తెలుగు ప్రజల నిమిత్తం సాంస్కృతిక బృందాలను పంపుతారు.

ఆంధ్రప్రదేశ్ సంగీత అకాడమీ కార్యదర్శి శ్రీ బి కృష్ణం రాజు ఉత్సవానికి అధ్యక్షత వహించారు.

సూపర్ బజార్‌కు ఆర్థిక మంత్రి ప్రారంభోత్సవం

ఆర్థిక, సమాచార శాఖ మంత్రి శ్రీ పిడతల రంగారెడ్డి, నవంబరు 12న గిద్దలూరు తాలూకా కంభంలో సూపర్ బజార్ బ్రాంచికి ప్రారంభోత్సవం చేస్తూ సూపర్ బజార్లు బహుళ ప్రచారం లోకి రావలసిన అవసరాన్ని గూర్చి నొక్కిచెప్పారు. నిత్యావసర సరుకులు, యితర వస్తువుల ధరలను అదుపులో పెట్టడంలో సూపర్ బజార్లు ప్రముఖ పాత్ర వహించాలని ఆయన అన్నారు. సూపర్ బజార్లను పటిష్టమైన మార్గాలలో నిర్వహించడానికి సేవా తత్పరతతో కషించి పనిచేయాలని డైరెక్టర్లు, అధికారులను మంత్రి



నెల్లూరు జిల్లా న్యాయమూర్తి శ్రీ టి. ఎల్. ఎన్. రెడ్డి నవంబరు 14న బాలల దినోత్సవంనాడు బడి పిల్లలకు బహుమతులు పంచి పెట్టారు.

కోరారు ప్రజలు తమకు అవసరమైన వస్తువులకు ఇతరచోట్లకు పోకుండా ఉండే విధంగా సూపర్‌బజార్లలో అన్ని వస్తువులను విక్రయానికి ఉంచాల్సిన అవసరాన్ని గూర్చి ఆయన నొక్కి చెప్పారు.

ప్రభుత్వ ఉద్యోగులు సూపర్‌బజార్లలో సభ్యులుగా చేరి అవి కల్పిస్తున్న పరపతి సౌకర్యాలను వినియోగించుకోవాలని, తద్వారా సూపర్‌బజార్ల అభివృద్ధికి తోడ్పడాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. సూపర్‌బజార్లలో ఎరువులు, క్రిమిసంహారక మందులు, ఔషధాలను కూడా లభింపజేయాలని ఆయన కోరారు.

జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం అధ్యక్షుడు శ్రీ బి. వెంకటేశ్వరరెడ్డి ప్రసంగించారు.

సూపర్‌బజార్ అధ్యక్షులు శ్రీ బొంత రంగారెడ్డి సభికులకు స్వాగతం చెప్పారు

మంత్రి శ్రీ రంగారెడ్డి, కంభంలోని పట్టణ బ్యాంకు మంజూరు చేసిన రుణాల పత్రాలను వెనుకబడిన వర్గాలకు చెందిన 15 మందికి పంపిణీ చేశారు. ఈ రుణం రూ. 6 030 లు వివిధ వృత్తులకు వినియోగిస్తారు. కంభంలో మహిళా సహకార సంఘానికి కూడా మంత్రి ప్రారంభోత్సవం చేశారు.


సినిమా నటి శ్రీమతి జమున రమణరావు, కంభం రైల్వే స్టేషన్ సమీపంలోని కందులాపురంలో వెంకటేశ్వర మహల్ కొత్త థియేటరుకు ప్రారంభోత్సవం చేశారు. ఆమె ఈ సందర్భంలో ప్రసంగిస్తూ, గ్రామాలలో థియేటర్ల నిర్మాణానికి, చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తున్న కార్పొరేషన్‌ను, ప్రభుత్వాన్ని అభినందించారు.

గిద్దలూరులో వరకట్న వ్యతిరేక దినోత్సవం


ఆర్థిక, సమాచారశాఖ మంత్రి శ్రీ పిడతల రంగారెడ్డి నవంబరు 12న గిద్దలూరులోని శ్రీ వివేకానంద కళాశాల ఆవరణలో వరకట్న వ్యతిరేక దినోత్సవ సందర్భంగా జరిగిన బ్రహ్మాండమైన బహిరంగ సభలో ప్రసంగిస్తూ సాంఘిక స్వాతంత్ర్యాన్ని సాధించడానికి 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం, సంజయ్ గాంధీ 5 సూత్రాల కార్యక్రమాన్ని నిజాయితీతో అమలు జరపడానికి యువకులు ముందుకు రావాలని అన్నారు. సమాజంలో అమలులో ఉన్న వరకట్న పద్ధతిని నిర్మూలించడానికి తోడ్పడాలని యువజనులను, తల్లిదండ్రులను మంత్రి ఉద్బోధించారు. సినీనటి శ్రీమతి జమునా రమణారావు ప్రసంగిస్తూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించడానికి వీలుగా ప్రజలతో సన్నిహిత సంబంధం ఏర్పరచుకోవాలని తాను అభిలషిస్తున్నానని అన్నారు. వరకట్న పద్ధతి వల్ల తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న బాధలను ఆమె వివరిస్తూ వరకట్నాలను ఇవ్వరాదనీ, తీసుకోరాదనీ బాలబాలికలకు తల్లిదండ్రులకు ఆమె విజ్ఞప్తి చేశారు 3,000 మంది స్త్రీ, పురుష యువజనులు. తల్లిదండ్రులచేత ఆమె వరకట్న వ్యతిరేక ప్రతిజ్ఞను స్వీకారం చేయించారు. చలనచిత్ర పరిశ్రమాభివృద్ధి కార్పొరేషన్ జనరల్ మేనేజర్ శ్రీ ఇ. వి. సుబ్బారావు తదితరులు కూడా సమావేశానికి హాజరు అయినారు. ఆ తరువాత బుర్రకథ, కోలాటం, భజనలు. నాటక ప్రదర్శనలు నిర్వహించారు.

ఒంగోలులో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం

కోస్తా ఆంధ్ర ప్రణాళికా, అభివృద్ధి సంఘం అధ్యక్షులు శ్రీమతి బి. జయప్రద నవంబరు 12న ఒంగోలుకు 60 కిలోమీటర్ల దూరంలో మారుటూరులో కాజ్వేకు ప్రారంభోత్సవం చేస్తూ కనీస



నవంబరు 1న తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రిలో రోటరీ క్లబ్బు ఆధ్వర్యం వహించిన ప్రత్యేక కుటుంబనియంత్రణా శిబిరంలో వాసెక్టమీ శస్త్రచికిత్స పొందిన వ్యక్తికి ధోవతీ అందజేస్తున్న గవర్నరు ప్రతినిధి డా. జి. రాధాకృష్ణమూర్తి.



చిన్నతరహా పరిశ్రమల శాఖామంత్రి శ్రీ వై. నారాయణస్వామి పశ్చిమ గోదావరి జిల్లా రాయలకుంట గ్రామంలో నవంబరు 10 న పాఠశాలకు ప్రారంభోత్సవం చేశారు


అవసరాల కార్యక్రమం క్రింద విడుదల చేసిన డబ్బుతో ఈ రహదారి నిర్మించబడిందని అన్నారు. ప్రజల విజ్ఞాపన పత్రాలకు సమాధానం చెబుతూ అద్దంకి తాలూకాకు నాగార్జునసాగర్ నీరు లభింపజేస్తున్నారని, క్లష్టర్ పథకం అమలు పూర్తి చేసిన తరువాత మొత్తం తాలూకాకు విద్యుచ్ఛక్తి సరఫరా జరుగుతుందని అన్నారు.

ఆ తరువాత శ్రీమతి బి. జయప్రద కొట్లపల్లి యానాది కాలనీలో రూ. 19 వేల ఖర్చుతో నిర్మిస్తున్న ఏకోపాధ్యాయ పాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు. గిరిజన ప్రజల సమావేశంలో ప్రసంగిస్తూ విద్య ప్రాముఖ్యతను గుర్తించాలని దాని వల్లనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఆమె విజ్ఞప్తి చేశారు. గిరిజన మహిళలు తమ పిల్లల సంకరణతోపాటు విరామ సమయంలో కుట్టుపని నేర్చుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం అమలు సమీక్ష

చిన్నతరహా నీటిపారుదలశాఖ మంత్రి శ్రీ ఆనం వెంకటరెడ్డి నవంబరు 14న నల్గొండలో 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం అమలును సమీక్షిస్తూ భూసంస్కరణల ట్రిబ్యునల్స్ 32,687 కేసుల విషయంలో తీర్పులను ప్రకటించిందనీ, 1,318 కేసులకు సంబంధించి 2 869 ఎకరాల మిగులు భూమి ఉన్నట్లుగా ప్రకటించారని, ఉన్నతగల కోర్టులకు అప్పీలు చేసుకోని సందర్భాలలో భూములను స్వాధీనం చేసుకోవడానికి ప్రత్యేక ఉద్యమాలను నిర్వహిస్తారని అన్నారు. ఇండ్ల స్థలాల విషయాన్ని గూర్చి మంత్రి ప్రస్తావిస్తూ ప్రస్తుత సంవత్సరంలో రు. 7·38 లక్షలు వినియోగించారని ఈ విషయంలో అదనంగా రూ. 9 లక్షలు విడుదల చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్ శ్రీ టి. నాగరత్నం ప్రసంగిస్తూ జిల్లా స్థాయి వెనుకబడిన తరగతుల కార్పొరేషన్‌వారు 5 212 మందికి ప్రయోజనం కలిగే విధంగా రూ. 168 66 లక్షల ఖర్చుతో కూడిన ఆర్థిక తోడ్పాటు కార్యక్రమాన్ని అమలు జరుపనున్నారని రాష్ట్రంలో గరిష్ఠ స్థాయిలో కార్యక్రమాలు అమలు జరపడంలో ఈ జిల్లా ప్రథమ స్థానం వహిస్తుందని అన్నారు. షెడ్యూల్డు కులాల కార్పొరేషన్‌వారు 3 332 మంది హరిజనులకు లాభించే పథకాలను రూ. 78.61 లక్షల ఖర్చుతో అమలు జరిపారు. నవంబరు 10 నుండి డిసెంబరు 9 వరకు ప్రత్యేక కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను అమలు జరుపుతున్నారు. ఈ సంవత్సరం 10,975 శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఈ సంవత్సరం 117 గ్రామాల లక్ష్యానికిగాను 85 గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేశారని ఆయన అన్నారు. *





PRINTED BY THE DIRECTOR OF PRINTING, GOVERNMENT OF ANDHRA PRADESH AT THE GOVERNMENT CENTRAL PRESS HYDERABAD
PUBLISHED BY THE DIRECTOR OF INFORMATION & PUBLIC RELATIONS, ANDHRA PRADESH, HYDERABAD.

స్వీయ చరిత్ర ఆధారంగా - బుజ్జాయి



రిజిస్టరు. నెం. హెచ్. హెచ్. డి. 81

